Follow: @ANNTELUGU
12-06-2026
ANN తెలుగు
# మహా పత్రిక
శుక్రవారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 162 పేజీలు-08 వెల-రూ.1
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



విద్య, వైద్యమే దేశ ప్రగతికి

## ప్రాణవాయువు

### నీతి ఆయోగ్ వేదికగా తెలంగాణ అభివృద్ధి

- మెట్రో రెండో దశకు కేంద్రం పచ్చజెండా
- హైదరాబాద్‌కు ఐఐఎం, నిధులు ఇవ్వాలని ప్రధాని మోదీకి ముఖ్యమంత్రి విజ్ఞప్తి
- ఆరు మహానగరాలకు 'ఎం-6 టాస్క్‌ఫోర్స్' ఏర్పాటు చేయాలని కేంద్రానికి కీలక ప్రతిపాదన

03

టాప్ న్యూస్

## టైటిల్ వార్



- కవిత పార్టీపై ఫిర్యాదుల వెల్లువ
- 'టీఆర్ఎస్'పై బీఆర్ఎస్ తీవ్ర అభ్యంతరం
- ఈసీకి వెల్లువెత్తిన వందలాది అభ్యంతరాలు.

02

## మీనాక్షికి నిరాశ



- మధ్యప్రదేశ్ రాజ్యసభ సభ్యుల ఏకగ్రీవం
- బిజెపికి మూడు స్థానాలు

02

## ప్రియాంక గాంధీ టైం



- ఐదు రాష్ట్రాలపై ఫోకస్
- ప్రియాంకకు కీలక బాధ్యతలు
- మిషన్ 2026 ప్రారంభం

02

# రియల్ మాఫియా అరాచకం



### శ్రీకారం ఐకానిక్ వెంచర్లంటూ నయా మోసం

## ఫామ్ ల్యాండ్ పేరుతో అక్రమ దందా

- గజాల్లో విక్రయాలు.. గుంటల్లో రిజిస్ట్రేషన్లు
- ప్రజాప్రతినిధుల అండ.. చక్రం తిప్పుతున్న తహసీల్దార్లు
- హెచ్ఎండీఏ, డీటీసీపీ, రేరా అనుమతులు మచ్చుకైనా లేవు
- నాలా కన్వర్షన్ అసలే ఉండదు
- కోట్ల రూపాయలు కొల్లగొడుతున్న అక్రమార్కులు
- నారాయణఖేడ్ డివిజన్ మనూర్ మండలం దావూర్‌లో శ్రీనివాసుడు లీలలు




02


ఫామ్ ల్యాండ్ పేరుతో రియల్ మాఫియా అక్రమ దందాకు తెగబడుతోంది.. గజాల్లో విక్రయాలు జరుపుతూ గుంటల్లో రిజిస్ట్రేషన్లు చేస్తూ నయామోసానికి పాల్పడుతోంది... ప్రభుత్వ అనుమతులు గాలికి వదిలేసి గేటెడ్ కమ్యూనిటీ ని తలదన్నే విధంగా వెంచర్ చుట్టు ప్రహరి నిర్మించటమే కాకుండా విశాలమైన రోడ్లతో కస్టమర్ల కళ్ళకు కనికట్టు కట్టి కోట్ల రూపాయలు కొల్లగొడుతోంది.. ప్రజాప్రతినిధులు, అధికారులు అండగా నిల్వటంతో రియల్ మాఫియా ఈ ప్రాంతంలో చెలరేగిపోతోందని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి..హెచ్ ఎం డి ఏ, డి టీ సీ పీ, రేరా వంటి అనుమతులు దేవుడికేరుకా..వ్యవసాయ భూమిని వ్యసాయేతరా భూమిగా మార్చాలంటే నాలా కన్వెర్షన్ తప్పక చేయించాల్సి ఉంటుంది.. కానీ కాన్వెర్షన్ ఊసే ఉండదని స్థానికులు ఆరోపిస్తున్నారు.. నారాయణఖేడ్ మండలం దావూర్ గ్రామంలో శ్రీకారం ఐకానిక్ పేరుతో అక్రమంగా సాగిస్తున్న శ్రీనివాసుడు లీలలుపై ఏ ఎన్ ఎన్, మహా పత్రిక అందిస్తున్న ప్రత్యేక కథనం....



## ఏపీ లిక్కర్ స్కాంలో రాజ్ కేసిరెడ్డి అరెస్ట్

- హైదరాబాద్‌లో రాజ్ కేసిరెడ్డి ఇల్లు సహా 10 చోట్ల సోదాలు
- మనీలాండరింగ్ గుట్టు అంతా పట్టేసిన ఈడీ
- జగన్‌కు నోటీసులు ఇచ్చే అవకాశం వ్వబోతున్నారా?

02



## ఒమన్ తీరంలో తీవ్ర అలజడి

- ఇండియన్స్ టార్గెట్‌గా అమెరికా దాడులు
- భారతీయులున్న మరో నౌకపై మిస్సైళ్లు

02

## చలాన్ మెసేజ్‌తో పోలీసు అధికారికి సైబర్ మోసం

02

## ఐటీ కారిడార్‌లో 'గంజాయి సామ్రాజ్యం

"నీతూబాయ్" నెట్ వర్క్ తెలిస్తే షాక్ అవ్వాల్సిందే ఈగల్ కే చుక్కలు చూపిస్తున్న లేడీ డాన్ ధూల్ పేట నుండి వచ్చినా.. అప్ డేటెడ్ వర్షన్

03



## మామిడి పండ్లు తిని ఇద్దరు అక్కాచెల్లెళ్ల మృతి

విషాదం నింపిన పండ్ల ఆరగింపు.. ఆసుపత్రిలో మరో బాలిక లోతైన దర్యాప్తునకు హైదరాబాద్ సీపీ సజ్జనార్ ఆదేశం

03






## ప్రశ్నించే ప్రతి ఒక్కరూ 'కాక్రోచ్‌లే'

- ..నేను కూడా వారిలో ఒకడిని
- డీపీస్సీలో దారుణంగా మోసాలు
- మండిపడ్డ మాజీ సీఎం వైఎస్ జగన్

03

## టీఎంసీ విలీనం ఊహాగానమే

- క్షేత్రస్థాయి వరకు పోరాటం
- కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ.వేణుగోపాల్



03



ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్

## అగ్రస్థానంలోనే టీమిండియా

- రెండో స్థానంలో న్యూజిలాండ్

03



# రియల్ మాఫియా అరాచకం





(స్పెషల్ టాస్క్ ఫోర్స్ )

సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ రెవెన్యూ డివిజన్, మనూర్ మండలం దావూర్ పరిధిలో రియల్ మాఫియా అరాచకం రాజ్యమేలుతోంది. శ్రీకారం ఐకానిక్ పేరుతో బంజర భూములను ఎకరం లక్షల్లో కొనుగోలు చేసి ప్లాట్లుగా విభజించి రియల్ ఎస్టేట్ ముసుగులో కోట్ల రూపాయలు కొల్లగొడుతోంది. గజాల్లో అమ్మకాలు జరుపుతూ గుంటల్లో రిజిస్ట్రేషన్లు చేయటానికి తహసీల్దార్లు ప్రత్యక్ష్యంగా సహకరించటంతో పెద్ద మొత్తంలో ముడుపులు ముట్ట జెప్పుతున్నట్లు ఆరోపణలు వెల్లు వెత్తుతున్నాయి.ప్రజల ఆస్తులు, మాన ప్రాణాలను కాపాడతామని ప్రమాణాలు చేసిన అధికార పార్టీ నాయకులకు రియల్టర్లు అంతా సిండికేటై ఎకరానికి రు 2 లక్షలు చొప్పున ముట్టజెప్పట్టతో అక్రమంగా సాగుతున్న వెంచర్లను ప్రారంభోత్సవాలు చేస్తున్నారని సర్వత్రా ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. అందులో భాగంగా శ్రీకారం అనే మాయ కంపెనీ ఆయుష్మాన్ భవ పేరుతో 40 ఎకరాల్లో వెంచర్ ఏర్పాటు చేసి అమాయక కొనుగోలు దారులకు అంటగట్టింది ఉదాహరణంగా చెప్పవచ్చునని,ప్లాట్లు కొనుగోలు చేసిన కస్టమర్లు గగ్గోలు పెడుతున్నారని వారు పేర్కొంటున్నారు. ప్రజాప్రతినిధులు ఓపెనింగ్ చేసిన ఫోటోలను రంగు, రంగు బ్రోచర్లు ముద్రించి ఫేస్ బుక్, వాట్సాప్, ఇన్ స్ట్రాగ్రామ్ లలో పెట్టి భూలోక స్వర్గంగా చూపిస్తూ రియల్టర్లు అక్రమ దందాకు పాల్పడుతున్నారని బహిరంగ ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. హెచ్ ఎం డి ఏ, డీ టీ సీ పీ, రేరా సంస్థల వంటి అనుమతులు లేకుండా నాలా కన్వెర్షన్ గాలికొదిలేసిన లే అవుట్ లల్లో అమాయకులు ప్లాట్లు కొనుగోలు నష్టపోతే ఎవరు భాద్యత వహిస్తారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు..

**ఫామ్ ల్యాండ్ నిబంధనలు తుంగలో....**

రియల్ మాఫియా ఫామ్ ల్యాండ్ నిబంధనలను తుంగలో తొక్కేస్తోంది. రోడ్లు, భూగర్భ డ్రైనేజీలు, గేటెడ్ కమ్యూనిటీని మించి చుట్టు వాల్ నిర్మాణాలు చేపట్టి అమాయకులకు అంటగడుతోంది. 10గుంటల నుండి ఎన్ని ఎకరాల్లో నైనా మొక్కలు, పండ్ల తోటలు సాగు చేసుకోవచ్చు.కాని ఇక్కడ నిబంధనలకు విరుద్ధంగా గజాల్లో విక్రయిస్తూ ఒక్క గుంటని రు 4.65 లకు అమ్మకాలు జరిపి అక్రమ పద్దతిలో రిజిస్ట్రేషన్లు చేస్తూ రియల్టర్లు సొమ్ము చేసుకుంటున్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారుల అండతో ఏదేచ్ఛగా సాగుతున్న అక్రమ వెంచర్లపై చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు తమ అభిప్రాయం వ్యక్తంచేస్తున్నారు.





## గ్రీన్ బెల్ట్ స్థలాన్ని అమ్మి సొమ్ము చేసుకుంటున్న అక్రమార్కులు.

గ్రీన్ బెల్ట్ స్థలమంటే వేసే వెంచర్లో 10శాతం భూమితోపాటు మరో ఆరు శాతం మౌళిక సదుపాయల కోసం కేటాయిస్తారు. ఆ భూమిలో రోడ్లు, పార్కులు, వాకింగ్ ట్రాక్, వాటర్ ట్యాంక్, వీధి దీపాలు, భూగర్భ డ్రైనేజీ, నిర్మాణాల కోసం కేటాస్తున్నట్లు గ్రామ పంచాయితీ కార్యదర్శి పేరు మీదుగా గిఫ్ట్ డీడ్ చేసి మరో ఆరు శాతం డిమాండ్ డ్రాఫ్ట్ (డి డీ ) రూపంలో గ్రామ పంచాయితీ కి అంద జేయాల్సి ఉంటుంది. కాని ప్రజా ప్రతినిధుల, అధికారుల అండతో గజం స్థలాన్ని కూడా వదలకుండా అమ్మకాలు జరిపి సొమ్ము చేసుకొంటున్నారు. గ్రామ పంచాయితీ అధికారులకు అడిగినంత ముడుపులు ముట్టజెప్పటంతో అటువైపు కన్నెత్తి చూడటం లేదని తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నారాయణఖేడ్ మండలంలో వందల ఎకరాల్లో విచ్చలవిడిగా వెంచర్లు జరుగుతున్నప్పటికి పంచాయితీ అధికారులు స్పందించటం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. జిల్లా పంచాయితీ అధికారి స్పందించి అక్రమంగా సాగుతున్న వెంచర్లపై చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



## మీనాక్షికి నిరాశ

**మహా :** మధ్యప్రదేశ్ రాజకీయాల్లో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. రాజ్యసభ ఎన్నికల వేళ ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీకి గట్టి ఎదురు దెబ్బ తగిలింది. కోర్టు కేసుల సాంకేతిక కారణాలను చూపుతూ.. తెలంగాణ కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇంచార్జ్, సీనియర్ నేత మీనాక్షి నటరాజన్ నామినేషన్‌ను ఎన్నికల అధికారులు తిరస్కరించారు. ఈ పరిణామంతో మధ్యప్రదేశ్ నుంచి రాజ్యసభకు ఇద్దరికి బదులుగా ముగ్గురు బీజేపీ అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లుగా ఈసీ ప్రకటించింది. అందులో తరుణ్ చుగ్, రజనీశ్ అగర్వాల్, మహేశ్ ఉన్నారు. సంఖ్యా బలం ప్రకారం దక్కాల్సిన సీటును చేజార్చుకోవడంతో కాంగ్రెస్ శ్రేణులు నైరాశ్యంలో ఉన్నాయి.

## చలాన్ మెసేజ్‌తో పోలీసు అధికారికి సైబర్ మోసం



**హైదరాబాద్, మహా :** సైబర్ నేరగాళ్లు సామాన్యులనే కాకుండా, పోలీసు అధికారులను సైతం లక్ష్యంగా చేసుకుంటున్నారు. తాజాగా హైదరాబాద్‌లోని పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఓ అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ (ఏఎస్ఐ) సైబర్ మోసానికి గురయ్యారు. ఆర్టీఏ చలాన్ పేరుతో వచ్చిన ఒక నకిలీ లింక్‌ను క్లిక్ చేయడంతో, ఆయన బ్యాంకు ఖాతా నుంచి రూ. 49,139 మాయమయ్యాయి. వివరాల్లోకి వెళితే, పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో ఏఎస్ఐగా పనిచేస్తున్న నరసయ్య మొబైల్ ఫోన్‌కు జూన్ 8న వరుసగా మెసేజ్‌లు వచ్చాయి. తన ప్రమేయం లేకుండానే బ్యాంకు ఖాతా నుంచి నగదు డెబిట్ అయినట్లు గమనించి ఆయన దిగ్భ్రాంతికి గురయ్యారు. అంతకుముందు ఆర్టీఏ చలాన్‌కు సంబంధించి వచ్చిన ఒక మెసేజ్‌లోని ఏపీకే ఫైల్‌ను ఆయన క్లిక్ చేశారు. దీనిని ఆసరాగా చేసుకున్న సైబర్ నేరగాళ్లు, ఆయన బ్యాంకింగ్ వివరాలను తస్కరించి ఖాతాలోని సొమ్మును కాజేశారు. బాధిత ఏఎస్ఐ వెంటనే అప్రమత్తమై సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్ 1930కి ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై సైబర్ క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఏపీకే ఫైల్స్, డిజిటల్ అరెస్ట్, నకిలీ ఓటీపీల వంటి మోసాలపై హైదరాబాద్ పోలీసులు నిరంతరం అవగాహన కల్పిస్తున్నప్పటికీ, సాక్షాత్తు ఒక పోలీస్ అధికారి ఇలాంటి మోసానికి గురికావడం ఆందోళన కలిగిస్తోంది.

# ఏపీ లిక్కర్ స్కాంలో రాజ్ కేసిరెడ్డి అరెస్ట్



**అమరావతి, మహా :** ఆంధ్రప్రదేశ్ బేవరేజెస్ కార్పొరేషన్ పరిధిలో జరిగిన వేల కోట్ల మద్యం రవాణా, సిండికేట్ కుంభకోణంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ పక్కా ఆధారాలతో రంగంలోకి దిగింది. గతంలో రాష్ట్ర ప్రత్యేక దర్యాప్తు బృందం అరెస్ట్ చేయడంతో ఏడాది పాటు జైలు శిక్ష అనుభవించి ఇటీవలే బెయిల్‌పై వచ్చిన ఈ స్కామ్ సూత్రధారి, వైఎస్సార్‌సీపీ హయాం నాటి మాజీ ఐటీ సలహాదారు రాజ్ కేసిరెడ్డిని ఇప్పుడు ఈడీ మనీలాండరింగ్ ఆరోపణలపై అదుపులోకి తీసుకుంది. ఈ అరెస్టుతో పాటు హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్‌లోని సుమారు 10 ప్రాంతాల్లో ఈడీ ఏకకాలంలో భారీ సోదాలు నిర్వహించడం తెలుగు రాష్ట్రాల రాజకీయాల్లో పెను సంచలనం సృష్టిస్తోంది. నానక్‌రామ్‌గూడలోని రాజ్ కేసిరెడ్డి నివాసంతో పాటు మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, ఆయన కుమారుడు సునీల్, మాజీ ఎండీ వాసుదేవరెడ్డి ఇళ్లపై కూడా దాడులు జరిగాయి.

**మనీలాండరింగ్ కోణం గుట్టు రట్టు**

ఈడీ దర్యాప్తు చేస్తున్న ఈ మనీలాండరింగ్ కేసు అత్యంత కీలకమైనదిగా మారుతోంది. కేవలం మద్యం పాలసీలోనే కాకుండా, లిక్కర్ సెంట్రలైజ్డ్ ట్రాన్స్‌పోర్ట్ టెండర్ల ద్వారా సుమారు రూ. 349 కోట్ల మేర అక్రమాలకు పాల్పడి, ఆ నిధులను షెల్ కంపెనీల ద్వారా రియల్ ఎస్టేట్ రంగానికి మళ్లించారనేది ఈడీ ప్రధాన ఆరోపణ. ఢిల్లీకి చెందిన సిగ్మా సప్లై చైన్ సొల్యూషన్స్ వంటి సంస్థలను ఫ్రంట్‌గా వాడుకుని, తెరవెనుక రాజ్ కేసిరెడ్డి సిండికేట్ 95 శాతం పైగా లాభాలను హవాలా, మనీలాండరింగ్ మార్గాల ద్వారా ల్యాండ్‌మార్క్ ప్రాజెక్టులలోకి పెట్టుబడిగా మార్చినట్లు ఈడీ ఇప్పటికే ప్రాథమిక ఆధారాలు సేకరించింది. ఓల్విక్, అరోయో, ఈజీలోడ్ వంటి డమ్మీ కంపెనీల గుట్టును అధికారులు రట్టు చేసినట్లుగా తెలుస్తుంది.

**రాజ్ కేసిరెడ్డికే అన్నీ తెలుసని విజయసాయిరెడ్డి వాంగ్మూలం**

ఈ కేసులో గతంలో ఈడీ జరిపిన ఏడు గంటల సుదీర్ఘ విచారణ అనంతరం వైఎస్సార్‌సీపీ మాజీ కీలక నేత, ఎంపీ విజయసాయిరెడ్డి మీడియా సాక్షిగా చేసిన వ్యాఖ్యలు ఈ కుంభకోణంలో తాడేపల్లి ప్యాలెస్ పాత్రను నేరుగా వేలెత్తి చూపిస్తున్నాయి. ఈ లిక్కర్ స్కామ్‌లో రాజ్ కేసిరెడ్డే 'అన్నీ తానై నడిపిన అసలు పాత్రధారి' అని ఆయన స్పష్టం చేశారు. అంతేకాకుండా, పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సూచనల మేరకే తాను సజ్జల శ్రీధర్ రెడ్డికి రూ. 100 కోట్లు సర్దాల్సి వచ్చిందని, విజయసాయిరెడ్డి ఈడీకి వాంగ్మూలం ఇవ్వడం వైసీపీకి కోలుకోలేని దెబ్బగా మారింది.

**త్వరలో జగన్‌కు నోటీసులు?**

ఈడీ తాజాగా అటాచ్ చేసిన దాదాపు రూ. 441 కోట్ల విలువైన ఆస్తులు, నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న డిజిటల్ డేటా ఆధారంగా ఈ కుంభకోణంలోని అన్ని వేళ్లు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నివాసం వైపే చూపుతున్నాయని భావిస్తున్నారు. ప్రభుత్వ అధికార దుర్వినియోగం ద్వారా డిస్టిలరీల నుంచి రూ. 3,500 కోట్ల మేర ముడుపులు వసూలు చేశారనే ఆరోపణలు, హవాలా లావాదేవీల లూప్‌ను ఈడీ బ్రేక్ చేయడంతో స్కామ్ వెనుక ఉన్న అసలు 'పెద్దల' చుట్టూ ఉచ్చు బిగుస్తున్నట్లుగా తెలుస్తోంది.

**అంతిమ లబ్దిదారు ఎవరన్నది తేలేనా?**

రాజ్ కేసిరెడ్డి కస్టడీ విచారణలో మరిన్ని కీలక విషయాలు వెలుగులోకి రానున్నాయి. మద్యం వ్యాపారంలో జే‌బ్రాండ్స్ పేరిట నాసిరకం లిక్కర్ అమ్మి ప్రజల ప్రాణాలతో ఆడుకుంటూ సంపాదించిన ఈ వేల కోట్ల రూపాయల అవినీతి సొమ్ము చివరకు ఏ ఏ ఖాతాల్లోకి వెళ్ళిందనే పూర్తి రూట్ మ్యాప్‌ను ఈడీ బహిర్గతం చేయనుంది. త్వరలోనే వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి కూడా ఈడీ విచారణ నోటీసులు జారీ చేసే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని రాజకీయవర్గాలు అంచనా వేస్తున్నాయి.

## ప్రియాంక గాంధీ టైం ఐదు రాష్ట్రాలపై ఫోకస్

**మహా :** దేశంలో త్వరలో జరగబోయే ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలను కాంగ్రెస్ పార్టీ అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ఈ ఎన్నికల సమరంలో పార్టీని ముందుండి నడిపించేందుకు కాంగ్రెస్ అగ్రనేత, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రాకు హైకమాండ్ కీలకమైన బాధ్యతలను అప్పగించింది. ఉత్తరప్రదేశ్, గోవా, మణిపూర్, పంజాబ్, ఉత్తరాఖండ్ అసెంబ్లీ ఎన్నికల వేళ రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. ఈ ఐదు రాష్ట్రాల్లోనూ మెరుగైన ఫలితాలు సాధించడం ద్వారా జాతీయ రాజకీయాల్లో సరికొత్త ఊపు తీసుకురావాలని కాంగ్రెస్ భావిస్తోంది. ఇందుకోసం క్షేత్రస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేసేందుకు పక్కా ప్లాన్ తో ముందుకు వెళ్తోంది. ఇప్పటికే ఆయా రాష్ట్రాల్లో ప్రియాంక గాంధీ సుడిగాలి పర్యటనలు చేస్తూ శ్రేణుల్లో ఉత్సాహం నింపుతున్నారు. ముఖ్యంగా మహిళలు, నిరుద్యోగ యువతను ఆకట్టుకునేలా ప్రత్యేక హామీలను ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యతను ఆమె భుజాన వేసుకున్నారు. రాష్ట్రాల వారీగా ఉన్న స్థానిక సమస్యలపై అధికార పక్షాలను గట్టిగా నిలదీస్తూ, కాంగ్రెస్‌కు అనుకూల పవనాలు వీచేలా క్షేత్రస్థాయి మేనేజ్‌మెంట్‌పై ప్రియాంక ప్రత్యేక దృష్టి సారించారు. గత ఎన్నికల అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఈసారి టిక్కెట్ల కేటాయింపు, పొత్తులు, ప్రచార శైలిపై కాంగ్రెస్ అధిష్ఠానం ముందస్తు కసరత్తు పూర్తి చేసింది. రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గేలతో కలిసి ప్రియాంక గాంధీ ఈ ఎన్నికల ప్రచారాన్ని పర్యవేక్షించనున్నారు. ఎలాగైనా ఈ ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో గెలిచి తీరాలనే పట్టుదలతో ఉన్న కాంగ్రెస్.. 'మిషన్ 2026' పేరుతో భారీ కార్యాచరణకు తెరలేపింది. 2027 జనవరిలోనే ఎన్నికల షెడ్యూల్ రానుంది.



## టైటిల్ వార్



**హైదరాబాద్, మహా :** బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రతిపాదించిన కొత్త రాజకీయ పార్టీ 'తెలంగాణ రక్షణ సేన' (టీఆర్ఎస్)కు ఆరంభంలోనే గట్టి అడ్డంకులు ఎదురవుతున్నాయి. పార్టీ పేరు రిజిస్ట్రేషన్ చుట్టూ తీవ్ర వివాదం నెలకొనడంతో ఈ అంశం రాష్ట్ర రాజకీయ వర్గాల్లో ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. 'టీఆర్ఎస్' అనే సంక్షిప్త నామాన్ని (అక్రోనిం) కవిత కొత్త పార్టీకి కేటాయించవద్దంటూ కేంద్ర ఎన్నికల సంఘానికి (ఈసీఐ) పలు వైపుల నుంచి భారీగా అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి.


ఈ వివాదంలో ప్రధానంగా భారత్ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) గట్టి అభ్యంతరం వ్యక్తం చేసింది. 'టీఆర్ఎస్' (తెలంగాణ రాష్ట్ర సమితి) అనే పేరు సుదీర్ఘ కాలం సాగిన తెలంగాణ మలిదశ ఉద్యమ చరిత్రతో, ప్రజల భావోద్వేగాలతో విడదీయరాని విధంగా ముడిపడి ఉందని పేర్కొంది. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న సామాన్య ప్రజలు ఇప్పటికీ తమ పార్టీని 'టీఆర్ఎస్'గానే గుర్తిస్తున్నారని, కాబట్టి ఆ పేరును వేరొకరికి కేటాయించడం వల్ల ఓటర్లు గందరగోళానికి గురయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తూ ఈసీకి అధికారికంగా ఫిర్యాదు చేసింది.

మరోవైపు, కవిత తన పార్టీ పేరును అధికారికంగా ప్రకటించడానికి కేవలం ఒక రోజు ముందే.. మహారాష్ట్రలోని సోలాపూర్‌కు చెందిన 'తెలంగాణ రాష్ట్రసామాజిక సేన' అనే సంస్థ కూడా 'టీఆర్ఎస్' అనే పేరు కోసమే ఈసీకి దరఖాస్తు చేసుకోవడం గమనార్హం. సోలాపూర్‌కు చెందిన దయానంద్ మహాదేవ్ మామ్‌ద్యాల్ అనే వ్యక్తి ఈ మేరకు దరఖాస్తు సమర్పించినట్లు విశ్వసనీయ సమాచారం. ఇవి మాత్రమే కాకుండా, కొత్త పార్టీ రిజిస్ట్రేషన్ ప్రక్రియలో భాగంగా పత్రికల్లో ఇచ్చిన బహిరంగ ప్రకటన ఆధారంగా సుమారు 600 నుంచి 700 వరకు ప్రజా అభ్యంతరాలు (పబ్లిక్ అబ్జెక్షన్స్) కేంద్ర ఎన్నికల సంఘానికి అందినట్లు తెలుస్తోంది. అదే సమయంలో, రాష్ట్ర ఎన్నికల సంఘం వద్ద ఇప్పటికే 'తెలంగాణ రాజ్య సమితి' పేరుతో నమోదైన మరో ప్రాంతీయ పార్టీ కూడా.. 'టీఆర్ఎస్' అనే సంక్షిప్త నామాన్ని వాడటంపై తీవ్ర అభ్యంతరం తెలుపుతూ కేంద్ర ఎన్నికల సంఘాన్ని ఆశ్రయించింది.

ఈ అనూహ్య పరిణామాల నేపథ్యంలో, తమ వైపు ఉన్న సాంకేతిక, చట్టపరమైన వాదనలను వినిపించేందుకు కవిత ప్రతినిధుల బృందం త్వరలోనే దిల్లీలో ఎన్నికల సంఘం ఉన్నతాధికారులను కలిసేందుకు సిద్ధమవుతోంది. ఒకే పేరు కోసం ఇన్ని వైపుల నుంచి అభ్యంతరాలు, పోటీ వ్యక్తమవుతున్న తరుణంలో.. కవిత తన కొత్త పార్టీకి 'టీఆర్ఎస్' అనే ప్రతిష్టాత్మక అక్షరాలను దక్కించుకోగలుగుతారా లేదా అన్నది ఇప్పుడు రాజకీయ వర్గాల్లో తీవ్ర ఉత్కంఠ రేపుతోంది.

# ఒమన్ తీరంలో తీవ్ర అలజడి

**ఇండియన్స్ టార్గెట్‌గా అమెరికా దాడులు**
**భారతీయులున్న మరో నౌకపై మిస్సైళ్లు**



**ఇంటర్నెట్, మహా :** అమెరికా ఇరాన్ మధ్య ఉద్రిక్త పరిస్థితులు భారతీయుల ప్రాణాల మీదకు తీసుకొచ్చింది. ఇప్పటికే భారతీయులున్న ఓ నౌకపై అమెరికా మిసైళ్ల వర్షం కురిపించడంతో, అందులోని ముగ్గురు ఇండియన్ నావికులు మృతిచెందారు. ఆ ఘటన మరువక ముందే మరో వాణిజ్య నౌకపై కూడా అమెరికా సైనికులు దాడి చేసిన ఘటన కలకలం రేపుతోంది. ఒమాన్‌లోని షినాస్ పోర్టు సమీపంలో భారతీయులు ఉన్న మరో నౌకపై దాడి జరిగినట్లు భారత రాయబార కార్యాలయం గురువారం వెల్లడించింది. నౌకపై జరిగిన దాడి ఘటనపై తాము నిశితంగా నిఘా ఉంచామని, పూర్తి వివరాలు తెలుసుకునేందుకు స్థానిక అధికారులతో సమన్వయం కొనసాగిస్తున్నామని ఒమాన్‌లోని భారతీయ రాయబార కార్యాలయం తెలిపింది. ప్రాథమిక సమాచారం ప్రకారం.. ఈ ఘటనలో ఎవరికీ ప్రాణాపాయం లేదని, అందరూ సురక్షితంగానే ఉన్నట్లు తెలుస్తోంది.. గినియా బిస్సావు జెండాతో ప్రయాణిస్తోన్న జలవీర్ అనే నౌకే లక్ష్యంగా టార్గెట్ చేసినట్లు తెలుస్తోంది. ఆయిల్ ట్యాంకర్‌తో ఉన్న ఈ నౌకను టార్గెట్ చేసే మిసైళ్లు వేసినట్లు సమాచారం. ఇరాన్ యుద్ధం ప్రారంభైన తర్వాత భారతీయ సిబ్బంది ఉన్న నౌకపై అమెరికా దాడి చేయడం ఇది మూడోసారి. ఇప్పటికే రెండు నౌకలపై అమెరికా దాడులు చేపట్టింది. గల్ఫ్ ఆఫ్ ఒమాన్‌లో భారతీయ సిబ్బంది ఉన్న సెట్టిబెల్లో నౌకపై అమెరికా బలగాలు బుధవారం దాడి చేశాయి. అందులో మొత్తం 24 మంది భారతీయ సిబ్బంది ఉండగా 21 మందిని రక్షించారు. ముగ్గురు భారతీయ నావికులు మృతిచెందినట్లు కేంద్ర మంత్రి గురువారం అధికారికంగా ప్రకటించారు.గతంలో ఇరాన్ చమురు వ్యాపారంలో పాల్గొంటున్నట్లు అనుమానించిన మారివెక్స్ అనే ఖాళీ ట్యాంకర్‌పై కూడా అమెరికా బలగాలు కాల్పులు జరిపాయి. ఆ నౌకలో ఉన్న 24 మంది భారతీయ సిబ్బంది సురక్షితంగా బయటపడ్డారు. భారతదేశానికి సంబంధించిన వాణిజ్య నౌకలపై జరుగుతున్న దాడులను భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ తీవ్రంగా ఖండించింది. అంతర్జాతీయ జలమార్గాల్లో స్వేచ్ఛాయుత నౌకాయానాన్ని పునరుద్ధరించాలని

## కాంగ్రెస్, బీఆర్ఎస్‌లపై రామచందర్‌రావు విమర్శలు

**మహా :** తెలంగాణలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ప్రజల విశ్వాసాన్ని పూర్తిగా కోల్పోయాయని, భారతీయ జనతా పార్టీ ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా వేగంగా ఎదుగుతోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్‌రావు అన్నారు. సిద్దిపేటలో జరిగిన 'దీన్ దయాళ్ ప్రశిక్షణ తరగతుల' ముగింపు సభలో ఆయన మాట్లాడారు. పార్టీ కార్యకర్తల క్రమశిక్షణ, అంకితభావమే బీజేపీ విజయాలకు ప్రధాన బలమని పేర్కొన్నారు.ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు సాధించిందని ఆయన తెలిపారు. గతంలో ఎన్నడూ లేని స్థాయిలో అభివృద్ధి కార్యక్రమాలు అమలవుతున్నాయని, భారత్ ప్రపంచ ఆర్థిక శక్తిగా ఎదుగుతోందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు లక్షల కోట్ల రూపాయల నిధులు కేటాయించినప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం వాటిని ప్రజలకు వివరించకుండా కేంద్రంపై విమర్శలు చేస్తోందని ఆరోపించారు. రాష్ట్రంలో రైతులు, నిరుద్యోగులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలులో విఫలమైందని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టు, ఫార్ములా ఈ రేసు వ్యవహారాలపై పూర్తి స్థాయి పారదర్శక విచారణ జరపాలని డిమాండ్ చేశారు. అవినీతి అంశాల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ పరస్పరం ఒకరినొకరు కాపాడుకుంటున్నాయని ఆరోపించారు.ఎన్నికల సంఘం చేపట్టే ఎస్ఐఆర్ ప్రక్రియను రాజకీయ రంగు పులమడం సరికాదని పేర్కొన్న ఆయన, ఎన్నికల్లో ఓటమి భయంతోనే ప్రతిపక్షాలు ఆరోపణలు చేస్తున్నాయని అన్నారు. ప్రజలు కాంగ్రెస్, బీఆర్ఎస్ పాలనపై అసంతృప్తితో ఉన్నారని, రాబోయే ఎన్నికల్లో బీజేపీకి అవకాశం కల్పించే పరిస్థితులు కనిపిస్తున్నాయని రామచందర్‌రావు విశ్వాసం వ్యక్తం చేశారు.

# కమలంపై షర్మిల కన్నెర్ర..

**రాజ్యసభ' వ్యాఖ్యలతో కాంగ్రెస్ అధిష్ఠానానికీ చురకలు!**

**విజయవాడ, మహా.:** ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (ఏపీసీసీ) అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఎక్స్ (ట్విట్టర్) వేదికగా చేసిన తాజా వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ఓ వైపు భారతీయ జనతా పార్టీపై నిప్పులు చెరుగుతూనే, మరోవైపు పరోక్షంగా కాంగ్రెస్ అధిష్ఠానంపై తన అసంతృప్తిని వెళ్లగక్కారనే వాదనలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా 'రాజ్యసభ సీటు' వ్యవహారంపై ఆమె చేసిన వ్యాఖ్యలు ఏపీ కాంగ్రెస్‌లో కొత్త కలకలానికి దారితీస్తున్నాయి.

**అధిష్ఠానంపై అసహనమా?**

తనకు రాజ్యసభ సీటు దక్కకపోవడంపై బీజేపీ చేసిన విమర్శలకు షర్మిల దీటుగా బదులిచ్చారు. రాజ్యసభ సీటు అనేది మాట ఇచ్చిన వాళ్లకు, తీసుకున్న వాళ్లకు మాత్రమే సంబంధించిన విషయమని, మధ్యలో బీజేపీకి ఈ అతి స్పందన ఎందుకని ఆమె ప్రశ్నించారు. అయితే ఈ వ్యాఖ్యల వెనుక కాంగ్రెస్ హైకమాండ్‌కు ఒక స్పష్టమైన సందేశం ఉందన్న గుసగుసలు రాజకీయ వర్గాల్లో వినిపిస్తున్నాయి. పెద్దల సభకు పంపుతామని ఏఐసీసీ నాయకత్వం ఆమెకు హామీ ఇచ్చి మాట తప్పిందా అన్న అనుమానాలు ఇప్పుడు వ్యక్తమవుతున్నాయి. నేడు ఢిల్లీలో జరుగుతున్న ఏఐసీసీ కీలక సమావేశానికి షర్మిల దూరంగా ఉండటం, అలాగే 'పుండు మీద కారం చల్లొద్దు' అంటూ ఆమె చేసిన వ్యాఖ్యలు ఈ ఊహాగానాలకు మరింత బలం చేకూరుస్తున్నాయి. ఇటీవల పార్టీ కార్యక్రమాల పట్ల ఆమె కొంత అంటీముట్టనట్లుగా వ్యవహరిస్తుండటం వెనుక ఉన్న ఆంతర్యం అధిష్ఠానం పట్ల ఉన్న అసంతృప్తేనని విశ్లేషకులు భావిస్తున్నారు.

**బీజేపీకి 12 సూటి ప్రశ్నలు..**

మరోవైపు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై షర్మిల ప్రశ్నల వర్షం కురిపించారు. గడచిన 12 ఏళ్ల పాలనలో ఎన్డీయే ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల ముందుంచారు. అర్థంపర్థం లేని ఆరోపణలు చేయడం మాని, ధైర్యం ఉంటే తాను లేవనెత్తిన 12 వైఫల్యాలపై సమాధానం చెప్పాలని సవాల్ విసిరారు. నిత్యావసరాల ధరలు 300 శాతం మేర ఎందుకు పెరిగాయో, ఆర్థిక వృద్ధి మెరుగ్గా ఉంటే డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ ఎందుకు పాతాళానికి పడిపోయిందో కేంద్రం జవాబు చెప్పాలని డిమాండ్ చేశారు.



యువత, మహిళల భద్రత విషయంలోనూ కేంద్రం తీరును షర్మిల ఎండగట్టారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఏమయ్యాయని, దేశవ్యాప్తంగా 28 సార్లు పరీక్షా పత్రాలు ఎందుకు లీక్ అయ్యాయని ప్రశ్నించారు. మణిపూర్‌లో మహిళలను నగ్నంగా ఊరేగించిన ఘటనలను గుర్తు చేస్తూ.. ఏటా ఐదు లక్షల అఘాయిత్యాలు జరుగుతుంటే సాధికారత గురించి ఎలా మాట్లాడతారని తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. పీఎం కిసాన్ నిధులు ఇస్తున్నామని గొప్పలు చెబుతున్న కేంద్రం, ఏటా 12 వేల మంది రైతులు ఎందుకు ఆత్మహత్యలు చేసుకుంటున్నారో చెప్పాలన్నారు. దేశంలో మౌలిక వసతులు కల్పించామని చెబుతున్న ప్రభుత్వ పెద్దలు, తెచ్చిన లక్షల కోట్ల అప్పులు ఎక్కడ ఖర్చు చేశారో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

మతాల మధ్య చిచ్చుపెట్టి, ఎన్నికల సంఘం (ఈసీ) లాంటి రాజ్యాంగబద్ధ సంస్థలను కీలుబొమ్మలుగా మార్చుకుని ఓట్లు, సీట్లు కొల్లగొడుతున్న బీజేపీకి ప్రజాభిమానం ఎక్కడుందని ఆమె ఎద్దేవా చేశారు. మొత్తంగా ఒకే ఒక ట్వీట్‌తో షర్మిల అటు బీజేపీని ఉక్కిరిబిక్కిరి చేయడంతో పాటు, ఇటు సొంత పార్టీ అధిష్ఠానానికి సైతం తన అసంతృప్తిని తెలియజేసిన తీరు ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది.

మహా పత్రిక

WWW.MAHAADAILY.COM | జనరల్ వార్తలు | GENERAL NEWS | శుక్రవారం, హైదరాబాద్ | 12-06-2026

# మామిడి పండ్లు తిని ఇద్దరు అక్కాచెల్లెళ్ల మృతి



**హైదరాబాద్, మహా:** మామిడి పండ్లు తిన్న ఓ కుటుంబం తీవ్ర అస్వస్థతకు గురై, రెండు రోజుల వ్యవధిలోనే ఇద్దరు అక్కాచెల్లెళ్లు ప్రాణాలు కోల్పోయిన అత్యంత విషాదకర ఘటన నగరంలోని నారాయణగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఈ వరుస మరణాలు ఆ కుటుంబంలో తీరని శోకాన్ని, స్థానికంగా తీవ్ర ఆందోళనను రేకెత్తించాయి. ఈ కలకలం రేపిన ఘటనపై హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ సజ్జనార్ తీవ్రంగా స్పందించారు. బాలికల మరణాలకు గల కచ్చితమైన కారణాలను తెలుసుకునేందుకు లోతైన దర్యాప్తు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. నారాయణగూడ ఎస్ఐ సాయి సందీప్ వెల్లడించిన వివరాల ప్రకారం.. కర్ణాటక రాష్ట్రం బీదర్ ప్రాంతానికి చెందిన ఇందుమతి తన ఐదుగురు కుమార్తెలతో కలిసి హైదరాబాద్‌లోని నారాయణగూడ విఠల్‌వాడిలో నివాసం ఉంటున్నారు. ఆమె భర్త బీదర్‌లోనే ఉంటూ జీవనం సాగిస్తున్నారు. కాగా, నాలుగు రోజుల క్రితం ఇందుమతి ఇంటికి రేణుక అనే బంధువు వస్తూ తనతో పాటు మామిడి పండ్లను తీసుకువచ్చారు. ఆ పండ్లను కుటుంబ సభ్యులంతా కలిసి ఆరగించారు. అయితే, మరుసటి రోజు ఉదయం నుంచే తల్లీకుమార్తెలకు విపరీతమైన వాంతులు, విరేచనాలు మొదలయ్యాయి. పరిస్థితి విషమించడంతో స్థానికుల సాయంతో వెంటనే వారిని కాచిగూడలోని ఓ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ 17 ఏళ్ల వయసున్న భువనేశ్వరి సోమవారం కన్నుమూసింది. ఆ విషాదం నుంచి కుటుంబ సభ్యులు తేరుకోకముందే, పదేళ్ల వయసున్న మరో కుమార్తె సంధ్యారాణి సైతం మంగళవారం తుదిశ్వాస విడిచింది. మరో బాలిక ప్రస్తుతం ఆసుపత్రిలోనే ఉంటూ చికిత్స పొందుతోంది. బంధువులు తెచ్చిన మామిడి పండ్లు తిన్న తర్వాతే తామంతా తీవ్ర అనారోగ్యానికి గురయ్యామని బాధిత కుటుంబ సభ్యులు నారాయణగూడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మామిడికాయల్లోని రసాయనాల వల్లే ఈ అనర్థం జరిగిందా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఫిర్యాదు అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని వివిధ కోణాల్లో ముమ్మర విచారణ చేపట్టారు. ఇద్దరు చిన్నారుల వరుస మృతికి దారితీసిన పరిస్థితులపై సీపీ సజ్జనార్ ప్రత్యేక దృష్టి సారించారు. మృతిచెందిన బాలికల అంతర్గత అవయవాల (విసెరా) నమూనాలను కచ్చితంగా భద్రపరచాలని, అలాగే వైద్య నిపుణుల అభిప్రాయాలను సేకరించాలని దర్యాప్తు అధికారులను ఆయన ఆదేశించారు. విసెరా నివేదికలు, శాస్త్రీయ ఆధారాలు, వైద్యుల రిపోర్టుల ఆధారంగా కేసును లోతుగా విచారించి, మరణాలకు గ

# విద్యా, వైద్యమే దేశ ప్రగతికి ప్రాణవాయువు

- నీతి ఆయోగ్ వేదికగా తెలంగాణ అభివృద్ధి
- మెట్రో రెండో దశకు కేంద్రం పచ్చజెండా
- హైదరాబాద్‌కు ఐఐఎం, నిధులు ఇవ్వాలని ప్రధాని మోదీకి ముఖ్యమంత్రి విజ్ఞప్తి
- ఆరు మహానగరాలకు 'ఎం-6 టాస్క్‌ఫోర్స్' ఏర్పాటు చేయాలని కేంద్రానికి కీలక ప్రతిపాదన



**ఢిల్లీ, మహా :** దేశ రాజధాని పర్యటనలో ఉన్న తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఢిల్లీ వేదికగా రాష్ట్ర అభివృద్ధికి కీలక అడుగులు వేశారు. రాష్ట్రానికి రావాల్సిన పెండింగ్ నిధులు, ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుల అనుమతులపై ప్రధాని నరేంద్ర మోదీతో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ముఖ్యంగా హైదరాబాద్ మహానగర రవాణా ముఖచిత్రాన్ని మార్చే మెట్రో రెండో దశ ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం నుంచి గ్రీన్ సిగ్నల్ లభించింది. ఇదే క్రమంలో ఉన్నత విద్యాభ్యాసం కోసం హైదరాబాద్‌కు జాతీయ స్థాయి సంస్థ అయిన 'ఐఐఎం'ను మంజూరు చేయాలని, అలాగే రీజనల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) నిర్మాణానికి అవసరమైన అనుమతులు, నిధులు త్వరితగతిన మంజూరు చేయాలని ముఖ్యమంత్రి కోరారు. మూసీ నది పునరుజ్జీవనం, ఫ్యూచర్ సిటీ అభివృద్ధి, పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టు, రాష్ట్రంలో నూతనంగా నిర్మిస్తున్న యంగ్ ఇండియా స్కూల్స్ నిర్మాణాలకు ఆర్థిక దన్ను అందించాలని, సెమీ కండక్టర్ పరిశ్రమల ఏర్పాటుకు మద్దతు ఇవ్వాలని ప్రధానిని సీఎం రేవంత్ రెడ్డి కోరారు. అనంతరం రాష్ట్రపతి భవన్‌లో ప్రధాని మోదీ అధ్యక్షతన జరిగిన 11వ నీతి ఆయోగ్ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొని తెలంగాణ అభివృద్ధి నమూనాను దేశం ముందుంచారు. కేంద్రం నిర్దేశించిన 'వికసిత్ భారత్2047' లక్ష్యాన్ని చేరుకోవాలంటే కేవలం ఆర్థిక వనరులు మాత్రమే సరిపోవని, ప్రతి పౌరుడికి నాణ్యమైన విద్య, మెరుగైన వైద్యం అందించినప్పుడే అది సాధ్యపడుతుందని ఆయన అన్నారు. ఇంగ్లీష్ మీడియం, డిజిటల్ తరగతులు, పౌష్టికాహారంతో కూడిన ఈ మోడల్ దేశానికే ఆదర్శంగా నిలుస్తుందన్నారు. దేశంలోని ఏ రాష్ట్ర ముఖ్యమంత్రి అయినా, ఉన్నతాధికారులైనా తమ రాష్ట్రంలోని ఈ పాఠశాలలను సందర్శించడానికి వస్తే సంతోషంగా స్వాగతిస్తామని ఓపెన్ ఆఫర్ ఇచ్చారు. రాష్ట్రంలోని అన్ని ఐటీఐలను ఆధునీకరించేందుకు టాటా సంస్థతో రూ.2,100 కోట్లతో చారిత్రక పెట్టుబడి ఒప్పందం కుదుర్చుకున్న విషయాన్ని నీతి ఆయోగ్ దృష్టికి తీసుకెళ్లారు. 'తెలంగాణ రైజింగ్' విజన్‌లో భాగంగా 2034 నాటికి రాష్ట్రాన్ని ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల అగ్రగామిగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ అంతిమ లక్ష్యమని సీఎం స్పష్టం చేశారు. ఈ క్రమంలో దేశ ఆర్థికాభివృద్ధికి చోదక శక్తులుగా ఉన్న ప్రధాన నగరాల అభివృద్ధికి ఆయన ఒక వినూత్న ప్రతిపాదన చేశారు. ప్రధానమంత్రి కార్యాలయం (పీఎంఓ) పర్యవేక్షణలో ఢిల్లీ, ముంబై, కోల్‌కతా, చెన్నై, హైదరాబాద్, బెంగళూరు మహానగరాల కోసం ప్రత్యేకంగా 'ఎం6 (మెగా6) టాస్క్‌ఫోర్స్' ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ ఆరు నగరాల మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం ఒక్కో నగరానికి లక్ష కోట్ల చొప్పున మొత్తం రూ.6 లక్షల కోట్లతో ఒక ప్రత్యేక నిధిని కేటాయించాలని రేవంత్ రెడ్డి కేంద్రానికి విజ్ఞప్తి చేశారు.

# టీఎంసీ విలీనం ఊహాగానమే

**ఢిల్లీ, మహా :** కాంగ్రెస్‌లో తృణమూల్ కాంగ్రెస్ విలీనంపై వస్తున్న వార్తలపై కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ.వేణుగోపాల్ స్పందించారు. మీడియాతో మాట్లాడుతూ.. విలీనంపై వస్తున్న వార్తలన్నీ పూర్తిగా అవాస్తవం అని కొట్టిపారేశారు. మమతా బెనర్జీ, అభిషేక్ బెనర్జీలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీలను కలిసిన మాట వాస్తవమే కానీ.. అది ఒక సాధారణ సమావేశం మాత్రమేనని స్పష్టం చేశారు. విలీనం గురించి ఎలాంటి చర్చలు జరగలేదని పేర్కొన్నారు. "రాబోయే 23 నెలల్లో మేము జాతీయ స్థాయిలోనే కాకుండా.. రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో కూడా ఒక ఉద్యమాన్ని చేపట్టబోతున్నాం. ప్రజలు ఎక్కడైతే ఇబ్బందులు ఎదుర్కొంటున్నారో.. అక్కడ కాంగ్రెస్ వారి ఆవేదనలో భాగస్వామి అవుతుంది. వారి తరఫున పోరాడుతుంది." అని అన్నారు. "ఈ రోజు దేశవ్యాప్తంగా ఉన్న ప్రధాన కార్యదర్శులు, పార్టీ వ్యవహారాల ఇన్‌ఛార్జ్‌లు, పీసీసీ అధ్యక్షులతో మూడు గంటల పాటు సమావేశం జరిగింది. మధ్యప్రదేశ్, జార్ఖండ్‌లో ఇటీవల చోటుచేసుకున్న పరిణామాలు ప్రజాస్వామ్యానికి ఆందోళనకరమైనవి. మధ్యప్రదేశ్‌లో మీనాక్షి నటరాజన్ నామినేషన్‌ను తిరస్కరించిన అంశం దీనికి ఒక ఉదాహరణ. కోర్టు పంపిన ఒక నోటీసును వెల్లడించలేదన్న కారణంతో ఆమె నామినేషన్‌ను తిరస్కరించారు. వాస్తవానికి ఆమెపై ఎలాంటి క్రిమినల్ కేసు, ఎఫ్ఐఆర్ లేదా ఛార్జ్ షీట్ నమోదు కాలేదు. మరోవైపు జార్ఖండ్‌లో బీజేపీ మద్దతు ఉన్న ఒక కార్పొరేట్ అభ్యర్థి, కనీసం తన పేరును కూడా సరైన కాలమ్‌లో నమోదు చేయనప్పటికీ.. రిటర్నింగ్ అధికారి నామినేషన్‌ను ఆమోదించారు... ఇది ప్రజాస్వామ్య దుస్థితిని తెలియజేస్తోంది... ఈ రోజు జరిగిన సమావేశంలో ఈ అంశంపై కూలంకషంగా చర్చించాము, దీనిపై మేము రాజకీయంగా పోరాడుతాము.." అని పేర్కొన్నారు.

# ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్ అగ్రస్థానంలోనే టీమిండియా

- రెండో స్థానంలో న్యూజిలాండ్




**దుబాయ్,మహా :** అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) తాజాగా విడుదల చేసిన పురుషుల వన్డే జట్టు ర్యాంకింగ్స్‌లో భారత క్రికెట్ జట్టు తన అగ్రస్థానాన్ని విజయవంతంగా నిలబెట్టుకుంది. ఐసీసీ నిర్వహించిన వార్షిక రేటింగ్స్ అప్‌డేట్ తర్వాత కూడా టీమిండియా నంబర్1 స్థానంలోనే కొనసాగుతోంది. అయితే, రెండో స్థానంలో ఉన్న న్యూజిలాండ్ జట్టుతో పోలిస్తే భారత్‌కు ఉన్న పాయింట్ల ఆధిక్యం మాత్రం ఈసారి కొంత తగ్గింది. ఈ వార్షిక అప్‌డేట్‌కు ముందు భారత జట్టు 119 రేటింగ్ పాయింట్లతో ఉండగా.. తాజా సమీక్ష తర్వాత అది 118 పాయింట్లకు చేరింది. ఇదే సమయంలో రెండో స్థానంలో కొనసాగుతున్న న్యూజిలాండ్‌కు రెండు పాయింట్లు కలిసిరావడంతో ఆ జట్టు 113 పాయింట్లతో నిలిచింది. దీనివల్ల గతంలో ఇరు జట్ల మధ్య ఉన్న ఎనిమిది పాయింట్ల వ్యత్యాసం కాస్తా.. ఇప్పుడు ఐదు పాయింట్లకు పరిమితమైంది. ఇక ప్రపంచకప్ విజేత ఆస్ట్రేలియా జట్టు 109 పాయింట్లతో యథాతథంగా మూడో స్థానంలోనే కొనసాగుతోంది.

తాజా వన్డే ర్యాంకింగ్స్ టాప్10 జాబితాలో ప్రధాన మార్పు నాలుగో స్థానంలో చోటుచేసుకుంది. దక్షిణాఫ్రికా జట్టు 102 పాయింట్లతో ఒక స్థానాన్ని మెరుగుపరుచుకుని నాలుగో ర్యాంకుకు చేరుకోగా.. అంతవరకు అక్కడ ఉన్న పాకిస్థాన్ జట్టు 98 పాయింట్లతో ఐదో స్థానానికి దిగజారింది. ఇక దిగువ ర్యాంకింగ్స్‌లోనూ కొన్ని ఆసక్తికర మార్పులు కనిపించాయి. ఐర్లాండ్ జట్టు ఒక స్థానం ఎగబాకి 11వ ర్యాంకుకు చేరడం ద్వారా జింబాబ్వేను వెనక్కి నెట్టింది. అలాగే అసోసియేట్ దేశమైన అమెరికా సైతం అద్భుత ప్రదర్శనతో 13వ స్థానానికి చేరుకుని స్కాట్లాండ్‌ను అధిగమించింది. భారత జట్టు కేవలం వన్డేల్లోనే కాకుండా, అంతర్జాతీయ టీ20 ర్యాంకింగ్స్‌లోనూ ప్రపంచంలోనే నంబర్1 జట్టుగా తన హవా కొనసాగిస్తుండటం విశేషం. మరోవైపు, సుదీర్ఘ ఫార్మాట్ అయిన టెస్టు ర్యాంకింగ్స్‌లో మాత్రం ఆస్ట్రేలియా అగ్రస్థానంలో నిలిచింది. మహిళల క్రికెట్‌కు వస్తే వన్డే, టీ20 ఫార్మాట్లు రెండింటిలోనూ ఆస్ట్రేలియా మహిళల జట్టు తన తిరుగులేని ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తూ నంబర్1 స్థానాన్ని కైవసం చేసుకుంది.

# ప్రశ్నించే ప్రతి ఒక్కరూ 'కాక్రోచ్‌లే'

- నేను కూడా వారిలో ఒకడిని
- డీఎస్సీలో దారుణంగా మోసాలు
- మండిపడ్డ మాజీ సీఎం వైఎస్ జగన్



**అమరావతి, మహా :** డీఎస్సీ నియామకాల అంశంపై మాజీ సీఎం, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మరోసారి ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. డీఎస్సీ అభ్యర్థులు యువత భవిష్యత్తు కోసం పోరాడుతున్నారని, వారికి న్యాయం చేయడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు. ప్రభుత్వం తీసుకునే నిర్ణయాల వల్ల యువత నష్టపోతే ప్రశ్నించే హక్కు ప్రతి పౌరుడికి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. జగన్ మాట్లాడుతూ.. 'ఎవరైనా మమ్మల్ని కాక్రోచ్ పార్టీ అని పిలుస్తారా లేదా అనేది పక్కన పెడితే.. డీఎస్సీ అభ్యర్థులు యువకులు. వారి భవిష్యత్తు, వారి ఉద్యోగ అవకాశాల గురించి మాట్లాడుతున్నాం. వారికి న్యాయం చేయకపోతే ప్రభుత్వం తన బాధ్యతను ఎలా నిర్వర్తించినట్లు అవుతుంది' అని ప్రశ్నించారు. 'యువత కలలను, ఆశలను నలిపేస్తే కోట్లాది మంది ప్రజలు ఒకేసారి బయటకు వస్తారు. వారిని ఎవరైనా కాక్రోచ్‌లు అని పిలిస్తే, న్యాయం కోసం పోరాడే వారందరూ కాక్రోచ్‌లే అవుతారు. అలాంటి పోరాటంలో నేను కూడా వారిలో ఒకడిని' అని జగన్ అన్నారు.

**డీఎస్సీలో దారుణ మోసాలు**

డీఎస్సీలో ఎన్నో అక్రమాలు జరిగాయని, జాతీయ స్థాయిలో గోల్డ్ మెడల్ సాధించిన వారికి ఉద్యోగాలు రాలేదని మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి ఆరోపించారు. అవకతవకలు షాకింగ్ గా ఉన్నాయని అన్నారు. లక్షల మంది నమ్మకాన్ని వమ్ము చేశారని మండిపడ్డారు. డీఎస్సీలో స్కాములకు పాల్పడ్డారని అన్నారు. తామే 6100 పోస్టులతో నోటిఫికేషన్ ఇచ్చామని, ఆ తరవాత 16వేల పోస్టులతో నోటిఫికేషన్ ఇచ్చి పోస్టుల భర్తీ ఆలస్యం చేశారని చెప్పారు. నవీన్ అనే వక్తి పరీక్ష నిర్వహణలో ఉండటం, అతడికి టాప్ ర్యాంక్ రావడం స్కామ్ కాదా అని ప్రశ్నించారు. నిజంగా అతడు టాపర్ అయితే ఎందుకు ఉద్యోగం ఇవ్వలేదని అడిగారు. తన డీఎస్సీ ఐడీ బ్లాక్ అయ్యిందని నవీన్ విద్యాశాఖకు మెయిల్ చేశాడని చెప్పారు. ఏ పేపర్ తయారీ అయినా, ప్రశ్నల తయారీ డిజిటలైజ్ అనేది రహస్యంగా జరగాలన్నారు. ప్రభుత్వాన్ని తప్పు బట్టకుండా ఐడీనే మాయం చేశారని ఆరోపించారు. కలెక్టర్ దగ్గర కూడా మెరిట్ లిస్ట్, డేటా లేవని అన్నారు. ఫస్ట్ ర్యాంక్ వ్యక్తి సర్టిఫికెట్ వెరిఫికేషన్ కు రాకపోవడం వల్లనే ఆయనకు ఉద్యోగం ఇవ్వలేదని అంటున్నారని, మరి ఆయన అదే ఉద్యోగం కోసం కోర్టుకు ఎందుకు వెళ్లాడని ప్రశ్నించారు. డీఎస్సీలో అక్రమాలతో ప్రతిభావంతుల జీవితాలను దారుణంగా దెబ్బతీశారని అన్నారు. అధికారం వచ్చాక తొలి సంతకం పేరుతోనే డ్రామాలు చేశారని మండిపడ్డారు.

## మామిడి పండు తినాలంటేనే భయమేస్తోంది!

### కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్.

**జమ్మికుంట,మహా :** దేశంలో ప్రస్తుతం మామిడి కాయ తినాలంటేనే ప్రజలు భయపడే దయనీయ పరిస్థితి నెలకొందని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. కరీంనగర్ జిల్లా జమ్మికుంటలోని కృషి విజ్ఞాన కేంద్రంలో కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన 'ప్రకృతి వ్యవసాయం రైతు సమ్మేళనం'లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ.. ఆహార ఉత్పత్తుల్లో రసాయనాల వినియోగంపై తీవ్ర విచారం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో రసాయనాలతో పండించిన మామిడి పండ్లు తిని ఇద్దరు చనిపోయారని, స్వయంగా తాను సైతం నగరంలో పాలు తాగి మూడు రోజుల పాటు ఆసుపత్రి పాలయ్యానని సంచలన వ్యాఖ్యలు చేశారు. గత ఇరవై ఏళ్లలో తనకు కనీసం జ్వరం, దగ్గు రాలేదని, బీపీ, షుగర్ లాంటి సమస్యలు లేవన్న ఆయన.. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీయే తన ఆరోగ్యానికి స్ఫూర్తి అని స్పష్టం చేశారు. రోగాలకు కారకులం మనమేనని, వాటిని నివారించుకునే బాధ్యత కూడా మన చేతుల్లోనే ఉందని ఉద్ఘాటించారు.

# వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా 4వ మహాసభ..

- కార్పొరేట్లకు మోడీ ప్రభుత్వం లొంగిపోయింది..
- హామీలు అమలు చేయకపోతే సీఎం, డిప్యూటీ సీఎం ఇళ్ల ముట్టడి: వ్యకాస నేత బి వెంకట్..

**మణుగూరు, మహా :** కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు పూర్తిగా లొంగిపోయిందని, దేశ సంపదను విదేశీ, దేశీయ కార్పొరేట్ల ప్రయోజనాలకు అప్పగిస్తోందని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి. వెంకట్ విమర్శించారు. దేశ స్వాతంత్ర్య స్ఫూర్తిని, దేశ సంపదను కాపాడుకునేందుకు ఆగస్టు 10న దేశవ్యాప్తంగా జైల్ భరో' ఉద్యమం చేపడతామని ప్రకటించారు. గురువారం మణుగూరు పట్టణంలోని శ్రామిక భవన్ నుంచి కిన్నెర కళ్యాణ మండపం వరకు వందలాది మంది కార్యకర్తలతో భారీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం కామ్రేడ్ దేవులపల్లి యాకయ్య నగర్‌లోని కామ్రేడ్ గుగ్గులోధర్మ ప్రాంగణంలో జరిగిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం 4వ మహాసభల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సభలకు అన్నవరపు కనకయ్య, బి చిరంజీవి, చిట్టి వినోద్, మర్మం చంద్రయ్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా బి వెంకట్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 3,000 గ్రామాలు, 500 కేంద్రాలు, 300 జిల్లాల్లో మహాసభలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ మహాసభలు డిసెంబర్‌లో కర్ణాటకలో, రాష్ట్ర మహాసభలు ఈ నెల 20, 21, 22 తేదీల్లో మహబూబ్‌నగర్ జిల్లాలో జరగనున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మోదీ ప్రభుత్వం అమెరికా, కార్పొరేట్ శక్తుల ఒత్తిళ్లకు తలొగ్గి దేశ వ్యవసాయ, పారిశ్రామిక రంగాలను బలహీనపరుస్తోందని ఆరోపించారు. ప్రజాస్వామ్యాన్ని కార్పొరేట్ ధనంతో కొనుగోలు చేసే పరిస్థితులు నెలకొన్నాయని విమర్శించారు. రైతాంగం, కార్మిక వర్గాల ప్రయోజనాలకు విరుద్ధంగా కేంద్ర ప్రభుత్వం విధానాలు అమలు చేస్తోందని అన్నారు. తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల హామీలను అమలు చేయడంలో విఫలమయ్యారని ఆరోపించారు. పెన్షన్ బకాయిలు, మహిళలకు ప్రకటించిన ఆర్థిక సాయం, ఇతర హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి నివాసాల ముట్టడి కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఏజెన్సీ ప్రాంతాల్లో 1/70 చట్టాన్ని బలహీనపరిచే ప్రయత్నాలు జరుగుతున్నాయని, పోడు భూముల సమస్యలు, ఆదివాసీల హక్కులు, జీవో నెం.3 అమలు వంటి అంశాలపై మహాసభల్లో చర్చించి కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. మతం మారితే ఎస్సీలకు రిజర్వేషన్లు రద్దు చేయడం అన్యాయమని, రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు మచ్చా వెంకటేశ్వర్లు, రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నవరపు కనకయ్య, జిల్లా కార్యదర్శి రేపాకుల శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షులు చిట్టి వినోద్, నిమ్మల వెంకన్న, గద్దల శ్రీనివాస్, సత్రపల్లి సాంబశివరావు, నరసింహారావు, కొమరం కాంతారావు, బొల్లం రాజు, నరేష్, పగిడేరు సర్పంచ్ కుంజ రాజు, మోకాళ్ల రమేష్, నెల్లూరు నాగేశ్వరరావు, దామల్ల వెంకన్న, కొడిశాల రాములు, పిట్టల నాగమణి, గౌరి, తోట పద్మ తదితరులు పాల్గొన్నారు

# ఐటీ కారిడార్‌లో 'గంజాయి సామ్రాజ్యం



**హైదరాబాద్, మహా:** హైదరాబాద్ ఐటీకారిడార్ లో ఈగల్ టీమ్ కే ఆమె చుక్కలు చూపిస్తోంది. గల్లీగల్లీకి ఇన్ ఫార్మర్లను పెట్టుకుని.. ప్రతిరోజూ ఐటీ ఉద్యోగులే టార్గెట్ గా పదిలక్షల గంజాయి, డ్రగ్స్ బిజినెస్ చేస్తూ ఒక సామ్రాజ్యాన్నే నిర్మించింది. ఈమె నిర్మించిన నెట్ వర్క్ తెలుసుకుని పోలీసులే షాకవుతున్నారు. ఐటీ కారిడార్‌గా పేరొందిన గచ్చిబౌలి-నానక్‌రామ్‌గూడ ప్రాంతాల్లో గంజాయి అక్రమ వ్యాపారం నిర్వహిస్తూ కోట్ల రూపాయల సామ్రాజ్యాన్ని నిర్మించుకున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న నీతూబాయ్ అలియాస్ కాలావతి ఇపుడు సంచలనంగా మారింది. ఇటీవల ఈగల్ ఫోర్స్, పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన సీక్రెట్ ఆపరేషన్‌లో ఆమె నెట్‌వర్క్‌కు సంబంధించిన కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. పోలీసులు వస్తున్నారన్న సమాచారం అందడంతో నీతూబాయ్ పరారైనా, ఆమె కుటుంబ సభ్యులు, అనుచరులు, గంజాయి కొనుగోలు చేసేందుకు వచ్చిన పలువురు ఐటీ ఉద్యోగులను అదుపులోకి తీసుకోవడం నగరంలో చర్చనీయాంశమైంది. ఒకప్పుడు దూల్‌పేటకే పరిమితమైన గంజాయి వ్యాపారం ఇపుడు ఐటీ కారిడార్ వరకు విస్తరించిందని ఇన్వెస్టిగేషన్ అధికారులు చెబుతున్నారు. అధిక ఆదాయం కలిగిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, హాస్టళ్లలో ఉండే విద్యార్థులు, వలస కార్మికులను ప్రధాన లక్ష్యంగా ఎంచుకుని నీతూబాయ్ తన వ్యాపారాన్ని, నెట్ వర్క్ ను బిల్డ్ చేసింది. రోజూ వందలాది మంది కస్టమర్లు ఆమె వద్దకు వస్తుండటం వల్ల ఈ ప్రాంతం కొత్త 'డ్రగ్ హాట్‌స్పాట్'గా మారిందని పోలీసులు గుర్తించారు.

**లేడీ డాన్ నీతూబాయ్?**

నీతూబాయ్ నేర చరిత్ర చిన్నది కాదు. దాదాపు ఎనిమిదేళ్లుగా గంజాయి రవాణా, విక్రయాలకు సంబంధించిన అనేక కేసుల్లో ఆమె పేరు నమోదైంది. నానక్‌రామ్‌గూడ కేంద్రంగా గంజాయి అక్రమ వ్యాపారాన్ని నిర్వహిస్తున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న నీతూబాయ్ అలియాస్ కాలావతి కథ సాధారణ నేరగాథ కాదు. ఇది ఒక కుటుంబం మొత్తం కలిసి నిర్మించుకున్న అక్రమ వ్యాపార సామ్రాజ్యంగా దర్యాప్తు సంస్థలు భావిస్తున్నాయి. ముఖ్యంగా ఆమె అత్త మధుబాయ్‌తో కలిసి ఏర్పరచుకున్న నెట్‌వర్క్, దూల్‌పేటతో ఉన్న సంబంధాలు, కిరాణా దుకాణాల ముసుగులో సాగిన వ్యాపారం, కోట్ల రూపాయల ఆస్తుల సమీకరణ వంటి అంశాలు అధికారులను సైతం ఆశ్చర్యానికి గురిచేశాయి. హైదరాబాద్‌లో మాదకద్రవ్యాల అక్రమ రవాణా, గంజాయి విక్రయాల చరిత్రలో దూల్‌పేట పేరు తరచుగా వినిపిస్తూ ఉంటుంది. అక్కడ గంజాయి విక్రయించే కొన్ని కుటుంబాలతో నీతూబాయ్, మధుబాయ్ కుటుంబాలకు సన్నిహిత సంబంధాలు ఏర్పడ్డాయని దర్యాప్తు అధికారులు గుర్తించారు. మొదట ఇతరుల కోసం గంజాయి సరఫరా చేసే స్థాయిలో ఉన్న వీరు, ఆ తర్వాత స్వయంగా కొనుగోలు చేసి విక్రయించే స్థాయికి ఎదిగినట్లు సమాచారం. నీతూబాయ్ గతంలో అనేక గంజాయి కేసుల్లో అరెస్టైంది. రెండు, మూడు సార్లు జైలుకు వెళ్లినప్పటికీ, విడుదలైన వెంటనే మళ్లీ అదే వ్యాపారంలోకి ప్రవేశించినట్లు అధికారులు చెబుతున్నారు. ఈ పునరావృత నేరాలను దృష్టిలో ఉంచుకొని 2021లో శేరిలింగంపల్లి ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ అధికారులు ఆమెపై పీడీ యాక్ట్ నమోదు చేశారు. సాధారణంగా ఈ చట్టం తీవ్రమైన నేర కార్యకలాపాలను అరికట్టేందుకు ఉపయోగిస్తారు. అయినప్పటికీ, 2022 అక్టోబర్‌లో జైలు నుంచి విడుదలైన తర్వాత నీతూబాయ్ మరింత ప్రణాళికాబద్ధంగా తన వ్యాపారాన్ని పునఃప్రారంభించినట్లు దర్యాప్తులో తేలింది.

**కుటుంబమంతా.. బిజినెస్ లో**

ఈసారి నీతూబాయ్ ఒంటరిగా కాకుండా తన కుటుంబ సభ్యులందరినీ వ్యాపారంలో భాగస్వాములను చేసింది. కుటుంబంలోని ప్రతి ఒక్కరికీ ప్రత్యేక బాధ్యతలు అప్పగించినట్లు తెలుస్తోంది. సరుకు కొనుగోలు, నిల్వ, ప్యాకింగ్, విక్రయం, నగదు వసూళ్లు, సమాచారం సేకరణ వంటి పనులను విడివిడిగా నిర్వహించే వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు అధికారులు అనుమానిస్తున్నారు. అక్రమ కార్యకలాపాలపై అనుమానం రాకుండా ఉండేందుకు నానక్‌రామ్‌గూడలో రెండు కిరాణా దుకాణాలను ఏర్పాటు చేసినట్లు విచారణలో బయటపడింది. ఒక దుకాణాన్ని కుమారుడు కళాపతి గౌతమ్ సింగ్ నిర్వహించగా, మరో దుకాణాన్ని మధుబాయ్ చూసుకునేది. బయటకు సాధారణ కిరాణా వ్యాపారంలా కనిపించినా, లోపల గంజాయి విక్రయాలు జరిగేవని అధికారులు గుర్తించారు. ఈ విధానం వల్ల స్థానికులకు కూడా పెద్దగా అనుమానం రాకుండా ఉండేదని తెలుస్తోంది.

**కోట్లరూపాయల వ్యాపారం**

దూల్‌పేట నుంచి కిలోకు సుమారు రూ.8 వేల చొప్పున గంజాయిని కొనుగోలు చేసి రహస్యంగా నానక్‌రామ్‌గూడకు తరలించేవారని సమాచారం. ఒకేసారి 15 నుంచి 20 కిలోల వరకు సరుకు తీసుకువచ్చేవారని దర్యాప్తు అధికారులు చెబుతున్నారు. తర్వాత దానిని చిన్న చిన్న ప్యాకెట్లుగా విభజించి విక్రయించేవారు. ఈ పద్ధతి వల్ల వినియోగదారులకు సులభంగా అందుబాటులో ఉండటమే కాకుండా, లాభాలు కూడా భారీగా పెరిగేవి. వ్యాపార లెక్కలు చూస్తే ఈ నెట్‌వర్క్ ఎంత లాభదాయకంగా పనిచేసిందో అర్థమవుతుంది. కిలో గంజాయిని రూ.8 వేలకే కొనుగోలు చేసి, చిన్న ప్యాకెట్ల రూపంలో విక్రయించడం ద్వారా సుమారు రూ.25 వేల వరకు ఆదాయం పొందేవారని అధికారులు అంచనా వేశారు. అంటే ఒక్క కిలోపై రూ.17 వేల లాభం. రోజుకు 20 కిలోల వరకు విక్రయాలు జరిగితే దాదాపు రూ.3.4 లక్షల లాభం వస్తుందని లెక్కలు చెబుతున్నాయి. రోజుకు లక్షల రూపాయల లాభం వస్తుండటంతో నెలకు కోటి రూపాయల వరకు ఆదాయం సమకూరే అవకాశం ఉందని గత దర్యాప్తుల్లో అధికారులు పేర్కొన్నారు. సాధారణ వ్యాపార సంస్థలు కూడా సాధించలేని స్థాయిలో నగదు ప్రవాహం ఉండటంతో ఈ నెట్‌వర్క్‌పై ప్రత్యేక నిఘా పెట్టినట్లు సమాచారం. టీన్యాబ్ పోలీసులు కళాపతి గౌతమ్ సింగ్‌ను అరెస్టు చేసిన సమయంలో బయటపడిన వివరాలు సంచలనంగా మారాయి. గంజాయి విక్రయాల ద్వారా వచ్చిన డబ్బుతో గాంధీనగర్‌లో ఒక జీ+2 భవనం, లంగర్‌హౌజ్‌లో ఆస్తులు, గచ్చిబౌలిలో రెండు భారీ భవనాలు, కార్లు, ద్విచక్ర వాహనాలు కొనుగోలు చేసినట్లు గుర్తించారు. అంతేకాకుండా 16 బ్యాంకు ఖాతాల్లో రూ.1.53 కోట్లకు పైగా నగదు నిల్వలు ఉన్నట్లు గుర్తించి ఫ్రీజ్ చేశారు. మొత్తం స్వాధీనం చేసుకున్న ఆస్తుల విలువ రూ.5.2 కోట్లకు పైగా ఉన్నట్లు వెల్లడైంది.

# అంతం కాదిది... ఆరంభం



నిన్న హిట్లర్ ప్రస్తావన.ఇప్పుడు త్రేతాయుగంలోని మారీచ, సుభాహుల దుర్మార్గ చర్యలు. రాక్షస గురువు శుక్రాచార్యుని క్యారెక్టర్ . ఇలా ఇప్పుడు తెలంగాణ సీఎం ఏ అంశాన్ని వదిలి పెట్టటం లేదు. చరిత్ర, పురాణాలను గుర్తు చేస్తూ ఆయన సాగిస్తున్న ప్రసంగాలకు వాస్తవిక పరిస్థితిని జోడించి రక్తి కట్టిస్తున్నారు రేవంత్.

సీఎం రేవంత్ రెడ్డి ఇప్పుడు ఓ బృహత్తర బాధ్యత భుజం మీద వేసుకున్నారు. అదే ఫ్యూచర్ సిటీ నిర్మాణం. దీనికి సంబంధించిన పనులు పరుగులు పెట్టించాలని ఆయన సంకల్పం.. ఇక్కడే చిక్కులు వచ్చి పడుతున్నాయి. ఫ్యూచర్ సిటీ పై విపక్షాలు పెదవి విరుస్తున్నాయి. బీ ఆర్ ఎస్ ఓ అడుగు ముందుకేసి తాము అధికారంలోకి వస్తే ఫ్యూచర్ సిటీ రద్దు చేస్తామని ఖరాఖండిగా చెప్పేసింది. ఇదే సీఎం రేవంత్ రెడ్డికి మండిపోతోంది. ఓ అభివృద్ధి కార్యక్రమం చేస్తుంటే ఈ రాక్షసులు అడ్డు పడుతున్నారు. అడుగడుగునా అడ్డు పుల్లలు వేస్తున్నారు. ఫ్యూచర్ సిటీ ఓ అద్భుతమైన ఆలోచన. దాని నిర్మాణం జరిగితే విపక్షాల ఉనికి ఉండదు. అందుకే దాన్ని ముందుకు సాగకుండా కుట్రలు చేస్తున్నారు. ఎంత మంది అడ్డు వచ్చినా అడ్డంగా పడుకున్నా తొక్కుకుంటూ వెళ్లి ఫ్యూచర్ సిటీ నిర్మాణం చేస్తాం. ఇందులో రాజీ పడే ప్రశ్న లేనే లేదు. నా పట్టుదల ముందు వారి కుతంత్రాలు పని చేయవు... అసలు ఇలాంటి రాక్షసమూకలకు భవిష్యత్ లేదు. ఫ్యూచర్ సిటీకి ఆటంకాలు కల్పిస్తే వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ కు ఇప్పుడున్న ప్రతిపక్ష హోదా కూడా రాదు అంటూ సూటిగా చెప్పేసారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ను రాక్షస గురువు శుక్రాచార్యుడుతో పోల్చిన సీఎం రేవంత్ ఫామ్ హౌస్ లో పడుకున్న శుక్రుడు మారీచుడు, సుబాహుడు అనే రాక్షసులను ప్రజల మీదకు వదిలాడు అంటూ బీఆర్ఎస్ నేతలు హరీష్ రావు, కేటీఆర్ ల ను కూడా రాక్షసమూకలో కలిపేశారు సీఎం రేవంత్.

భవిష్యత్ కు ఫ్యూచర్ సిటీ ఓ మణిహారం అంటారు సీఎం. ఒకప్పుడు హైటెక్ సిటీ నిర్మాణం జరుగుతుంటే అవహేళన చేసిన వాళ్ళు వున్నారని గుర్తు చేశారు. ఫ్యూచర్ సిటీ నిర్మాణం పై సీఎంకు వున్న ఆలోచన ఏమిటో కూడా చెప్పేసారు. సింగపూర్, టోక్యో కన్నా ఇది ప్రసిద్ధి చెందుతుందని, అంత అద్భుతమైన నిర్మాణం పై ఇప్పుడు దృష్టి పెట్టామని చెప్పుకుని వచ్చారు.ఓ మంచి పని చేస్తుంటే రాక్షసమూకకు నచ్చటం లేదు. అందుకే ఫ్యూచర్ సిటీ పై అక్కసు వెళ్ళగక్కుతున్నారు అంటూ విపక్షాలపై నిప్పులు కురిపించారు సీఎం. కాలుష్య రహితంగా నిర్మాణం అయ్యే ఫ్యూచర్ సిటీ ప్రపంచంలోనే ఓ గొప్ప సిటీ అవుతుందంటారు రేవంత్. ఆయన ఆవేశంలో అర్థం వుంది.

అభివృద్ధి అనేది నిరంతరం జరగవలసిన ప్రక్రియ. భవిష్యత్ అవసరానికి అనుగుణంగా పాలకులు అడుగులు వేయాలి. ఫ్యూచర్ సిటీ నిర్మాణం ఇందులో భాగమే అయినా విపక్షాలు విమర్శలు చేస్తున్నాయి. ఓ మంచి పని చేస్తున్నప్పుడు సహకారం అందించక పోయినా పర్వాలేదు. కానీ శల్య సారధ్యం చేయటం సరికాదు అంటున్నారు మేధావులు. ఫ్యూచర్ సిటీ నిర్మాణం వల్ల హైదరాబాద్ మరింతగా విస్తరిస్తుంది. కొత్త పరిశ్రమలు వస్తాయి. ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. చాలా మందికి ఇది జీవనోపాధి అవుతుందన్నది మేధావుల అభిప్రాయం. ఫ్యూచర్ సిటీని విపక్షాలు ఎందుకు వ్యతికిస్తున్నాయి అనేది కూడా ఇక్కడ ఆలోచన చేయాలి. అసలు ప్రతి పక్షాల వాదన ఏమిటి? ఫ్యూచర్ సిటీ వల్ల భవిష్యత్ లో లాభమా? నష్టమా? ఇదే ఇప్పుడు తేలాలి. హైదరాబాద్ నగరంలో అనేక సమస్యలు ఉన్నాయని, వాటిని పక్కన పెట్టి సీఎం రేవంత్ ఫ్యూచర్ సిటీ అంటూ హంగామా చేస్తున్నారని విపక్షాలు అంటున్నాయి. అన్నింటికీ మించి కాంగ్రెస్ పార్టీ నేతలు, ముఖ్యంగా సీఎం రేవంత్ రెడ్డి బంధుగణం భూ దందాలు చేసుకునే ఎత్తుగడ వేసి ఫ్యూచర్ సిటీ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు అనేది విపక్షాల అసలు వాదన. అందుకే ఫ్యూచర్ సిటీ పై వాళ్ళు మండి పడుతున్నారు అనేది బహిరంగ రహస్యం. భవిష్యత్ అవసరాల కోసం మాత్రమే ఫ్యూచర్ సిటీ నిర్మాణం అంటూ సీఎం రేవంత్ డ్రామాలు ఆడుతున్నారని, దీని వెనుక లక్షల కోట్ల కుంభకోణం ప్లాన్ ఉందని ప్రతి పక్షాల ఆరోపణ. విపక్షాలు చేసే ఆరోపణల వెనుక నిజానిజాలు ఎలా వున్నా దీనికి సీఎం రేవంత్ సమాధానం ఇచ్చారు. హైదరాబాద్ లో కానీ, తెలంగాణ రాష్ట్రం కానీ ఎక్కడ ఒక్క గజం స్థలం కూడా తాను, తన పార్టీ నేతలు ఆక్రమించుకో లేదని ఓపెన్ గా చెప్పారు. ఎవరి హయాంలో కబ్జాలు జరిగాయో ఓ సారి ఆత్మ పరిశీలన చేసుకోవాలని చురకలు వేశారు. కే సీ ఆర్ కు పూలాభిషేకం చేసిన ఓ వ్యక్తికి హైదరాబాద్ అంబరుపేటలోని బతుకమ్మ కుంటను కబ్జా చేసుకునే అవకాశం ఇచ్చింది ఎవ్వరు? అంటూ రేవంత్ సూటిగా ప్రశ్నించారు. హైదరాబాద్ లో ఓ గంట వర్షం పడితే రోడ్లు చెరువులు కావటానికి కారణం ఎవ్వరు? కబ్జాల వల్లే ఈ దుస్థితి రాలేదా? కబ్జాదారులను వదిలి పెట్టం. వారి కోరలు పీకుతాం. సెంట్ ప్రభుత్వ భూమి కూడా కబ్జాల పరం కానివ్వం. అంటూ తేల్చి చెప్పేసారు. ముమ్ముందు కబ్జాదారుల పై అత్యంత కఠినంగా వ్యవహరించే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు సీఎం హెచ్చరిక చెప్పకనే చెబుతోంది. ఇలాంటి ఆలోచన చేస్తున్న రేవంత్ ఫ్యూచర్ సిటీలో భూదందాలకు ఆస్కారం ఇస్తారా. అలాంటి పరిస్థితి ఉంటే విపక్షాలు రెడ్ హ్యాండెడ్ గా బయట పెట్టవచ్చు. సీఎంను నిలదీయవచ్చు. అంతే కానీ ఓ సిటీ నిర్మాణం మొత్తాన్ని అడ్డుకునే ఆలోచనలు ఎంత మాత్రం సరికాదు అనేది కొందరి వాదన. కే సీ ఆర్ కాళేశ్వరం కట్టే సమయంలో కాంగ్రెస్ కూడా అవినీతి ఆరోపణలు చేసింది. అప్పుడు జరిగిన తప్పులు ఇప్పుడు బయటకు వచ్చాయి. ఫ్యూచర్ సిటీ విషయంలోనూ తప్పులు జరిగితే అవి ఎప్పటికి అయినా బయట పడక తప్పదు. అలాగని ఫ్యూచర్ సిటీ నిర్మాణం అడ్డుకునే ఆలోచనలు సరైనవి కావు. అభివృద్ధి జరగాలి. ఎక్కడ అభివృద్ధి పనులు జరుగుతాయో అక్కడ దోచుకొని దాచుకోవాలి అనే వాళ్ళు వుంటారు. వారిపై నిఘా పెట్టండి. అది విపక్షాలు చేయాల్సిన పని... పనే కాదు. గురుతర బాధ్యత కూడా. అది వదిలి వేసి అన్నింటికీ అవినీతి మరకలు పూసి అభివృద్ధి ఆపుతాం అనే దారిలో వేడితే ప్రజలు ఎంత మాత్రం సహించారు. ఇది విపక్షాలకు తెలియని అంశం ఏమి కాదు. అయినా రచ్చ చేయటం ఓ పద్ధతిగా పెట్టుకున్నాయి.

ప్రస్తుతం ఓల్డ్ సిటీ, న్యూ సిటీ, సైబర్ సిటీ వున్నాయి కదా... ఇప్పుడు మళ్ళీ ఇంకో సిటీ అవసరమా? అనే వారు లేక పోలేదు.. అవును అవసరమే. సిటీలు జనంతో నిండి పోవటం కాదు. అభివృద్ధి జరగాలి. మౌలిక వసతులు కావాలి. ముఖ్యంగా ఉపాధి, ఉద్యోగ అవకాశాలు పెరగాలి. దానికి ప్రభుత్వాలు సిటీల నిర్మాణం చేపట్టాలి. గతంలో ఇలా సిటీ నిర్మాణాలు జరగటం వల్లే లక్షల. మంది హైదరాబాద్ లో ఉద్యోగాలు, ఉపాధి పొంది జీవనం సాగిస్తున్నారు. హైదరాబాద్ భిన్నత్వంలో ఏకత్వం నగరంగా ఇప్పుడు పేరు తెచ్చుకుంది. కొత్త సిటీల నిర్మాణం వల్లే ఇది సాధ్యం అయింది. విశ్వ నగరంగా హైదరాబాద్ కు గుర్తింపు రావాలి అంటే మరింతగా ప్రగతి అవసరం. ఫ్యూచర్ సిటీ వల్ల అది సాధ్యం అయితే అంత కన్నా ప్రజలకు కావాల్సింది ఏముంటుంది. దీన్ని విపక్షాలు గుర్తించాలి. ప్రభుత్వాలు ఏ అభివృద్ధి పని చేపట్టినా దాన్ని అన్నీ కోణాల నుంచి ప్రతి పక్షాలు చూస్తూనే ఉంటాయి. ఇది చాలా మంచిదే. ప్రభుత్వాలు తప్పటడుగులు వేయకుండా జాగ్రత్త పడేందుకు అది అవసరం కూడా. అయితే అడ్డు పడటమే లక్ష్యంగా విపక్షాలు వ్యవహారిస్తేనే సమస్య వచ్చి పడుతుంది.

హైదరాబాద్ సిటీ ప్రగతి నిరంతరం సాగే ప్రక్రియ. అధికారంలో వుండే పార్టీలు వారి ఆలోచన మేరకు అభివృద్ధి చేస్తూ వస్తున్నాయి. టీడీపీ హయాంలో హైటెక్ సిటీ, ఫ్లైఓవర్ బ్రిడ్జిలు, రోడ్డు వెడల్పు కార్యక్రమాలు వంటివి జరిగినప్పుడు విపక్షాలు చేసిన రాద్ధాంతం అంతా ఇంతా కాదు. కానీ అవే ఇప్పుడు ఆసరా అవుతున్నాయి. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఓ అడుగు ముందు కేసి ఫ్యూచర్ సిటీ నిర్మాణం కోసం ప్రయత్నం మొదలు పెట్టారు. దీన్ని స్వాగతించాలి. తప్పులుంటే విపక్షాలు ప్రభుత్వం దృష్టికి తీసుకొని రావాలి. వాటిని సరి చేసేలా ప్రయత్నం చేయాలి. కేవలం బురద చల్లే వ్యవహారం, అడ్డుకునే ప్రయత్నం, రద్దు చేస్తామనే హెచ్చరికలు సహేతుకం కాదు. అలా అన్నింటికీ అడ్డ పడితే చివరికి మిగిలేది శూన్యమే. బీ ఆర్ ఎస్ ప్రభుత్వం హయాంలో కూడా హైదరాబాద్ అభివృద్ధి జరిగింది. వాటిని కూడా ఇప్పుడు ప్రజలు అనుభవిస్తున్నారు.ఏ ప్రభుత్వం అయినా కొత్త ఆలోచనలతో ప్రగతి వైపు అడుగులు వేయటం సహజం. అభివృద్ధికి అంతం ఉండకూడదు... అది ఆరంభం మాత్రమే అవ్వాలి.



జీ. వెంకటరమణ
సీనియర్ జర్నలిస్ట్



# ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు సవాల్

పశ్చిమాసియా దశాబ్దాలుగా అంతర్జాతీయ రాజకీయాలకు, వ్యూహాత్మక ఘర్షణలకు కేంద్రబిందువుగా ఉంటూ వస్తోంది. అయితే, అమెరికాఇరాన్ దేశాల మధ్య ముదురుతున్న సైనిక ఉద్రిక్తతలు మునుపెన్నడూ లేని విధంగా అంతర్జాతీయ సమాజాన్ని ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఇరాన్‌లోని వ్యూహాత్మక లక్ష్యాలపై అమెరికా జరిపిన దాడులకు ప్రతిచర్యగా, ప్రపంచ చమురు రవాణాకు జీవనాడి లాంటి 'హర్మూజ్ జలసంధి' ని మూసివేస్తున్నట్లు ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ ప్రకటించింది. ఈ పరిణామం కేవలం రెండు దేశాల మధ్య ఘర్షణగా మిగిలిపోకుండా, ప్రపంచ ఆర్థిక మరియు భద్రతా రక్షణ వలయాలను తీవ్రంగా కదిలిస్తోంది. అమెరికా సెంట్రల్ కమాండ్ సమాచారం ప్రకారం.. ఇరాన్ వైపు నుంచి కొనసాగుతున్న దూకుడుకు అడ్డుకట్ట వేసేందుకు, స్వీయ రక్షణ చర్యల్లో భాగంగా అమెరికా అధ్యక్షుడు ఈ దాడులకు ఆదేశించారు. అమెరికా వైమానిక మరియు నౌకాదళాలు ఇరాన్‌లోని కీలక తీర ప్రాంతాలైన బందర్ అబ్బాస్, సిరిక్, ఖేష్మ్ మరియు హెంగామ్ ద్వీపాలను లక్ష్యంగా చేసుకుని విరుచుకుపడ్డాయి. బందర్ అబ్బాస్, గోర్గాన్ నగరాల్లో భారీ పేలుళ్లు సంభవించగా, మినాబ్ కౌంటీలో ఇద్దరు పౌరులు గాయపడ్డారు. దీనికి ప్రతిస్పందనగా, ఐఆర్‌జీసీ తన టెలిగ్రామ్ వేదికగా హర్మూజ్ జలసంధిని అన్ని రకాల వాణిజ్య, చమురు నౌకలకు మూసివేస్తున్నట్లు ప్రకటించింది. "నియమాలను అతిక్రమిస్తే నౌకలను కాల్చేస్తాం" అని ఇరాన్ హెచ్చరించడమే కాకుండా, జలసంధిని దాటేందుకు ప్రయత్నించిన రెండు వాణిజ్య నౌకలపై దాడులు కూడా చేసింది. అమెరికా వైమానిక దాడులకు ప్రతీకారం తీర్చుకుంటామని ఇరాన్ ప్రకటించిన వేళ బహ్రెయిన్‌లో క్షిపణి హెచ్చరిక సైరన్లు మోగడం గల్ఫ్ ప్రాంతమంతా అప్రమత్తమైన స్థితిని సూచిస్తోంది. ఈ ఉద్రిక్తతల నడుమ ఒమన్ తీరంలో ప్రయాణిస్తున్న పలావు జెండాతో ఉన్న 'ఎంటీ సెట్టెబెల్లో' వాణిజ్య నౌకపై జరిగిన క్షిపణి దాడి అంతర్జాతీయంగా తీవ్ర ఆందోళనకు దారితీసింది. అయితే ఈ దాడిపై అమెరికా సెంట్‌కామ్ భిన్నమైన ప్రకటన చేసింది. గల్ఫ్ ఆఫ్ ఒమన్‌లో ఇరాన్ చమురును అక్రమంగా తరలిస్తున్న నౌకలను అడ్డుకునేందుకు తాము అమలు చేస్తున్న దిగ్బంధనంలో భాగంగానే ఈ నౌకను నిలిపివేసినట్లు పేర్కొంది. నౌక సిబ్బంది తమ ఆదేశాలను పాటించకపోవడం వల్లే ఖచ్చితమైన ఆయుధాలతో నౌక ఇంజిన్ గదిని లక్ష్యంగా చేసుకున్నట్లు అమెరికా వెల్లడించింది. ఈ ఆర్థిక దిగ్బంధనం ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకు అమెరికా బలగాలు 8 నౌకలను నిర్వీర్యం చేశాయని, 134 నౌకలను మళ్లించాయని, కేవలం మానవతా సహాయానికి సంబంధించిన 42 నౌకలకు మాత్రమే అనుమతిని ఇచ్చామని అమెరికా ప్రకటించింది. ఈ ఘర్షణల వల్ల అంతర్జాతీయ సముద్ర రవాణా భద్రత పూర్తిగా ప్రశ్నార్థకంగా మారింది. ఈ నేపథ్యంలో అంతర్జాతీయ సంస్థలు మరియు భారత్ తీవ్రంగా స్పందించాయి:

భౌగోళ శాస్త్రపరంగా, వ్యూహాత్మకంగా ప్రపంచంలోనే అత్యంత కీలకమైన సముద్ర మార్గాలలో హర్మూజ్ జలసంధి అగ్రస్థానంలో ఉంటుంది. ప్రపంచవ్యాప్తంగా సముద్ర మార్గాల ద్వారా జరిగే మొత్తం ముడి చమురు రవాణాలో దాదాపు 20% కంటే ఎక్కువ భాగం (రోజుకు సుమారు 20 మిలియన్ బారెళ్ల చమురు) ఈ చిన్న జలసంధి గుండానే సాగుతుంది. సౌదీ అరేబియా, యూఏఈ, కువైట్, ఇరాక్, ఖతార్ వంటి ప్రధాన చమురు మరియు సహజ వాయువు ఉత్పత్తి దేశాలకు అంతర్జాతీయ మార్కెట్‌కు చేరుకోవడానికి ఇదొక్కటే సురక్షితమైన జలమార్గం. జలసంధి దీర్ఘకాలం మూతపడితే చమురు సరఫరా ఆగిపోయి ప్రపంచ మార్కెట్‌లో ముడి చమురు ధరలు ఆకాశాన్ని తాకుతాయి. ఇది నేరుగా పెట్రోల్, డీజిల్ ధరలపై ప్రభావం చూపుతుంది. వాణిజ్య నౌకలు ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాల్సి రావడం వల్ల రవాణా ఖర్చులు, సమయం విపరీతంగా పెరుగుతాయి. ఇది అంతర్జాతీయ వ్యాపారాలను దెబ్బతీస్తుంది. భారత్ తన దేశీయ చమురు అవసరాలలో దాదాపు 8085% వరకు దిగుమతుల పైనే ఆధారపడుతోంది. అందులోనూ మెజారిటీ చమురు పశ్చిమాసియా దేశాల నుంచే వస్తుంది. ఈ సంక్షోభం వల్ల దేశంలో ఇంధన కొరత ఏర్పడటమే కాకుండా ద్రవ్యోల్బణం పెరిగి, రూపాయి విలువ క్షీణించే ప్రమాదం ఉంది. అదనంగా, పశ్చిమాసియాలో నివసిస్తున్న లక్షలాది మంది భారతీయ వలసదారుల భద్రత కూడా ప్రభుత్వానికి పెద్ద ఆందోళనకరమైన అంశంగా మారుతుంది. పశ్చిమాసియాలో రేగిన ఈ తాజా చిచ్చు కేవలం అమెరికాఇరాన్ దేశాల మధ్య సరిహద్దు వివాదం కాదు; ఇది ప్రపంచ శాంతి భద్రతలకు మరియు ఆర్థిక స్థిరత్వానికి పొంచి ఉన్న పెద్ద ముప్పు. ఈ ఉద్రిక్తతలపై భారత విదేశాంగ శాఖ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ప్రాంతంలో కొనసాగుతున్న ఘర్షణలే ఇందుకు కారణమని వ్యాఖ్యానిస్తూ.. ఉద్రిక్తతలను వెంటనే తగ్గించాలని, దౌత్యపరమైన చర్చల ద్వారానే సమస్యకు పరిష్కారం కనుగొనాలని భారత్ అన్ని పక్షాలకు పిలుపునిచ్చింది. శాంతి, స్థిరత్వం పునరుద్ధరించేందుకు అన్ని పక్షాలు సంయమనం పాటించాలని విజ్ఞప్తి చేసింది. ఐక్య రాజ్యసమితి , అంతర్జాతీయ సముద్ర సంస్థ వంటి అంతర్జాతీయ శక్తులు తక్షణమే జోక్యం చేసుకుని, అంతర్జాతీయ జలమార్గాలను యుద్ధ క్షేత్రాలుగా మార్చకుండా, ఉమ్మడి ప్రపంచ ప్రయోజనాల కోసం వాటిని రక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. సైనిక దాడులు మరియు బెదిరింపుల వల్ల సమస్య మరింత జటిలమవుతుందే తప్ప పరిష్కారం లభించదని గుర్తించి, చర్చల ద్వారా శాంతిని నెలకొల్పడమే ఏకైక మార్గం.

# నెత్తురోడుతున్న నాగరికత

**కాంక్రీట్ అడవుల్లో దయనీయంగా నలిగిపోయిన పసిప్రాణం.**



ఆధునిక సమాజపు ఆకాశహర్మ్యాలు అంతరిక్షాన్ని తాకేలా ఎంత ఎత్తుకు ఎదుగుతున్నాయో, మనలోని కనీస మానవత్వం అంతకంటే వేగంగా పాతాళానికి పడిపోతోందనడానికి తెలంగాణ రాష్ట్రంలోని ఖమ్మం నగరంలో జరిగిన కిరాతక ఘటనే ఒక సజీవ, నెత్తురోడుతున్న సాక్ష్యం. అత్యంత భద్రతకు మారుపేరుగా, రక్షణకు కవచంగా భావించే అపార్ట్‌మెంట్ గోడల మధ్యే ఒక పన్నెండేళ్ల పసికందుపై జరిగిన అమానుష కాండ, యావత్ నాగరిక సమాజాన్ని సిగ్గుతో తలదించుకునేలా చేసింది. ఒక పన్నెండేళ్ల వయసున్న మైనర్ బాలికపై లైంగిక దాడికి యత్నించడమే కాకుండా, తన వికృత దురాగతం ఎక్కడ బయటపడుతుందో అనే ఉద్దేశ్యంతో, ప్రాణ భయంతో అల్లాడిపోతూ కేకలు వేస్తున్న ఆ చిన్నారిని భవనం నాలుగో అంతస్తు నుంచి ఏమాత్రం కనికరం లేకుండా కిందకు విసిరేసిన రాక్షసత్వం రాష్ట్ర సమాజాన్ని నిలువెల్లా వణికించింది. ఈ సంఘటన కేవలం ఒక కామాంధుడు చేసిన సాధారణ నేరంగా దస్త్రాల్లో నిక్షిప్తమైపోయే క్రైమ్ వార్త కాదు; ఇది సామాజిక ఆర్థిక అంతరాలు, అణగారిన వర్గాల నిస్సహాయత, మరియు ఏమాత్రం చలనం లేని వ్యవస్థాగత మౌనం కలిసి చేసిన ఒక ఉమ్మడి సామాజిక హత్యాయత్నం.

ఈ దారుణాన్ని కేవలం ఒక దర్యాప్తు కోణంలోనో, న్యాయపరమైన సెక్షన్ల కోణంలోనో చూడలేము. దీని వెనుక అత్యంత దయనీయమైన, గుండెను పిండేసే సామాజిక అగాధం దాగి ఉంది. బాధితురాలైన ఆ 12 సంవత్సరాల పసిగట్టని మైనర్ బాలిక ఖమ్మం నగర సమీపంలోని ఒక గురుకుల పాఠశాలలో విద్యనభ్యసిస్తోంది. వేసవి సెలవుల రాగానే, ఆడుకుందామని సుమారు పది రోజుల క్రితం ఖమ్మం నగరంలోని ఒక అపార్ట్‌మెంట్‌లో కాపలాదారుడిగా (వాచ్‌మన్) పనిచేస్తున్న తన తాతయ్య వద్దకు ఆ చిన్నారి ఎంతో మురిపెంగా చేరుకుంది. ఇక్కడే మన వ్యవస్థలోని అంతులేని అసమానత వెక్కిరిస్తోంది. నగరాల్లోని భారీ నివాస సముదాయాల్లో దర్జాగా నివసించే యజమానులకు, రేయింబవళ్లు వారికి కాపలాగా నిలబడే అట్టడుగు వర్గాల కుటుంబాలకు మధ్య ఉన్న ఆర్థిక అంతరం ఎంతో భయంకరమైనది. నిందితుడైన మహ్మద్ గౌస్ పాషా, వయస్సు సుమారు 49 సంవత్సరాలు ఉన్న ఒక మధ్య వయస్కుడు, అదే అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటూ వృత్తిరీత్యా డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. తన తాతయ్య అదే భవనంలో కేవలం ఒక నిరుపేద కాపలాదారుడు కావడంతో, ఆ చిన్నారి నిందితుడి దృష్టిలో సులభంగా లోబరుచుకోగలిగిన, ఎదిరించి అరవలేని ఒక బలహీనమైన మాంసపు ముద్దలా కనిపించింది. పట్టెడన్నం కోసం పల్లెల నుంచి పట్టణాలకు వలస వచ్చిన నిరుపేద కుటుంబాల పిల్లలు కాంక్రీట్ అడవుల్లో ఎంతటి అభద్రతా భావం మధ్య బిక్కుబిక్కుమంటూ బతుకుతున్నారో ఈ సంఘటన నిలువెత్తు అద్దం పడుతోంది.

ఏదైనా ఒక దారుణమైన నేరం ఒకే రాత్రిలో అకస్మాత్తుగా జరిగిపోదు. దాని వెనుక కచ్చితంగా సమాజపు బాధ్యతారాహిత్యపు ఛాయలు దాగి ఉంటాయి. ఈ వ్యవహారంలో కూడా నిందితుడు మహ్మద్ గౌస్ పాషా అకస్మాత్తుగా ఆ రోజు నేరానికి ఒడిగట్టలేదు. కిరాతకం జరిగిన తేదీకి కచ్చితంగా వారం రోజుల ముందే ఆ బాలికను లైంగికంగా వేధించేందుకు, ఆమెపై అసభ్యంగా ప్రవర్తించేందుకు పాషా ప్రయత్నించాడు. పాషా తనపై చేతులు వేసి అసభ్యంగా ప్రవర్తించాడని, ఆ ఘటన తరువాత అతడు ఎదురుపడినప్పుడల్లా తాను ప్రాణభయంతో తప్పించుకుని దాక్కుంటున్నానని ఆ చిన్నారి ముందే తన తల్లికి చెప్పింది. కూతురు పడుతున్న నరకాన్ని చూసి తల్లడిల్లిపోయిన ఆ తల్లి, కన్నీరుమున్నీరవుతూ ఈ దుర్మార్గపు ప్రవర్తన గురించి ఒక స్థానిక నివాసికి మొరపెట్టుకుంది. కానీ, ఆ కన్నీరు ఎవరి మనసునూ కరిగించలేదు. ఎవరూ పట్టించుకోలేదు, పోలీసుల దాకా ఆ ఫిర్యాదు వెళ్లేలా ఎవరూ సాయం చేయలేదు. ఇది మన సమాజంలో పాతాళం దాకా పాతుకుపోయిన ఒక భయంకరమైన, రక్తం గడ్డకట్టించే వ్యవస్థాగత మౌనం. తోటి మనిషి కష్టంలో ఉంటే మనకెందుకులే అని ముఖం చాటేసే ఆ క్రూరమైన సామాజిక నిశ్శబ్దమే, నేడు ఆ చిన్నారిని మృత్యుఒడికి చేర్చేదాకా వెళ్లిందన్నది కాదనలేని సత్యం. ఆ రోజు ఒక్కరంటే ఒక్కరు సాటి మనిషిగా స్పందించి ఉంటే, ఈ కిరాతక హత్యా యత్నాన్ని నూరు శాతం నివారించే అవకాశం ఉండేది. ఈ నేరంలో ఆ కామాంధుడి చేతులకు ఎంత నెత్తురు అంటిందో, చూసి చూడనట్టు వదిలేసిన ఈ మౌన సమాజపు చేతులకు కూడా అంతే నెత్తురు అంటింది.

జూన్ 6వ తేదీ సాయంత్రం ఆ మృగత్వం అత్యంత కిరాతకమైన, భయానక రూపం దాల్చింది. సాయంత్రం సమయంలో బాలిక ఆడుకునేందుకు అపార్ట్‌మెంట్ రెండవ అంతస్తుకు వెళుతుండగా, అప్పటికే కామంతో కళ్లు మూసుకుపోయి పొంచి ఉన్న నిందితుడు గౌస్ పాషా, ఆమెను వెంబడించాడు. ఎవరూ లేని సమయం చూసి వెనుక నుంచి ఆ పసికందును గట్టిగా పట్టుకుని, అసభ్యంగా తాకుతూ అత్యాచారానికి యత్నించాడు. ఊహించని ఈ విపత్తుకు ప్రాణభయంతో వణికిపోయిన ఆ 12 ఏళ్ల పసికందు, తన సర్వశక్తులూ ఒడ్డి ఆర్తనాదాలు చేసింది. ఆ చిన్నారి కేకలతో అపార్ట్‌మెంట్‌లో తన గుట్టు రట్టవుతుందని భయపడిన నిందితుడు, రాక్షసుడిగా మారాడు. తన కామదాహం ఎవరికీ తెలియకూడదనే ఏకైక స్వార్థంతో ఆ బాలికను నోరునొక్కి బలవంతంగా అపార్ట్‌మెంట్ నాలుగో అంతస్తు పైకి లాక్కెళ్లి, ఏమాత్రం జాలి, కనికరం లేకుండా పైనుంచి కిందకు విసిరేశాడు. గాల్లోంచి కింద పడుతున్నప్పుడు ఆ పసి ప్రాణం ఎంతగా విలవిలలాడిపోయి ఉంటుందో ఊహిస్తేనే గుండెలు పిండేసినట్లు అవుతుంది. పైనుంచి పడిన పెద్ద శబ్దం విని బాలిక తాతయ్య పరుగున వచ్చి చూడగా, అప్పటికే తన ప్రాణసమానమైన మనవరాలు రక్తపు మడుగులో, ముక్కలైన శరీరంతో చావుబతుకుల మధ్య అచేతనంగా పడి ఉంది. ఆసుపత్రిలో ప్రాథమిక పరీక్షలు నిర్వహించిన వైద్యులు, ఆ చిన్నారి వెన్నెముకకు తీవ్రమైన గాయాలు అయ్యాయని, కాలు, కుడి భుజం మరియు పలు పక్కటెముకలు విరిగిపోయాయని నిర్ధారించారు. ఆ గాయాలు కేవలం ఆ చిన్నారి దేహానికే కాదు, యావత్ పౌర సమాజపు ఆత్మకు తగిలిన గాయాలు.

అయితే, ఈ విచారణలో పౌర సమాజాన్ని ముక్తకంఠంతో నిలదీసే అత్యంత లోతైన, కన్నీళ్లు తెప్పించే మానవీయ కోణం మరొకటి దాగి ఉంది. రెండు రోజుల పాటు చావుబతుకుల మధ్య అపస్మారక స్థితిలో నరకం అనుభవించిన ఆ బాలిక, ఐసీయూలో స్పృహలోకి వచ్చిన వెంటనే ఒక భయంకరమైన పని చేసింది. తనను ఆ కామాంధుడు పైనుంచి తోసేశాడన్న అసలు నిజాన్ని కుటుంబ సభ్యులకు, పోలీసులకు దాచిపెట్టేందుకు ఆమె ప్రయత్నించింది. తాను ఆడుకుంటూ ప్రమాదవశాత్తు పైనుంచి పడిపోయానని ముందుగా అబద్ధం చెప్పింది. చావు అంచుల దాకా వెళ్లొచ్చిన ఆ పసి ప్రాణం ఆ నిజాన్ని ఎందుకు దాచాలనుకుంది? ఒకవేళ తాను తనపై జరిగిన అఘాయిత్యాన్ని బయటపెడితే, అదే అపార్ట్‌మెంట్‌లో కాపలాదారుడిగా ఉన్న తన తాతయ్య ఉద్యోగం ఎక్కడ ఊడిపోతుందో, పేదరికంలో ఉన్న తమ కుటుంబం ఎక్కడ వీధిన పడి అనాథలవుతుందో అన్న అంతులేని అభద్రతా భావం ఆ చిన్నారిని భయపెట్టింది. విరిగిన ఎముకల నొప్పుల బాధ కంటే, నిరుపేద బతుకులపై ఉన్న భయమే ఆ పసిమనసును అంతగా తొలిచివేసిందంటే, అట్టడుగు వర్గాలు నివాస సముదాయాల్లో ఎంతటి దారుణమైన అణచివేత మధ్య, ఎంతటి బిక్కుబిక్కుమనే బానిసత్వపు ఛాయల్లో బతుకుతున్నారో కళ్లకు కట్టినట్లు అర్థమవుతోంది. ప్రాణాలు పోతున్న సమయంలో కూడా ఒక పన్నెండేళ్ల చిన్నారి తన తాతయ్య ఉపాధి గురించి భయపడటం అనేది, పేదరికం సృష్టించే తీరని వ్యథకు పరాకాష్ట. బంధువులు కన్నీళ్లతో ధైర్యం చెప్పడం వల్ల, మరియు మేజిస్ట్రేట్ కౌన్సెలింగ్ అందించిన తరువాత మాత్రమే, ఆ చిన్నారి తనపై జరిగిన మృగత్వాన్ని మేజిస్ట్రేట్ ముందు కన్నీరుమున్నీరుగా వాంగ్మూలంగా ఇచ్చింది.

చిన్నారి గుండెను పిండేసే ఆ నిజాలు వెల్లడించిన వెంటనే, పోలీసులు కదిలారు. నిందితుడు మహ్మద్ గౌస్ పాషాపై పోక్సో (POCSO) చట్టంలోని కఠినమైన సెక్షన్లు, మరియు భారతీయ న్యాయ సంహిత (BNS) లోని హత్యాయత్నం సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. తన దారుణం బయటపడిందని తెలుసుకున్న నిందితుడు, ప్రభుత్వ కార్యాలయాల సిబ్బందితో తనకున్న పరిచయాలతో కొందరిని సంప్రదించి, బాధిత కుటుంబానికి డబ్బు ఆశచూపి కేసును నీరుగార్చాలని ఒక నీచమైన ప్రయత్నం చేశాడు. పేద వాచ్‌మన్ కుటుంబమే కదా అని సెంటిమెంట్ రగిల్చి కేసును తప్పుదోవ పట్టించాలని వారు మొదట ప్రయత్నించినప్పటికీ, బాధితురాలి వయస్సు, గాయాల తీవ్రత, మరియు పోక్సో చట్టం యొక్క కఠినత్వం గురించి తెలుసుకున్న వెంటనే, ఆ పాప ఉసురు తగులుతుందేమోనన్న భయంతో పక్కకు తప్పుకున్నారు. ఏ ఒత్తిళ్లకు తలొగ్గకుండా పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకుని, ఫాస్ట్ ట్రాక్ కోర్టులో హాజరుపరచి జైలుకు తరలించారు.

ఈ కిరాతక ఘటన వెలుగులోకి రాగానే, ఖమ్మం నగరంతోపాటు రాష్ట్రవ్యాప్తంగా సామాన్యుల గుండెల్లో ఆగ్రహావేశాలు కట్టలు తెంచుకున్నాయి. ఈ పైశాచిక కృత్యాన్ని భారతీయ జనతా పార్టీ (బీజేపీ) నాయకులు అత్యంత తీవ్రంగా ఖండించారు. బాధిత చిన్నారికి తక్షణమే న్యాయం చేయాలని, కామాంధుడైన నిందితుడిని అత్యంత కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ నేతలు ఆందోళనలు చేపట్టారు, మరియు స్థానిక వ్యవస్థలకు గట్టి వార్నింగ్ ఇచ్చారు. పేదరికమే బలహీనతగా, నిస్సహాయతే నేరస్థులకు అవకాశంగా మారుతున్న ప్రస్తుత వ్యవస్థలో, అణగారిన వర్గాల చిన్నారులకు కనీస భద్రత కరువైతే మనం ఎంతటి గొప్ప రాకెట్లు పంపే నాగరిక సమాజాన్ని నిర్మించినా అది బూడిదలో పోసిన పన్నీరే అవుతుంది.

అభం శుభం తెలియని పసి పిల్లలు కామాంధుల చేతుల్లో మాంసపు ముద్దల్లా నలిగిపోతుంటే, దాన్ని చూసి నిరోధించలేని, కనీసం స్పందించలేని సమాజం యొక్క సమిష్టి వైఫల్యంగా, మనందరి పాపంగా ఇది పరిగణించబడాలి. నిందితుడు మహ్మద్ గౌస్ పాషాకు మన న్యాయ వ్యవస్థ అత్యంత కఠినమైన, మరెవరైనా ఇలాంటి తలంపు తలవాలంటేనే వెన్నున్న వణికేలా సత్వర శిక్షను విధించి తీరినప్పుడే, ఆసుపత్రి బెడ్‌పై విరిగిన ఎముకలతో చావుతో పోరాడుతున్న ఆ చిన్నారికి నిజమైన న్యాయం జరిగినట్లు అవుతుంది. కేవలం చట్టాలు చేయడం మాత్రమే కాకుండా, పోలీసులు, న్యాయ వ్యవస్థ, వైద్య యంత్రాంగం మరియు పౌర సమాజం తమ అంతరాత్మను తట్టిలేపుకుని, భవిష్యత్తులో ఏ చిన్నారికీ ఇలాంటి దారుణమైన గతి పట్టకుండా ఒక పటిష్టమైన రక్షణ కవచాన్ని నిర్మించాల్సిన అవసరం ఉంది. లేకపోతే, అపార్ట్‌మెంట్ పైనుంచి కింద పడి రక్తమోడుతున్న ఆ పసికందు లాగే, మన నాగరికత కూడా ఎప్పటికీ పాతాళంలో రక్తమోడుతూనే ఉంటుంది. ఈ ఘటన ఉదాసీనంగా, అత్యంత స్వార్థపూరితంగా వ్యవహరిస్తున్న యావత్ పౌర సమాజపు మొద్దుబారిన గుండెను పిండి, నిద్రలేపే ఒక చారిత్రక మేలుకొలుపుగా మిగిలిపోవాలి

( గడల నరసింహారావు
సీనియర్ జర్నలిస్ట్ ఖమ్మం)



# కళ్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేసిన ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

**యాదాద్రి భువనగిరి జూన్ 11 మహా :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు నియోజకవర్గంలోని ఎనిమిది మండలాల ఆలేరు, గుండాల, ఆత్మకూరు, మోటకొండూరు, యాదగిరిగుట్ట, రాజపేట, బొమ్మలరామారం, తుర్కపల్లి మండలాల పలు గ్రామాలకు చెందిన కళ్యాణ లక్ష్మి పథకం లబ్ధిదారులకు ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య గురువారం చెక్కులను పంపిణీ చేశారు తన క్యాంపు కార్యాలయం వద్ద లబ్ధిదారులకు స్వయంగా చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా బీర్ల ఐలయ్య మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని అమలు చేస్తున్న పథకాలలో కళ్యాణ లక్ష్మి ఒక ముఖ్యమైన పథకమని తెలిపారు. ఈ పథకం ద్వారా ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు కుమార్తెల వివాహ సమయంలో ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తూ భరోసా కల్పిస్తున్నదని చెప్పారు.అలాగే ఆలేరు నియోజకవర్గంలో అభివృద్ధి మరియు సంక్షేమ కార్యక్రమాలు సమన్వయంతో కొనసాగుతున్నాయని, ప్రతి అర్హుడికి ప్రభుత్వ పథకాలు చేరేలా చర్యలు తీసుకుంటున్నామని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు, మహిళా లబ్ధిదారులు మరియు వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# ప్రజల శారీరక మానసిక ఆరోగ్యానికి పార్కులు ఎంతో దోహదపడతాయి

**ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్**

**రాజేంద్రనగర్ మహా :** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ రాజేంద్రనగర్ జోన్ పరిధిలోని వార్డు నెం.120, 113.సర్కిల్ 19,జనచైతన్య కాలనీ నెం,66 ను సిరిమల్లె కాలనీలో పార్కులను సుమారు 52.25 లక్షలతో నూతనంగా అభివృద్ధి చేసి పార్కులను రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్సీ మీర్జా రహమత్ బాగ్ ఖాద్రి తో కలిసి ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ గురువారం ప్రారంభించారు. ప్రజల శారీరక మానసిక ఆరోగ్యానికి పార్కులు ఎంతో దోహదపడతాయిన్నారు. కాలుష్యాన్ని తగ్గించి స్వచ్ఛమైన గాలిని అందించడమే కాక, పిల్లల ఆటలకు, పెద్దల విశ్రాంతికి మరియు సంఘంలో సత్సంబంధాలు పెంపొందించుకోవడానికి ఇవి చక్కటి వేదికలుగా పనిచేస్తాయి. నేటి సమాజంలో పార్కులు అవసరం అన్నారు.ఈ పార్కులను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు.కార్యక్రమంలో జిహెచ్ఎంసి అధికారులు,పార్టీ నాయకులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.



# కష్టాల కడలిలో వేణుగోపాలుడు

- దేవుని మాన్యం వేలం అడ్డుకుంటున్నదెవరు?
- దూప దీప నైవేద్యాలకోసం ఎదురుచూపులెందుకు?
- విషపూరిత ప్రచారాల వెనుక దాగిఉన్న రహస్యమేంటి ?



**దమ్మపేట ,మహా :** అతిపురాతనమైన రాతికట్టడాల తో ,చరిత్ర ను నేటి యుగానికి అందించే కాకతీయుల కాలంనాటి సంతాన వేణుగోపాల దేవాలయానికి కష్టాలు వచ్చి పడ్డాయా...? లేక విషపూరిత ప్రచారాల నే ఆయుధాలు గా ,అస్త్రాలుగా చేసుకొని కష్టాల ఊబిలోకి ఆలయాన్ని నెట్టివేస్తున్నారా...? అసలు సాఫీగా సాగే ఆలయ అభివృద్ధి పనులలో అడ్డంకులు సృష్టించి నేడు దూపదీప నైవేద్యాలకు సైతం ఎదురు చూపులు చూడాల్సిన పరిస్థితి ని ,దుస్థితిని తీసుకు రావడానికి కారకులెవరు...? ఈ ప్రశ్నలన్నింటిని స్థానిక హైందవ భక్తజనులు ప్రశ్నిస్తున్నారు. దమ్మపేట మండల కేంద్రంలో నెలకొనియున్న పురాతన సంతన వేణుగోపాల స్వామి ఆలయాన్ని పునరుద్ధరణ చేసేందుకు గ్రామస్థులు సహకరించాలని కమిటీ సభ్యులు ముక్తకంఠంతో వేడుకుంటున్నారు. దుష్ప్రచారం తో ఆర్థిక ఇబ్బందులు తలెత్తే అవకాశాలు ఉన్నట్లు భక్తులు ఆవేదన చెందుతున్నారు.

గత 2022 వరకు దేవాలయానికి ఎటువంటి స్థిరాస్తులు లేకపోయినప్పటికీ గ్రామస్థులు అందరూ కలిసి నిత్యపూజలతో ఆలయాన్ని వెలుగొందించారు. ఆనాడు కమిటీ సభ్యులు ఉన్నా లేక పోయినా దేవాలయంలో గుట్టు రట్టు కాకుండా ఎంత వచ్చినా , ఎంత ఖర్చులు ఐనా సామాన్య ప్రజలకు బహిర్గతం అయ్యేది కాదు. మరి 2022 తర్వాత పురజనులు , అధికారులు ,ఆనాటి శాసనసభ్యులు ఇతర ప్రజాప్రతినిధులు ,ముఖ్యంగా పాత్రికేయులు ప్రధాన శీర్షిక వహించి ఎవరో కంబంధహస్తాలలో ఉన్న దేవాలయ మాన్యాన్ని అతి చాకచక్యంగా నాటి దేవాలయ చైర్మన్ వ్యయప్రసాలకోర్చి ,కొంత స్వంత నగదును సైతం పెట్టుబడి పెట్టి భూమిని స్వాధీనపరుచుకోవడంలో కృతకృత్యులయ్యారు.

**2023 నుండి ఏం జరిగింది ...?**

2022లో కబంధ హస్తాలలో ఉన్న భూమిని ఆలయానికి చెందేలా చేయడానికి మొట్టమొదటి సారిగా 2023 ,24,25 సంవత్సరాలు అంటే మూడు సంవత్సరాలకు కౌలు వేలం బహిరంగంగా ,ఆలయ ఈఓ సమక్షంలో ,గ్రామ పెద్దల సమక్షంలో వేలం వేయడం జరిగింది. మరి ఆ వేలం పాట పాడిన సదరు రైతు మూడు సంవత్సరాల కు చెందిన నగదు ను ఆలయ కమిటీ వారికైనా లేదా ఎండోమెంట్ అధికారులకైనా అప్పగించారా....? అసలు వేలం పాట ఎంతకు జరిగింది...? ఆ నగదు ఎవరి ఖాతాలో జమ చేశారు ? అనే విషయాలు బహిరంగంగా వెల్లడి చేయాల్సి ఉందా...? లేదా..? గ్రామ పెద్దలు నిర్ణయించాల్సి ఉంది. మరొక ముఖ్యమైన విషయం ఏమంటే ఆ సమయంలో ఆలయ చైర్మన్ ఎవరనేది కీలక అంశంగా గుర్తుంచుకోవాలి.

**బ్యాంకు ఖాతాలో లక్షా ఇరవై వేలే ఎందుకు ఉన్నాయి...?**

ప్రస్తుతం ఉన్న సమాచారం మేరకు ఎండోమెంట్ అధికారి చే తెరవబడిన బ్యాంకు ఖాతాలో ఆలయానికి సంబందించిన నగదు కేవలం ఒక లక్షా ఇరవై వేల రూపాయలు మాత్రమే నిల్వ ఉన్నట్లు తెలుస్తోంది. మరి మూడు సంవత్సరాలు కౌలు వేలంలో వచ్చిన నగదు ఎంత...?

మొత్తం ఒక లక్షా ఇరవై వేలు మాత్రమే నా...? ఈ విషయం పై అధికారులు స్పష్టంగా వివరణ ఇవ్వాల్సిన అవసరం ఉంది.

**ప్రభుత్వం మారిన తర్వాత :**

నాడు బిఆర్ఎస్ ప్రభుత్వం లో ఆలయ భూములు సాధించుకున్న తర్వాత రాష్ట్ర ప్రభుత్వం మారింది. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే కొన్ని నెలల తర్వాత ఆలయ చైర్మన్ లను సైతం గ్రామ పెద్దలు ,శాసనసభ్యుల అభీష్టం మేరకు చైర్మన్ లను నియమించారు. దానిలో భాగంగానే వేణుగోపాలస్వామి ఆలయానికి చైర్మన్ గా పసుమర్తి సత్యనారాయణ ,ఇతర కమిటీ సభ్యులను పెద్దల సమక్షంలో నిర్ణయించారు. నాటి నుండి నేటి వరకు గ్రామస్తులంతా కలిసి ఆర్థికంగా చేయూత నందించడంతో ఆలయంలో దూపదీప నైవేద్యాలకు కొరత లేకుండా సాఫీగా జరిగిపోతుంది.

విషపూరిత ప్రచారానికి నాంది పలికిందెవరు ..?

సర్వసాధారణం గానే ఎప్పటివలే ఆలయ భూముల కౌలుకు ఆలయ చైర్మన్ ఆద్వర్యంలో ప్రకటన విడుదల చేశారు. ఓ రైతు తన పరిదిలో దాదాపుగా లక్ష రూపాయల వరకే వేలం గెలుచుకున్నట్లు తెలిసింది. ఐతే వివాదం రావడానికి ఇదే అంశాన్ని ప్రామాణికంగా చూపుతూ...ఆలయ అధికారులు లేకుండా వేలం పాట ఎలా కొనసాగిస్తారంటూ వివాదాన్ని తెరపైకి తీసుకువచ్చి ప్రస్తుత చైర్మన్ గా ఉన్న వ్యక్తి పై విషపూరిత ప్రచారాలు చేయడంతో వివాదం తారాస్థాయికి తీసుకువెళ్ళడంలో ప్రత్యక్షంగా పాల్గొన్న దెవరు...? పరోక్షంగా పాత్రదారులెవరనే ప్రశ్న అంతుచిక్కడం లేదని స్థానికులు భ్రమలో పడ్డారు.

**వేలంపాటకు చిక్కులెన్నో...?**

వేలం పాటను అధికారుల సమక్షంలో జరపాలని గ్రామస్తులు కోరడం తప్పేమీ కాకపోయినప్పటికి , చైర్మన్ గా ఉన్న వ్యక్తి కి అధికారులు సమాచారం తెలియజేసి ,వారిరువురు కలిసి వేలంపాట ప్రక్రియను ప్రకటిస్తే సమస్యలు తలెత్తకుండా ఉండేవని స్థానికులు చర్చించుకుంటున్నారు. ఓ మాజీ చైర్మన్ తో కలిసి వేలం ప్రకటన వేయించడం వల్లనే వివాదాలకు వేదికగా దేవాలయం మారిందని ,దాని పర్యవసానంగా దూపదీప నైవేద్యాలకు అందాల్సిన ప్రభుత్వ సొమ్ము రాకుండా నిలిపివేశారనే అపవాదులు వినిపిస్తున్నాయి.

**వాస్తవానికి జరిగింది ఇదే...:**

ఆలయానికి రావాల్సిన దూపదీప నైవేద్యాలకు ,ఈ వివాదానికి సంబంధం లేదు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఆలయభూములు స్థిరాస్థులు ఐదు ఎకరాల లోపు ఉంటేనే దూపదీప నైవేద్యాలకు ఆర్థిక సహాయం అందుతుంది. మరి మన ఆలయానికి దాదాపుగా 11ఎకరాలు స్థిరాస్థులు ఉన్నట్లు రికార్డుల ద్వారా ప్రభుత్వానికి సమాచారం ఉంది. పైగా ఇటీవల కాలంలో జరిగిన ఆడిటింగ్ లో దేవాలయానికి వచ్చి అధికారులు లెక్కలు తేల్చారు. అందుకే ప్రభుత్వ సహాయం నిలిపివేసిఉంటారని అందరూ భావిస్తున్నారు. సందడిలో సడేమియా లాగా ప్రస్తుతం ఉన్న ఆలయ అర్చకుల కు అంటు రావడంతో పూజా కార్యక్రమాలు చేయించడానికి ప్రస్తుత చైర్మన్ పడే పాట్లు వర్ణణాతీతం. ఈ కష్టాలు వేణుగోపాలుడే తీర్చుకోవాలి సుమీ....




# ఈనెల 13న ఆదిలాబాద్ కు మంత్రి జూపల్లి రాక

- పలు అభివృద్ధి కార్యక్రమాలకు హాజరు
- ప్రారంభోత్సవాలు , శంఖు స్థాపనలు

**ఆదిలాబాద్ మహా :** తెలంగాణ రాష్ట్ర ఎక్సైజ్ అండ్ ప్రోహిబిషన్, పర్యాటక శాఖా, ఉమ్మడి జిల్లా ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు జూన్ 13న నిర్మల్ ఆదిలాబాద్ జిల్లాలో పర్యటించనున్నారు.శనివారం ఉదయం 10 గంటలకు రోడ్డు మార్గం ద్వారా నిర్మల్ పట్టణానికి చేరుకుంటారు. అక్కడ ఎల్వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ ను ప్రారంభిస్తారు. అనంతరం మాజీ పీసీసీ అధ్యక్షులు పి. నర్సారెడ్డి విగ్రహానికి పూల మాల వేసి నివాళ్లు అర్పిస్తారు . అక్కడి నుండి ఆదిలాబాద్ జిల్లాకు బయలుదేరి మధ్యాహ్నం 1230 గంటలకు సిరికొండ మండలం రిమ్మ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లు ప్రారంభిస్తారు. అనంతరం ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి చేరుకుని భోజన విరామం తీసుకుంటారు.మధ్యాహ్నం 220 నుండి 250 వరకు మావల మండల కేంద్రంలో కోటి 43 లక్షలతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని , 47 లక్షలతో నిర్మించిన సెంట్రల్ లైబ్రరీ మొదటి అంతస్తు ను ప్రారంభిస్తారు. 39 లక్షలతో నిర్మించ బోయే బజార్ హత్నూర్ మండల గ్రంథాలయ భవన నిర్మాణ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తారు. అనంతరం మధ్యాహ్నం 3గంటల నుండి సాయంత్రం 5గంటల వరకు స్థానిక గాయత్రి గార్డెన్ లో జరిగే పలు పంపిణీ , అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలకు హాజరవుతారు. అటు తర్వాత సాయంత్రం 5 గంటలకు తిరిగి హైదరాబాద్ పయనమవుతారు.

# అర్ధరాత్రి అక్రమ మట్టి తోలకం

**తృతిలో తప్పిన పెను ప్రమాదం**
**చోద్యం చూస్తున్న ప్రభుత్వ యంత్రాంగం**



**జూలూరుపాడు, మహా:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, జూలూరుపాడు మండలంలో అర్ధ రాత్రి అక్రమ మట్టి తోలకాలకు అడ్డు అదుపు లేకుండా పోయింది. అక్రమంగా మట్టిని తరలిస్తున్న ఓ ట్రాక్టర్ అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టడంతో డ్రైవర్ కి తీవ్ర గాయాలైన ఘటన గురువారం తెల్లవారుజామున జరిగింది. అదృష్టవశాత్తూ సరైన సమయానికి విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రాణనష్టం తప్పింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని అనంతారం గ్రామ సమీపంలో గురువారం తెల్లవారుజామున ఎలాంటి అనుమతులు లేకుండా కొందరు నల్లబండ బోడు సమీపంలోని సీతారామ ప్రాజెక్టు మట్టిని ట్రాక్టర్ల ద్వారా అక్రమంగా తరలిస్తున్నారు. ఈ క్రమంలో మట్టి లోడుతో వేగంగా వెళ్తున్న ఓ ట్రాక్టర్ అదుపుతప్పి అనంతారం గ్రామ సమీపంలోని విద్యుత్ స్తంభాన్ని బలంగా ఢీ కొట్టింది. ఈ ధాటికి రెండు విద్యుత్ స్తంభాలు విరిగి ట్రాక్టర్ పై పడ్డాయి. అదే సమయంలో విద్యుత్ తీగలు డ్రైవర్ పై పడడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో డ్రైవర్ విద్యుదాఘాతానికి గురై తీవ్రంగా గాయపడ్డాడు. మంటలు వ్యాపిస్తున్న క్రమంలోనే ట్రాన్స్ ఫార్మర్ ఫ్యూజులు కాలి పోయి, విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో పెను ప్రమాదం తప్పింది. తీవ్ర గాయాల పాలైన డ్రైవర్ ని కొత్తగూడెం ఆస్పత్రికి తరలించి అక్కడనుండి మెరుగైన వైద్యం కోసం ఖమ్మం ఆస్పత్రికి తరలించారు.

**చోద్యం చూస్తున్న ప్రభుత్వ యంత్రాంగం**

గత ఏడాది కాలంగా జూలూరుపాడు మండల పరిధిలోని నల్లబండ బోడు నుంచి చీమలపాడు గుట్టల వరకు సుమారు 10 కిలోమీటర్ల మేర సీతారామ ప్రాజెక్టుకు ఇరువైపులా ఉన్న మట్టిని ఇష్టారాజ్యంగా అక్రమార్కులు తవ్వేస్తున్నారు. ప్రధానంగా రాత్రి వేళల్లో, సెలవు దినాల్లో జేసీబీల సాయంతో పదుల సంఖ్యలో ట్రాక్టర్లలో మట్టిని అక్రమంగా తరలించి అధిక ధరలకు విక్రయించి ధనార్జనే ధ్యేయంగా దండుకుంటున్నారు. ఈ దందా నిరాటంకంగా సాగుతున్నప్పటికీ.. అటు ప్రభుత్వ యంత్రాంగం, అటు సీతారామ ప్రాజెక్టు అధికారులు కనీసం పట్టించుకున్న పాపాన పోలేదన్న విమర్శలు ప్రజల్లో తీవ్రంగా వ్యక్తమవుతున్నాయి. అధికారుల నిర్లక్ష్యం వల్లే మట్టి మాఫియా రెచ్చిపోతోందని స్థానికులు మండిపడుతున్నారు. నిత్యం ఇలాంటి ప్రమాదాలు పునరావృతం అవుతున్నా పట్టింపు లేకపోవడం పట్ల మండల ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. భారీగా ప్రాణనష్టం సంభవిస్తే కానీ అధికారులు స్పందించరా అంటూ స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అక్రమ మట్టి తవ్వకాలను అడ్డుకోవాలని పబ్లిక్ డిమాండ్ చేస్తున్నారు.

# పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలి



**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:**

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని జిల్లా అటవీ శాఖ అధికారి కిష్టా గౌడ్ అన్నారు. గురువారం అటవీ శాఖ సహకారంతో ఐటీసీ నిర్వహించిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అటవీ వైవిధ్యీకరణ పర్యావరణ పరిరక్షణ జీవ వైవిధ్య సంరక్షణ యొక్క ప్రాముఖ్యతను వివరించారు. భవిష్యత్ తరాల కోసం సహజ వనరులను కాపాడటం పచ్చదనాన్ని పెంపొందించడం వన్యప్రాణుల ఆవాసాలను రక్షించడం కోసం సమిష్టి కృషి అవసరమని ఆయన పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలలో ప్రజల భాగస్వామ్యాన్ని మరింత పెంచాలని ఆయన సూచించారు.

అటవీ విభాగ అధికారి ఆర్.బాబు మాట్లాడుతూ సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనలో భాగస్వామ్య సంస్థల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణ గ్రామీణాభివృద్ధి రంగాల్లో ఐటీసీ దాని భాగస్వామ్య సంస్థలు చేస్తున్న కృషిని ఆయన అభినందించారు. అటవీ సంరక్షణ నీటి వనరుల పరిరక్షణ సహజ వనరుల ఆధారిత జీవనోపాధులపై గ్రామీణ ప్రజల్లో అవగాహన పెంపొందించడం అవసరమని ఆయన తెలిపారు. కార్యక్రమానికి హాజరైన ప్రముఖులు సుస్థిర అభివృద్ధి పర్యావరణ పరిరక్షణ పట్ల ఐటీసీ చూపుతున్న నిబద్ధతను ప్రశంసించారు. జీవ వైవిధ్య పరిరక్షణ మెరుగైన జీవనోపాధులు గ్రామీణాభివృద్ధి సాధనలో ఐటీసీ, అటవీ శాఖ స్థానిక సమాజాల మధ్య సమన్వయంతో కూడిన కృషి కొనసాగాలని వారు సూచించారు. ఐటీసీ ప్రముఖులు మాట్లాడుతూ సుస్థిర అభివృద్ధి సహజ వనరుల నిర్వహణ జీవ వైవిధ్య పరిరక్షణ భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికలపై చర్చించేందుకు ఐటీసీ మిషన్ సునెహ్రా కల్ (ఎం ఎస్ కే)అటవీ శాఖ సహకారంతో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని నిర్వహించిందని పేర్కొన్నారు. అనంతరం

ఐటీసీ మిషన్ సునెహ్రా కల్ ఆధ్వర్యంలో అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలను ఐటీసీ ప్రతినిధులు ప్రదర్శించారు. సామాజిక అటవీకరణ, సుస్థిర వ్యవసాయ పద్ధతులు అటవీ సామూహిక భూముల జీవ వైవిధ్య పరిరక్షణ రైతుల జీవనోపాధి అభివృద్ధి ప్రాథమిక విద్య మహిళా సాధికారత ఆరోగ్యం పారిశుధ్యం ఘన వ్యర్థాల నిర్వహణ గ్రామీణ యువతకు వృత్తి నైపుణ్య శిక్షణ వంటి అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఐటీసీ యూనిట్ హెడ్ అండ్ వైస్ ప్రెసిడెంట్ శైలేందర్ సింగ్, ఐటీసీ జీఎం హెచ్ఆర్ శ్యామ్ కిరణ్, డీజీఎం చెంగల్ రావు, మిషన్ సునెహ్రాకల్ ప్రతినిధులు గీత ప్రవల్లిక, కుంటల్ సర్కార్, ఎన్జీఓ భాగస్వాములు అటవీ రేంజ్ అధికారులు పాల్గొన్నారు.

# విద్యను వ్యాపారంగా కాకుండా సామాజిగా హక్కుగా చూడాలి

- గుర్తింపు లేకుండా నడుస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి
- ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో అమ్ముతున్న పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్ సీజ్ చేయాలి
- ఎస్ఎఫ్ఐ మొయినాబాద్ మండల కార్యదర్శి చరణ్ గౌడ్



**మొయినాబాద్ మహా:** మొయినాబాద్ మండలంలోని గుర్తింపు లేకుండా నడుస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై తక్షణ చర్యలు తీసుకోవాలని, అలాగే ప్రైవేట్ మరియు కార్పొరేట్ విద్యాసంస్థలలో పాఠ్యపుస్తకాలు, యూనిఫార్మ్‌ల విక్రయాలను నిలిపివేయాలని ఎస్ఎఫ్ఐ మొయినాబాద్ మండల కార్యదర్శి చరణ్ గౌడ్ డిమాండ్ చేశారు.ఈ మేరకు మండల విద్యాశాఖ అధికారి మల్లయ్య ను ఎస్ఎఫ్ఐ నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. విద్యా హక్కు చట్టం (ఆర్టిఈ 2009) నిబంధనలను అన్ని పాఠశాలలు కచ్చితంగా అమలు చేయాలని కోరారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా గుర్తింపు లేకుండా పాఠశాలలు నిర్వహించడం విద్యార్థుల భవిష్యత్తుకు ప్రమాదకరమని తెలిపారు.అదేవిధంగా అనేక ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు విద్యార్థులపై అధిక ఆర్థిక భారం మోపుతూ పాఠశాలలలోనే పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్, యూనిఫార్మ్‌లు కొనుగోలు చేయాలని ఒత్తిడి చేస్తున్నాయని వ్యక్తం చేశారు. విద్యార్థులు, తల్లిదండ్రులకు మార్కెట్‌లో ఎక్కడైనా కొనుగోలు చేసుకునే స్వేచ్ఛ ఉండాలని, పాఠశాలల ద్వారా బలవంతపు విక్రయాలు చేయడం అనైతికమని పేర్కొన్నారు. ఈ విధానాన్ని వెంటనే నిలిపివేసి విద్యార్థులు, తల్లిదండ్రులపై పడుతున్న ఆర్థిక భారాన్ని తగ్గించాలని డిమాండ్ చేశారు.విద్యను వ్యాపారంగా కాకుండా సామాజిక హక్కుగా చూడాలని, విద్యార్థుల ప్రయోజనాల కోసం విద్యాశాఖ అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ మొయినాబాద్ మండల కమిటీ కోరింది.ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మొయినాబాద్ మండల కార్యదర్శి చరణ్ గౌడ్, మండల నాయకులు వికాస్, నవీన్, అభి తదితరులు పాల్గొన్నారు.



# డబల్ బెడ్ రూం ఇండ్ల సందర్శన

**ఆదిలాబాద్ మహా :** డబుల్ బెడ్ రూం ఇళ్ల పెండింగ్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు.గురువారం మావల మండల కేంద్రంలోని కేఆర్కే కాలనీలో లబ్ధిదారుల కేటాయింపుకు సిద్ధంగా ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను జిల్లా అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇళ్లకు సంబంధించిన విద్యుత్, త్రాగునీరు, శానిటేషన్, ఇతర పెండింగ్ పనులన్నింటినీ వెంటనే త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.అనంతరం కలెక్టర్ స్థానిక గాంధీ పార్క్‌ను సందర్శించి, పలు అభివృద్ధి పనులను పర్యవేక్షించారు. పార్క్‌లో నిర్మిస్తున్న 7 ఫామ్ పాండ్స్, 5 బోర్ వేల్ రీచార్జ్ స్ట్రక్చర్స్ నిర్మాణ పనులను పరిశీలించారు. వీటితో పాటు పిల్లలను ఆకట్టుకునే చిల్డ్రన్ ట్రైన్, పార్క్‌లోని ఇతర మరమ్మతు పనులను అత్యంత వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.ఈ క్షేత్రస్థాయి పరిశీలన లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, డీఆర్డీఓ రవీందర్ రాథోడ్, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, మెప్మా పీడీ రాజు, హౌసింగ్ పీడీ శంకర్, తహసీల్దార్ శ్రీనివాస్‌లతో పాటు ఇంజనీరింగ్, రెవెన్యూ, విద్యుత్ తదితర శాఖల. అధికారులు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

# ఫోటో క్యాప్చరింగ్ చేయించుకోవాలి మున్సిపల్ చైర్ పర్సన్

**ఆదిలాబాద్ మహా :** వృద్ధాప్య ,వికలాంగుల ,వితంతు ,ఒంటరి మహిళ పెన్షన్లలో ఫోటో క్యాప్చరింగ్ తప్పనిసరిగా చేయించుకోవాలని మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష అన్నారు. ప్రతి ఒక్క పెన్షన్ దారుడు వార్డ్ ఆఫీసర్ ,స్పెషల్ ఆఫీసర్ , ఆర్పీలు , మున్సిపల్ కార్యాలయంలేదా డిఆర్డిఏ కార్యాలయంలో కానీ లైవ్ ఫోటో క్యాప్చరింగ్ ని తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. అదిలాబాద్ పట్టణంలో 13476 పెన్షన్లు ఉండగా అందులో ఫోటో క్యాప్చరింగ్ అయినవి 9451 మాత్రమేనని ఇంకా సుమారు 4025 పెన్షన్ దారులు ఇప్పటివరకు ఫోటో క్యాప్చరింగ్ చేయించుకోలేదన్నారు. దీంతో పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో ఇబ్బంది ఏర్పడుతుందన్నారు. కావున ఈనెల 15వ తేదీ లోపల ఫోటో క్యాప్చరింగ్ చేయించుకోవాలని కోరారు.. అదేవిధంగా ప్రభుత్వం నిర్వహిస్తున్న SIR ఓటర్ మ్యాపింగ్ కార్యక్రమంలో ప్రజలందరూ తప్పనిసరిగా పాల్గొనాలని సూచించారు.



# టీపీసీసీ ఆధ్వర్యంలో బీఎల్ఎలకు ప్రత్యేక శిక్షణ

**పాల్గొన్న బీర్ల అయిలయ్య,చామల కిరణ్ కుమార్,సచిన్ సావంత్**

**యాదాద్రి భువనగిరి జూన్ 11 మహా :** యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట పట్టణంలో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) ఆధ్వర్యంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంపై బూత్ లెవల్ ఏజెంట్లు కోసం ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఓటర్ల జాబితాలో అర్హులైన ప్రతి ఒక్కరి పేర్లు నమోదు కావడం, అనర్హుల పేర్ల తొలగింపు, వివరాల సవరణ వంటి అంశాలపై బి ఎల్ ఎ లకు సమగ్ర అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య, భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఏఐసీసీ కా ఓటర్ల జాబితా ప్రజాస్వామ్యానికి మూలస్తంభమని పేర్కొన్నారు. ప్రతి అర్హుడైన ఓటరు పేరు జాబితాలో ఉండేలా బిఎల్ఎ లు క్షేత్రస్థాయిలో చురుకుగా పని చేయాలని సూచించారు. ఇంటింటికీ వెళ్లి కొత్త ఓటర్ల నమోదు, చిరునామా మార్పులు, పేరు లేదా ఇతర వివరాల్లో ఉన్న తప్పులను సరిచేయించే ప్రక్రియలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. అలాగే, ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలను కచ్చితంగా పాటిస్తూ ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను విజయవంతం చేయాలని తెలిపారు. పార్టీ శ్రేణులు, బిఎల్ఎలు సమన్వయంతో పనిచేసి ప్రజలకు అవగాహన కల్పించాలని, ఓటు హక్కు వినియోగంపై ప్రతి కుటుంబానికి సమాచారం చేరవేయాలని సూచించారు.కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన



# టెన్త్ లో ప్రతిభ చూపిన విద్యార్థులకు పురస్కారం

**కారేపల్లి, మహా :**కారేపల్లి మండలం మాణిక్యారం జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన (2025 26) పదవ తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచి, ఫస్ట్ క్లాస్ మార్కులు సాధించిన విద్యార్థులు భూక్యా మధుమతి, ఆంగోత్ శృతిక, సెకండ్ క్లాస్ మార్కులు సాధించిన డి. శంకర్ లను గురువారం ఖమ్మంలోని టీఎన్జీవో ఫంక్షన్ హాల్ లో అఖిలభారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి వారి ఆధ్వర్యంలో అధ్యక్షుడు తాండ్ర రాంప్రసాద్ రావు విద్యార్థులకు శాలువాలు కప్పి షీల్డు అందించి సన్మానించారు. అదేవిధంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు కిషన్ నాయక్, విద్యార్థుల తల్లిదండ్రులు భూక్యా రాంబాబు, ఆంగోత్ శోభన్ ,డి. కనకమ్మలను సైతం సన్మానించారు. ఈ సందర్భంగా తాండ్ర రాంప్రసాద్ రావు మాట్లాడుతూ పదవ తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఉత్తమ ప్రతిభా పురస్కారాలను అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సమితి ప్రధాన కార్యదర్శి అల్లిక రామకృష్ణ, సంస్థ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.




# మైనర్ బాలికపై అత్యాచారం చేసిన దోషులను శిక్షించాలి

**బీజేపీ గిరిజన మోర్చ డిమాండ్.**

**దమ్మపేట ,మహా :** ఖమ్మం పట్టణ పరిసర ప్రాంతంలోని ఓ మైనర్ బాలికపై అత్యాచారానికి పాల్పడిన దోషులను కఠినంగా శిక్షించాలని బిజెపి గిరిజన మోర్చ ఆద్వర్యంలో గురువారం స్థానిక పట్టణ కేంద్రంలో నిరసన ర్యాలీ చేపట్టారు.ఈ సందర్భంగా గిరిజన మోర్చ రాష్ట్ర అధ్యక్షులు తంబలరవి మాట్లాడుతూ అమాయకులైన బాలికలపై సభ్యసమాజం తల దించుకునేలా అఘాయిత్యానికి పాల్పడిన గౌస్ అనే నిందితునికి కఠినమైన శిక్ష విధించి కుటుంబానికి తగిన న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. పట్టణంలో నినాదాలు చేస్తూ ర్యాలీ ద్వారా నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు గూడా ముత్యాలరావు ,దారా నాగేశ్వరరావు , టి.స




# ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన జిల్లా వైద్య ఆరోగ్య అధికారి స్వర్ణ కుమారి

**రాజేంద్రనగర్ మహా ;** మైలార్ దేవ్ పల్లి డివిజన్ పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని రంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ స్వర్ణ కుమారి గురువారం ఆకస్మికంగా సందర్శించారు. ఆరోగ్య కేంద్రంలో అమలవుతున్న ఆరోగ్య కార్యక్రమాలు వాటి వివరాలతో పాటు ప్రజలకు అందుతున్న ఆరోగ్య సేవలను అడిగి తెలుసుకున్నారు. ఓ పి సేవలు గర్భిణీ స్త్రీలు, శిశు సంక్షేమ కార్యక్రమాల వివరాలు తెలుసుకున్నారు.సంపూర్ణ టీకా కరణ, కుటుంబ నియంత్రణ, వ్యాధుల నియంతలపై చర్యలు, ఎన్ సిడి స్కానింగ్ లు, ఔషధాల నిలువలు వాటి రికార్డులను సమీక్షించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగికి సకాలంలో నాణ్యమైన వైద్య సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. ఆరోగ్య కేంద్రంలో పరిశుభ్రతను కచ్చితంగా పాటిస్తూ వచ్చే రోగులకు మెరుగైన సేవలు అందించాలన్నారు. ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేసి నిర్దేశించి లక్ష్యాలను సాధించాలన్నా

# ఆశాల సేవలతో తల్లిశిశు ఆరోగ్యం మెరుగుదల

- **ఆశా డే కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ తుకారాం రాథోడ్**



**మణుగూరు, మహా :** తల్లి, శిశు ఆరోగ్య పరిరక్షణలో ఆశా కార్యకర్తల పాత్ర అత్యంత కీలకమని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి (డీఎంహెచ్‌వో) డాక్టర్ తుకారాం రాథోడ్ పేర్కొన్నారు. గురువారం మణుగూరు, జగన్నాధపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో నిర్వహించిన ఆశా డే కార్యక్రమంలో ఆయన పాల్గొని ఆశా కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. ప్రజల్లో కుటుంబ నియంత్రణ పద్ధతులపై విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. అంతర ఇంజెక్షన్, ఛాయ మాత్రలు, మాలాఎన్, మాలాడి, నిరోధ్ వంటి తాత్కాలిక కుటుంబ నియంత్రణ సేవలను అర్హులైన దంపతులకు అందించాలని తెలిపారు. పిల్లల మధ్య తగిన విరామం ఉండేలా దంపతులను ప్రోత్సహించాలని సూచించారు. అధిక ప్రమాద లక్షణాలు ఉన్న గర్భిణులను ముందుగానే గుర్తించి నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని, నాణ్యమైన వైద్య సేవలు అందించాలని కోరారు. మాతృ మరణాలు, శిశు మరణాల రేటును తగ్గించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని తెలిపారు. సాధారణ ప్రసవాలను ప్రోత్సహించి అవసరం లేని సిజేరియన్ శస్త్రచికిత్సలను తగ్గించే దిశగా కృషి చేయాలని సూచించారు. ప్రజలు సమతుల్య ఆహారం తీసుకోవాలని, ఈట్ రైట్ -స్టే హెల్తీ సందేశాన్ని ప్రతి ఇంటికి చేర్చాలని చెప్పారు. వేసవిలో వడదెబ్బ బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, తగినంత నీరు తాగాలని, మధ్యాహ్న వేళల్లో అవసరం లేనప్పుడు బయట తిరగవద్దని సూచించారు. ప్రతిరోజూ నడక, యోగా, వ్యాయామం చేయడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని పేర్కొన్నారు. ప్రతి ఆరోగ్య కేంద్రంలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఆరోగ్య, వెల్‌నెస్ కార్యక్రమాలు నిర్వహించి ప్రజలకు ఆరోగ్య అవగాహన కల్పించాలని ఆదేశించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి పరిశుభ్రత పాటించాలని, వర్షాకాలంలో విరేచనాల వ్యాధుల నివారణకు ప్రభుత్వం చేపట్టిన 'స్టాప్ డయేరియా క్యాంపెయిన్'ను విజయవంతం చేయాలని సూచించారు. జూన్ 28న పల్స్ పోలియో విజయవంతం చేయాలి.. జిల్లాలో జూన్ 28న నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, 0 నుంచి 5 సంవత్సరాల లోపు పిల్లలను పూర్తిగా గుర్తించి ప్రతి ఒక్కరికి పోలియో చుక్కలు వేయించేలా చర్యలు తీసుకోవాలని డి ఎం హెచ్ ఓ డాక్టర్ తుకారం రాథోడ్ తెలిపారు. బాలికల్లో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నివారణకు హెచ్‌పీవీ వ్యాక్సిన్ ప్రాముఖ్యతపై అవగాహన కల్పించాలని సూచించారు. వర్షాకాలంలో మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా, వైరల్ జ్వరాలు, శ్వాసకోశ వ్యాధులు, విరేచనాల వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని అయిన హెచ్చరించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం, నీరు నిల్వ ఉండకుండా చూడడం, దోమల నివారణ చర్యలు చేపట్టడం, తాగునీటిని శుద్ధి చేసి వినియోగించడం ద్వారా సీజనల్ వ్యాధులను నివారించవచ్చని తెలిపారు. ఆరోగ్య సమస్యలు తలెత్తిన వెంటనే సమీప ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు డాక్టర్ ప్రతాప్, డాక్టర్ హరీష్, హెల్త్ సూపర్వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఎస్.ఐ.ఆర్. ముసుగులో ఓటర్ల తొలగింపును తిప్పికొట్టాలి

- **తెలంగాణ రాష్ట్ర మంత్రి వివేకానంద, పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ**




మందమర్రి /మంచిర్యాల, మహా : ఎస్.ఐ.ఆర్. ముసుగులో ఓటర్ల తొలగింపును తిప్పికొట్టాలని తెలంగాణ రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వివేకానంద, పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ, జహీరాబాద్ ఎంపీ సురేష్ షట్కర్ లు పిలుపునిచ్చారు. గురువారం మంచిర్యాల జిల్లా మందమర్రి మండలం గద్దెరాగడి ఎమ్మెన్నార్ గార్డెన్స్‌లో ఓటర్ల ప్రత్యేక సవరణ జాబితా (ఎస్.ఐ.ఆర్) పై బూత్ లెవల్ ఏజెంట్ల (బి.ఎల్.ఎ) అవగాహన శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి వారు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎస్ ఐ ఆర్ ముసుగు వేసుకొని బీజేపీ ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా ఉన్న ఓటర్లను తొలగించేందుకు కుట్రలు చేస్తోందని ఆరోపించారు. దేశంలో ఓటు చోరీ అంశంపై ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ పార్లమెంట్‌లో గళం విప్పారని వెల్లడించారు.

బూత్ లెవల్ ఏజెంట్లు ఇంటింటికి వెళ్లి ఓటర్ల జాబితాలను పకడ్బందీగా పరిశీలించాలని కోరారు. చనిపోయిన ఓటర్ల వివరాలను గుర్తించి సంబంధిత అధికారులకు తెలియజేయాలని సూచించారు. గత పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం మెగా ప్రాజెక్టుల పేరుతో భారీ అప్పులు చేసి, కమిషన్ల రాజకీయాలకు పాల్పడిందని విమర్శించారు. ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా పారదర్శకంగా అమలు చేస్తోందని పేర్కొన్నారు. అర్హత ఉన్న ప్రతి పేద కుటుంబానికి ఇల్లు అందించడమే కాంగ్రెస్ లక్ష్యమని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు విద్యార్థులకు పౌష్టికాహార భోజనం అందిస్తున్నామని, బీ ఎల్ ఏ లు ఇంటింటికి వెళ్లినప్పుడు ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై ప్రజల అభిప్రాయాలను కూడా తెలుసుకోవాలని సూచించారు. చెన్నూరు నియోజకవర్గంలో త్వరలో నర్సింగ్ కళాశాల ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. అంతేకాకుండా కాకా ఫౌండేషన్ ద్వారా 2,500 బోర్‌వెల్లు ఏర్పాటు చేయడంతో పాటు తాను ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత నీటి ఎద్దడి ప్రాంతాల్లో 400 బోర్‌వెల్లు వేయించామని వివరించారు.

రాజ్యాంగబద్ధంగా కాంగ్రెస్ పార్టీ రాజ్యసభ అభ్యర్థిగా మీనాక్షి నటరాజన్‌ను ఎంపిక చేసినప్పటికీ, ఆమె నామినేషన్‌ను తిరస్కరించడం ప్రజాస్వామ్య విలువలను దెబ్బతీసే చర్య అని విమర్శించారు. అలాగే నీట్ పరీక్షల నిర్వహణలో జరిగిన అవకతవకలు, పేపర్ లీకేజీల వల్ల విద్యార్థుల భవిష్యత్తు దెబ్బతింటోందని ఆందోళన వ్యక్తం చేశారు.రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం యువత ఉపాధి కల్పనకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 120 ఏటీసీ సెంటర్ల ద్వారా 25 వేల మంది యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని తెలిపారు. టామ్‌కామ్ ద్వారా మరో 10 వేల మంది యువతకు జర్మనీలో ఉపాధి అవకాశాలు అందుబాటులోకి తీసుకువస్తున్నామని వివరించారు. చెన్నూరు నియోజకవర్గ ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు అందిస్తూ అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్నామని, నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు విశేష కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, బూత్ లెవల్ ఏజెంట్లు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# ఆరోగ్యకేంద్ర భవన నిర్మాణానికి సర్పంచ్ వినతి

**కారేపల్లి , మహా:** సింగరేణిలో హెల్త్ సబ్ సెంటర్ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని సింగరేణి సర్పంచ్ మేదరి వీరప్రతాప్(టోనీ) వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ వినతిపత్రం అందజేశారు. గురువారం ఎమ్మెల్యేను కలిసిన సర్పంచ్ కారేపల్లిలో హెల్త్ సబ్ సెంటర్ ఉన్నా భవనం లేక పోవటంతో వైద్య సేవల కోసం పీహెచ్‌సీపై ఆధారపడవలసి వస్తుందని వినతిలో తెలిపారు. భరత్‌నగర్ కాలనీలో ఉన్న హెల్త్ సెంటర్ భవనం శిధిలావస్థకు చేరుకుందని, దానిని తొలగించి నూతనంగా భవన నిర్మాణం చేయాల్సి ఉంటుందని ఎమ్మెల్యేకు సర్పంచ్ టోనీ విన్నవించారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ హెల్త్ సబ్‌సెంటర్ భవన నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించాలని జిల్లా వైద్యాధికారికి లేఖ రాశారని సర్పంచ్ తెలిపారు. స్పందించిన ఎమ్మెల్యేకు సర్పంచ్ కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో కాంగ్రెస్ నాయకులు ఎండీ.యాకూబ్ అలీ, ఆదెర్ల రాములు ఉన్నారు.

# మణుగూరు సివిల్ సప్లై డీటీగా రాజేశ్వరరావు

**అశ్వాపురం నుంచి బదిలీపై బాధ్యతల స్వీకరణ**




**మణుగూరు, మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలంలో డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న మహిపతి రాజేశ్వరరావు మణుగూరు సివిల్ సప్లైస్ డిప్యూటీ తహసీల్దార్‌గా బదిలీ అయ్యారు. ఇటీవల వెలువడిన బదిలీ ఉత్తర్వుల మేరకు ఆయన మణుగూరులో బాధ్యతలు చేపట్టనున్నారు. రాజేశ్వరరావు అశ్వాపురం తహసీల్దార్ కార్యాలయంలో మూడేళ్లపాటు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా (ఆర్ఐ) సేవలందించి, అనంతరం డిప్యూటీ తహసీల్దార్‌గా పదోన్నతి పొంది నాలుగు నెలల పాటు విధులు నిర్వర్తించారు. తన సేవా కాలంలో ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలను వేగంగా పరిష్కరించడంలో ప్రత్యేక గుర్తింపు పొందారు. ప్రజా సమస్యల పరిష్కారంలో చొరవ చూపుతూ, ప్రజలతో స్నేహపూర్వకంగా మెలిగిన అధికారిగా మండల ప్రజల మన్ననలు అందుకున్నారు. సహచర ఉద్యోగులతో సత్సంబంధాలు కొనసాగిస్తూ విధి నిర్వహణలో నిబద్ధత, నిజాయితీ, సమర్థత కనబర్చిన అధికారిగా గుర్తింపు పొందారని పలువురు పేర్కొంటున్నారు. మణుగూరులో సివిల్ సప్లైస్ విభాగంలో కూడా అదే స్థాయిలో సమర్థవంతంగా సేవలందించి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ప్రజలు ఆకాంక్షించారు



# యువత మంచిర్యాల జిల్లాలో ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాలి

- **లైబ్రరీలో విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి**
- **పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ హామీ**

**మంచిర్యాల, మహా :** లైబ్రరీలో చదువుకున్న యువత మంచిర్యాల జిల్లాలో ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాలని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ కోరారు. గురువారం జిల్లా లైబ్రరీని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను గతంలో లైబ్రరీని సందర్శించినప్పుడు విద్యార్థులకు వాష్ రూములు, తాగునీటి వసతి లేదని దృష్టికి తీసుకువచ్చారని అన్నారు. తక్షణమే వారి అవసరాలను తీర్చమని చెప్పారు. రాబోయే ఉద్యోగ నోటిఫికేషన్లను దృష్టిలో ఉంచుకొని విద్యార్థులు కష్టపడి చదివి తమ లక్ష్యాలను సాధించాలని సూచించారు. అలాగే మంచిర్యాల జిల్లా నుండి అధిక సంఖ్యలో యువత ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు, అదేవిధంగా పోలీస్ ఉద్యోగ నోటిఫికేషన్ లో పోస్టులను పెంచేందుకు సీఎం రేవంత్ రెడ్డి తో మాట్లాడి కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు.విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం అవసరమైన అన్ని మౌలిక సదుపాయాల కల్పనకు తాను ఎల్లప్పుడూ కృషి చేస్తానని ఎంపీ భరోలసా పలికారు.



# అంగన్వాడీలు మెనూ ప్రకారం పౌష్టిక ఆహారం ఇవ్వాలి

**మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**మంచిర్యాల, మహా :**అంగన్వాడీలు మెనూ ప్రకారం పౌష్టిక ఆహారం ఇవ్వాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయాల భవన సమావేశ మందిరంలో ఆహార భద్రత శాఖ ఆధ్వర్యంలో అంగన్వాడీ టీచర్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి ఆహార భద్రత శాఖ అధికారి వాసురాం, ఇతర అధికారులతో కలిసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆహార భద్రత ప్రమాణాలను అందరూ పాటించాలని సూచించారు. ప్రభుత్వ విద్యాసంస్థలలో విద్యార్థులకు అందించే ఆహార నాణ్యతను ఆహార భద్రతా శాఖ అధికారులు ఎప్పటికప్పుడు పరీక్షించాలని ఆదేశించారు. ఆహార సంబంధిత వివిధ వ్యాపార సంస్థలలో కాల పరిమితి ముగిసిన ఆహార పదార్థాలు లభించినట్లయితే పూర్తి వివరాలతో నివేదిక అందించాలని చెప్పారు. చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.అంగన్వాడీ టీచర్లు తమ కేంద్రంలో పిల్లలకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం పౌష్టిక ఆహారం అందించాలని అన్నారు. అంతే కాకుండా పిల్లల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని తెలిపారు. అనంతరం అంగన్వాడీ టీచర్లకు ఎఫ్ ఎస్ ఎస్ ఎ ఐ నమోదు ధ్రువపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, అంగన్వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు సురక్షితమైన నీటిని అందించడమే ప్రభుత్వ లక్ష్యం

**బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్**

**బెల్లంపల్లి ,మహా :** ప్రజలకు సురక్షితమైన తాగునీటిని అందించడమే ప్రభుత్వ లక్ష్యమని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ పేర్కొన్నారు.బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధిలో అమృత్ 2.0 పథకం కింద చేపడుతున్న తాగునీటి సరఫరా మరియు మౌలిక వసతుల అభివృద్ధి పనులను గురువారం రోజు ఆయనమంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) చంద్రయ్యతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

ఈ సందర్భంగా పలు ప్రాంతాలలో జరుగుతున్న పైప్‌లైన్ నిర్మాణం, ఓవర్ హెడ్ రిజర్వాయర్, నీటి సరఫరా వ్యవస్థల అభివృద్ధి పనులను సందర్శించి పనుల పురోగతిని సమీక్షించారు.పరిశీలన సందర్భంగా అమృత్ 2.0 పథకం కింద చేపడుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాల వివరాలను సంబంధిత అధికారులు వారికి వివరించారు. పనుల ప్రస్తుత స్థితి, ఇప్పటివరకు సాధించిన పురోగతి, మిగిలి ఉన్న పనులు మరియు వాటి పూర్తి గడువు గురించి సమగ్ర నివేదికను సమర్పించారు. ప్రజలకు నాణ్యమైన తాగునీటి సరఫరా అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ పథకం ఫలితాలు ప్రతి ఇంటికి చేరేలా అధికారులు కృషి చేయాలని సూచించారు.ఎమ్మెల్యే గడ్డం వినోద్ మాట్లాడుతూ అమృత్ 2.0 పథకం ద్వారా పట్టణ ప్రజలకు మెరుగైన తాగునీటి సౌకర్యాలు అందించడమే ప్రధాన లక్ష్యమని తెలిపారు. పనుల నాణ్యత విషయంలో ఎటువంటి రాజీ పడకుండా నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగా పనులు చేపట్టాలని, అలాగే నిర్ణీత గడువులోపు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. అదనపు కలెక్టర్ చంద్రయ్య కూడా పనుల అమలులో పారదర్శకత, నాణ్యత మరియు వేగం ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధిలో



అమృత్ 2.0 పనులు నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా కొనసాగుతున్నాయని అధికారులు తెలిపారు. ఈ పథకం పూర్తయిన అనంతరం పట్టణ ప్రజలకు మెరుగైన తాగునీటి సరఫరా వ్యవస్థ అందుబాటులోకి వచ్చి వారి జీవన ప్రమాణాలు మరింత మెరుగుపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. తనిఖీ కార్యక్రమంలో

# ఆంత్రోపిక్‌తో చేతులు కలిపిన టీసీఎస్

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రేసులో టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) సంచలన అడుగు వేసింది. ప్రపంచ ప్రసిద్ధ ఏఐ స్టార్టప్ ఆంత్రోపిక్ భాగస్వామ్యంతో ఎంటర్‌ప్రైజ్ ఏఐ స్కేలింగ్‌ను వేగవంతం చేసేందుకు వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని ప్రకటించింది. ఐటీ రంగంలో సాంప్రదాయ శ్రమఆధారిత నమూనాపై జనరేటివ్ ఏఐ ఎలాంటి ప్రభావం చూపుతుందనే ఆందోళనల నడుమ టీసీఎస్ తీసుకున్న ఈ నిర్ణయం పరిశ్రమలో హాట్ టాపిక్‌గా మారింది.




**50,000 మంది ఉద్యోగులకు 'క్లాడ్ ఏఐ' శిక్షణ**

ఈ వ్యూహాత్మక కూటమిలో భాగంగా ఆంత్రోపిక్ సంస్థకు చెందిన అత్యాధునిక ఏఐ మోడల్ 'క్లాడ్' వినియోగంలో దాదాపు 50,000 మంది టీసీఎస్ అసోసియేట్లకు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు. బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్, హెల్త్‌కేర్ వంటి కఠినమైన నిబంధనలు ఉండే రంగాల కోసం ఇరు సంస్థలు సంయుక్తంగా సరికొత్త ఏఐ పరిష్కారాలను మార్కెట్లోకి తీసుకురానున్నాయి. క్లాడ్ ఏఐకి ఉన్న డేటా సెక్యూరిటీ, అక్యూరసీ ఫీచర్లు కార్పొరేట్ క్లయింట్లకు మెరుగైన సర్వీసులు అందించేందుకు దోహదపడతాయని కంపెనీ అధికారులు భావిస్తున్నారు.

**పెట్టుబడిదారుల ఆందోళనలు**

భారతదేశానికి చెందిన సుమారు 315 బిలియన్ డాలర్ల ఐటీ రంగం ప్రస్తుతం ఒక కీలక సంధిగ్ధ దశను ఎదుర్కొంటోంది. సాంప్రదాయ కోడింగ్, టెస్టింగ్, సపోర్ట్ వంటి శ్రమఆధారిత పనులను ఏఐ సాధనాలు భర్తీ చేస్తే ఐటీ కంపెనీల ఆదాయ నమూనా దెబ్బతింటుందనే భయాలు పెట్టుబడిదారులలో నెలకొన్నాయి.

**శ్రామిక శక్తిలో మార్పులు**

టాటా గ్రూప్ చైర్మన్ ఎన్.చంద్రశేఖరన్ మంగళవారం జరిగిన కంపెనీ వార్షిక సర్వసభ్య సమావేశంలో (ఏజీఎం) భవిష్యత్తు వ్యూహాలపై కీలక వ్యాఖ్యలు చేశారు. భవిష్యత్తులో కంపెనీ శ్రామిక శక్తిలో మానవ ఉద్యోగులు ఎంతమంది ఉంటారో, అంతే సంఖ్యలో ఏఐ ఏజెంట్లు కూడా ఉండేలా టీసీఎస్ అడుగులు వేస్తోంది.

# భారత్‌లో తలుపులు మూసిన ఓపెన్‌డోర్

సాంకేతిక రంగంలో వస్తున్న వేగవంతమైన మార్పులు, ఏఐ విస్తరణ, భారతీయ ఐటీ, సర్వీస్ రంగ ఉద్యోగులపై భారీ ప్రభావమే చూపుతున్నాయి. తాజాగా, అమెరికాకు చెందిన ప్రముఖ రియల్ ఎస్టేట్ టెక్నాలజీ దిగ్గజం 'ఓపెన్‌డోర్' భారతదేశంలో తన వ్యాపార కార్యకలాపాలను పూర్తిగా మూసివేస్తున్నట్లు ప్రకటించింది. ఈ నిర్ణయంతో కంపెనీలో పనిచేస్తున్న దాదాపు 250 మంది భారతీయ ఉద్యోగులు ఒకేసారి రోడ్డున పడినట్లయింది. కంపెనీ వ్యూహాత్మక మార్పులపై ఓపెన్‌డోర్ సీఈఓ కాజ్ నెజాటియన్ ఉద్యోగులకు పంపిన అంతర్గత నోట్‌లో కొన్ని అంశాలు అధికారికంగా ధ్రువీకరించారు. ఆ నోట్ ప్రస్తుతం సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్‌లో చర్చనీయాంశమైంది. 'మా కస్టమర్లు అందరూ అమెరికాలోనే ఉన్నారు. కాబట్టి వారికి సేవలందించే ఆపరేషనల్ విభాగాలు కూడా ఆ కస్టమర్లకు వీలైనంత దగ్గరగా ఉండటమే వ్యాపారపరంగా ఉత్తమం' అని చెప్పారు. గతంలో వివిధ వ్యవస్థల్లో మ్యాన్యువల్ వర్క్‌ఫ్లోలను నిర్వహించడానికి భారతదేశంలో ఒక పెద్ద బృందాన్ని ఏర్పాటు చేశామని, అయితే ప్రస్తుత సాంకేతిక పురోగతి వల్ల ఆ అవసరం లేకుండా పోయిందని ఆయన స్పష్టం చేశారు.




**శ్రామిక శక్తిపై ఏఐ దెబ్బ!**

ఈ లేఆఫ్స్‌కు ప్రధాన కారణం కంపెనీ శరవేగంగా అవలంబిస్తున్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాంకేతికతగా తెలుస్తోంది. గతంలో భారత్‌లోని సిబ్బంది మ్యాన్యువల్‌గా చేసే పనులను ఇప్పుడు అమెరికాలో ఏఐ ఎనేబుల్డ్ బృందాల సాయంతో మరింత సులభంగా పూర్తి చేస్తున్నట్లు కంపెనీ వెల్లడించింది. సాంకేతికత పెరగడం వల్ల విదేశాల్లో (భారత్‌లో) ప్రత్యేకంగా ఒక టీమ్‌ను ఉంచాల్సిన అవసరం తగ్గిందని మేనేజ్‌మెంట్ పేర్కొంది.

**ప్రతిభకు లోటు లేదు.. కానీ తప్పట్లేదు!**

ఈ తొలగింపులు భారతీయ బృందం పనితీరు లోపం వల్ల జరిగినవి కావని సీఈఓ నెజాటియన్ నొక్కి చెప్పారు. భారత్‌లోని ఉద్యోగులు ఎంతో ప్రతిభావంతులని, ఇతర సంస్థలకు వారు అద్భుతమైన ఆస్తిగా మారుతారని ప్రశంసించారు. అయితే, వ్యాపార సరళీకరణ, ఏకీకృత ప్లాట్‌ఫారమ్ నిర్మాణం, మ్యాన్యువల్ ప్రక్రియలపై ఆధారపడటాన్ని తగ్గించడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందన్నారు.

# యువ ఆవిష్కర్తలకు బంపర్ ఆఫర్..

డిగ్రీ సర్టిఫికేట్లు, క్లాస్‌రూమ్ పాఠాలు మాత్రమే జీవితాన్ని నిర్దేశించలేవని నమ్మే యువ మేధావులకు కొన్ని సంస్థలు అవకాశం కల్పిస్తున్నాయి. సాంప్రదాయ విశ్వవిద్యాలయాల చట్రం నుంచి బయటకు వచ్చి ప్రపంచాన్ని మార్చే సరికొత్త ఆలోచనలతో దూసుకుపోయే యువ ఆవిష్కర్తల కోసం ప్రతిష్టాత్మక 'థీల్ ఫెలోషిప్ 2026' దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. ఎంపికైన అభ్యర్థులకు ఏకంగా 2,50,000 డాలర్లు (సుమారు రూ.2.10కోట్లు) భారీ గ్రాంట్‌తో పాటు అంతర్జాతీయ మార్గదర్శకత్వాన్ని (మెంటార్‌షిప్) ఈ ప్రోగ్రామ్ అందించనుంది.ప్రముఖ పారిశ్రామికవేత్త, బిలియనీర్, పేపాల్ సహవ్యవస్థాపకుడు పీటర్ థీల్ 2011లో స్థాపించిన ఈ ఫెలోషిప్, గ్లోబల్ స్టార్టప్ రంగాన్ని శాసించే అత్యుత్తమ కార్యక్రమాల్లో ఒకటిగా నిలిచింది.

**అసలు ఏంటి ఈ థీల్ ఫెలోషిప్?**

సాధారణంగా ఉన్నత విద్య కోసం లక్షలాది రూపాయల అప్పులు చేసి డిగ్రీలు పూర్తి చేశాక ఉద్యోగాల కోసం వెతకడం ఒక సంప్రదాయం. కానీ, థీల్ ఫెలోషిప్ దీనికి భిన్నమైన ప్రత్యామ్నాయ మార్గాన్ని ప్రోత్సహిస్తుంది. ఈ ఫెలోషిప్‌కు ఎంపికైన యువకులు తమ రెండేళ్ల కాలపరిమితిలో కాలేజీ చదువులకు స్వస్తి చెప్పాలి. చదువు పక్కన పెట్టి తాము నమ్మిన సరికొత్త వ్యాపార ఆలోచనలను లేదా పరిశోధనలను నిజం చేయడంపైనే పూర్తి దృష్టి సారించాల్సి ఉంటుంది.

**ఫెలోషిప్ ద్వారా లభించే ప్రయోజనాలు**

ఎలాంటి ఈక్విటీ (వాటా) ఆశించకుండా రెండేళ్ల కాలానికి 2,50,000 డాలర్లు సహాయం. సిలికాన్ వ్యాలీలోని అగ్రశ్రేణి పెట్టుబడిదారులు (వెంచర్ క్యాపిటలిస్ట్‌లు), శాస్త్రవేత్తలు, విజయవంతమైన పారిశ్రామికవేత్తలతో నేరుగా పనిచేసే అవకాశం. విద్యా రుణాలు, ఫీజుల ఒత్తిడి లేకుండా స్వతంత్రంగా టెక్నాలజీలు, ఉత్పత్తులను రూపొందించుకునే స్వేచ్ఛ.ఇప్పటికే ఈ ఫెలోషిప్ ద్వారా లబ్ధి పొంది ప్రస్తుతం బిలియన్ డాలర్ల కంపెనీలను నడుపుతున్న పూర్వ విద్యార్థుల గ్లోబల్ కమ్యూనిటీలో సభ్యత్వం.

**ఏయే రంగాల ప్రాజెక్టులకు ప్రాధాన్యత?**


టెక్నాలజీ మారుతున్న వేగానికి అనుగుణంగా భవిష్యత్తును మార్చే సత్తా ఉన్న ఏ రంగంలోని ప్రాజెక్ట్ అయినా ఈ ఫెలోషిప్‌కు అర్హమైనదే. ముఖ్యంగా కింది రంగాలపై ప్రత్యేక దృష్టి సారిస్తారు.

**అర్హతలు**

ఈ ఫెలోషిప్ కోసం ఎటువంటి నిర్దిష్ట విద్యా అర్హతలు లేదా డిగ్రీలు అవసరం లేదు. కేవలం అసాధారణ సృజనాత్మకత, సమస్యలను పరిష్కరించే బలమైన ఆశయం, సాంప్రదాయ పద్ధతులను సవాలు చేసే ధైర్యం ఉన్న యువత ఎవరైనా దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న యువతీ యువకులకు ఈ అవకాశం అందుబాటులో ఉంది.

**దరఖాస్తు విధానం**

ఆసక్తి గల అభ్యర్థులు థీల్ ఫెలోషిప్ అధికారిక వెబ్‌సైట్ (https://thielfellowship.org/) ద్వారా ఆన్‌లైన్‌లో నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తుదారులు తమ వ్యక్తిగత నేపథ్యం, తాము చేస్తున్న లేదా చేయబోయే ప్రాజెక్ట్ వివరాలను సమర్పించాలి. తమ ఆలోచనల వెనుక ఉన్న దీర్ఘకాలిక లక్ష్యాలు, ఈ ఫెలోషిప్ తమకు ఎలా ఉపయోగపడుతుందనే అంశాలను స్పష్టంగా వివరించాల్సి ఉంటుంది. అత్యంత పారదర్శకంగా, పోటీతత్వంతో కూడిన స్క్రీనింగ్ ప్రక్రియ ద్వారా తుది విజేతలను ఎంపిక చేస్తారు.




# నష్టాల్లో ముగిసిన స్టాక్‌మార్కెట్లు

దేశీయ స్టాక్ మార్కెట్లు గురువారం నష్టాల్లో ముగిశాయి. పశ్చిమాసియాలో సంఘర్షణ తీవ్రమైన కారణంగా రిస్క్ సెంటిమెంట్ దెబ్బతినడతో నిఫ్టీ 50, సెన్సెక్స్ అస్థిర సెషన్ ను నష్టాలతో ముగించాయి. నిఫ్టీ 53.35 పాయింట్లు లేదా 0.23 శాతం తగ్గి 23,161.60 వద్ద, సెన్సెక్స్ 150.63 పాయింట్లు లేదా 0.20 శాతం క్షీణించి 73,832.55 వద్ద ముగిసింది. ఇన్ఫోసిస్, అదానీ పోర్ట్స్ & స్పెషల్ ఎకనామిక్ జోన్, ఎటర్నల్ నిఫ్టీ 50 ఇండెక్స్ లో టాప్ లూజర్స్ గా నిలిచాయి. విస్తృత మార్కెట్లలో, నిఫ్టీ మిడ్ క్యాప్ 0.81 శాతం, నిఫ్టీ స్మాల్ క్యాప్ 0.67 శాతం నష్టపోయాయి. రంగాల వారీగా చూస్తే నిఫ్టీ ఐటీ, నిఫ్టీ కన్స్యూమర్ డ్యూరబుల్, నిఫ్టీ కెమికల్ షేర్లు అత్యధికంగా క్షీణించాయి. నిఫ్టీ మీడియా, నిఫ్టీ ప్రైవేట్ బ్యాంక్, నిఫ్టీ ఫార్మా షేర్లు మెరుగైన పనితీరు కనబరిచాయి.

# సెబీకి వ్యతిరేకంగా వెళ్లము

**న్యూఢిల్లీ:** క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ ఆదేశాలకు అనుగుణంగా చేపట్టనున్న ఫోరెన్సిక్ ఆడిట్‌కు పూర్తిస్థాయిలో సహకరించనున్నట్లు బంగారు ఆభరణాలు, రిఫైనరీ కంపెనీ రాజేష్ ఎక్స్‌పోర్ట్స్ తాజాగా వెల్లడించింది. కంపెనీ 2020-21 నుంచి 2024-25 కాలంలో రూ. 15.15 లక్షల కోట్ల ఆదాయాన్ని అక్రమంగా నమోదుచేసినట్లు సెబీ గుర్తించింది. దీంతో తాజాగా ఫోరెన్సిక్ ఆడిట్‌కు సెబీ ఆదేశించింది. వీటిని సవాలు చేయబోమని కంపెనీ స్పష్టం చేసింది. కాగా.. ప్రాథమిక పరిశీలన అనంతరం ఆదాయ నమోదులో అక్రమాలకు తెరతీసినట్లు గుర్తించడంతో ఇటీవల కంపెనీ చైర్మన్ రాజేష్ మెహతాను సెక్యూరిటీల మార్కెట్ నుంచి సెబీ నిషేధించింది. అయితే ఎలాంటి అక్రమాలకూ పాల్పడలేదంటూ రాజేష్ మెహతా ప్రకటించడం గమనార్హం! సెబీ అడిగిన అన్ని డాక్యుమెంట్లనూ దాఖలు చేసినట్లు చెప్పారు. ఎక్కడో సమాచార లోపం ఏర్పడినట్లు వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే.



## దేశం-విదేశం NATIONAL-INTERNATIONAL



# 'మిమ్మల్ని చాలా మిస్సవుతున్నా దీదీ'..

## టీఎంసీ రెబల్ ఎంపీ భావోద్వేగం

తృణమూల్ కాంగ్రెస్ పార్టీలో అంతర్గత సంక్షోభం మరింత తీవ్రరూపం దాల్చింది. ఈ క్రమంలో పార్టీ అధినేత్రి మమతా బెనర్జీపై అసమ్మతి గళం వినిపిస్తున్న రెబల్ ఎంపీల్లో ఒకరైన ప్రముఖ నటి శతాబ్ది రాయ్ తాజాగా భావోద్వేగ వ్యాఖ్యలు చేశారు. రాజకీయపరంగా ఎన్డీయే కు మద్దతు తెలుపడం సరైన నిర్ణయమే అయినప్పటికీ.. నైతికంగా మాత్రం తాను తప్పు చేస్తున్నానన్న భావన కలుగుతోందని ఆమె అభిప్రాయపడ్డారు. ఈ క్రమంలో మమతా బెనర్జీకి ఏమైనా సందేశం ఇవ్వాలనుకుంటున్నారా..? అని మీడియా అడిగిన ప్రశ్నకు 'దీదీ మిమ్మల్ని చాలా మిస్ అవుతున్నా' అంటూ ఆమె భావోద్వేగానికి గురయ్యారు. పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో పరాజయం అనంతరం టీఎంసీ తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయింది. రాష్ట్ర అసెంబ్లీలో సుమారు 60 మందికి పైగా ఎమ్మెల్యేలు ఇప్పటికే తిరుగుబాటు బావుటా ఎగురవేయగా, ఇప్పుడు లోక్‌సభలోనూ అదే తరహా పరిస్థితి నెలకొన్నది. కాకోలీ ఘోష్ దస్తీదార్ నేతృత్వంలోని దాదాపు 20 మంది టీఎంసీ ఎంపీలు తమను ప్రత్యేక వర్గంగా గుర్తించాలని, తాము ఎన్డీఏకు మద్దతు ఇస్తున్నామని పేర్కొంటూ జూన్ 9న లోక్‌సభ స్పీకర్‌కు లేఖ రాశారు. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం నుంచి రక్షణ పొందేందుకే వారు ఈ వ్యూహం పన్నినట్లు తెలుస్తున్నది.



ఇటీవలే జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ కూటమి చేతిలో టీఎంసీ ఓటమి పాలైన నేపథ్యంలో ఈ పరిణామాలు చోటు చేసుకున్నాయి. మమతా బెనర్జీ కుటుంబ సభ్యులు పార్టీపై ఆధిపత్యం చెలాయిస్తున్నారని, పార్టీ పత్రాలపై ఫోర్జరీ సంతకాలు చేస్తున్నారని రెబల్స్ నేతలు తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు. ఈ ఆరోపణల నేపథ్యంలో పశ్చిమబెంగాల్ సీఐడీ అధికారులు మమత బెనర్జీ నివాసం సమీపంలోని టీఎంసీ ప్రధాన కార్యాలయంతోపాటు, అభిషేక్ బెనర్జీ కార్యాలయంలోనూ సోదాలు నిర్వహించడం సంచలనం సృష్టించింది. కాగా ఈ తిరుగుబాటును మమత బెనర్జీ వర్గం తీవ్రంగా ఖండిస్తోంది. రెబెల్స్ నాయకులంతా అవకాశవాదులని, వారు బీజేపీతో కుమ్మక్కయ్యారని విమర్శిస్తోంది.

# తమిళనాడులో ఉప ఎన్నికల సందడి.. సన్నాహాలు ప్రారంభించిన ఎన్నికల సంఘం..!

తమిళనాడులో ఉప ఎన్నికల సందడి నెలకొన్నది. ఆ రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఐదు అసెంబ్లీ నియోజకవర్గాలకు ఉప ఎన్నికలు నిర్వహించేందుకు భారత ఎన్నికల సంఘం ప్రాథమిక ఏర్పాట్లు ప్రారంభించింది. ముఖ్యమంత్రి విజయ్ సహా పలువురు ఎమ్మెల్యేల రాజీనామాలతో ఈ స్థానాలు ఖాళీ అయ్యాయి. ఇటీవలి ఎన్నికల్లో తిరుచ్చి ఈస్ట్, పెరంబూర్ స్థానాల నుంచి గెలిచిన విజయ్.. నిబంధనల ప్రకారం తిరుచ్చి ఈస్ట్ స్థానానికి రాజీనామా చేశారు. దీంతో ఆ స్థానం ఖాళీ అయింది.దీనికి తోడు టీఎంసీ ప్రభుత్వానికి విశ్వాస పరీక్షలో మద్దతిచ్చిన నలుగురు అన్నాడీఎంకే ఎమ్మెల్యేలు ఎస్ జయకుమార్ (పెరందురై), మరగతం కుమరవేల్ (మధురాంతకం), పీ సత్యభామ (ధారపురం), ఇసక్కీ సుబ్బయ్య (అంబసముద్రం) తమ పదవులకు రాజీనామా చేసి అధికార పార్టీలో చేరారు. దాంతో మరో నాలుగు స్థానాలు ఖాళీ అయ్యాయి. ఈ నేపథ్యంలో ఎన్నికల సంఘం క్షేత్రస్థాయిలో ఏర్పాట్లు మొదలు పెట్టింది. జూన్ 22 నాటికి అన్ని సన్నాహక ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా ఎన్నికల అధికారులను ఈసీ ఆదేశించింది. ఐదు నియోజకవర్గాలకు రిటర్నింగ్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులను కూడా నియమించింది. పరిపాలన, లాజిస్టిక్స్ అంశాలను సమీక్షించిన తర్వాత రాబోయే వారాల్లో ఉప ఎన్నికల షెడ్యూల్‌పై అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది.




# మళ్లీ తెరపైకి రాజస్థాన్ కాంగ్రెస్ విభేదాలు..

## గెహ్లాట్ వ్యాఖ్యలకు పైలట్ కౌంటర్




రాజస్థాన్ కాంగ్రెస్ లో సీనియర్ నాయకులు అశోక్ గెహ్లాట్, సచిన్ పైలట్ మధ్య నెలకొన్న విభేదాలు మరోసారి బయటపడ్డాయి. తనపై వస్తున్న విమర్శలకు సచిన్ పైలట్ పరోక్షంగా పదునైన రీతిలో స్పందించారు. నిజాయతీ, వ్యక్తిగత వైరం వంటి అంశాలను ప్రస్తావిస్తూ ఆయన చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. మాజీ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్ గత విభేదాలను ఉటంకిస్తూ ఇటీవల చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో పైలట్ స్పందన ప్రాధాన్యత సంతరించుకుంది. కరౌలీ జిల్లాలోని సకర్‌ఘటా గ్రామంలో బుధవారం తన తండ్రి రాజేష్ పైలట్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో సచిన్ పైలట్ ప్రసంగించారు. 'ఎవరైనా కళ్లలోకి నేరుగా చూస్తే వారు నిజం చెబుతున్నారో లేదో తెలిసిపోతుంది. నేను కలిసి పనిచేసిన నాయకులను ఎప్పుడూ గౌరవించాను. అభిప్రాయ భేదాలు ఉండవచ్చు. కానీ వ్యక్తిగత శత్రుత్వం ఎప్పుడూ లేదు' అని ఆయన స్పష్టంచేశారు. రాజకీయాల్లో పదవుల కంటే ప్రజాసేవకే తొలి ప్రాధాన్యత ఇవ్వాలని.. సత్యం, ప్రజా ప్రయోజనాల పక్షాన నిలిచిన వారే అంతిమ విజేతలుగా నిలుస్తారని పేర్కొన్నారు. జూన్ 7న గెహ్లాట్ మాట్లాడుతూ.. 2022 సెప్టెంబర్ 25న జరిగిన ఎమ్మెల్యేల సమావేశం అధిష్ఠానంపై తిరుగుబాటు కాదని, పైలట్‌ను ముఖ్యమంత్రిని చేయడాన్ని వ్యతిరేకిస్తూ జరిగిన ఘటన అని పేర్కొన్నారు. గతంలో పైలట్‌ను కేంద్ర మంత్రిని చేయడంలో తాను పోషించిన పాత్రను ఆయన ఎప్పుడూ ప్రస్తావించకపోవడం వ్యక్తిగతంగా తనను కలచివేసిందని గెహ్లాట్ వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలకే పైలట్ తాజాగా తనదైన శైలిలో సమాధానమిచ్చినట్లు కనిపిస్తోంది. ఈ కార్యక్రమంలో పైలట్ ప్రధాన అనుచరుడు, మాజీ మంత్రి రమేశ్ మీనా.. అశోక్ గెహ్లాట్‌పై నేరుగా విమర్శలు గుప్పిస్తూ, 2020 నాటి రాజకీయ సంక్షోభంపై నార్కో టెస్టులు నిర్వహించాలని డిమాండ్ చేశారు. అయితే ఆ వ్యాఖ్యలపై పైలట్ మాత్రం స్పందించలేదు. ఈ తాజా పరిణామాలు రాజస్థాన్ కాంగ్రెస్‌లో అంతర్గత విభేదాలు ఇంకా సద్దుమణగలేదని తేటతెల్లం చేస్తున్నాయి.

# భారత నౌక ఎంటీ జల్‌వీర్‌పై అటాక్..

## ఒమన్ తీరంలో మరో ఘటన

**న్యూఢిల్లీ :** భారత్‌కు చెందిన మరో వాణిజ్య నౌక ఎంటీ జల్‌వీర్‌పై ఇవాళ అటాక్ జరిగింది. ఒమన్ తీరంలో ఆ నౌకపై దాడి జరిగినట్లు తెలుస్తోంది. ఆ నౌకలో సుమారు 20 మంది భారతీయ నావికులు ఉన్నారు. నౌక నుంచి భారీ ఎత్తున నల్లటి పొగ విస్తరిస్తోంది. బహుశా డ్రోన్ దాడి జరిగి ఉంటుందని అనుమానిస్తున్నారు. అయితే ఈ ఘటన పట్ల ఇంకా పూర్తిగా విషయాలు తెలియడం లేదని ఒమన్‌లోని భారతీయ ఎంబసీ పేర్కొన్నది. స్థానిక అధికారులతో దీనిపై సమాచారం సేకరిస్తున్నట్లు ఎంబసీ వెల్లడించింది. ఒమన్‌లోని సిన్హాస్ పోర్టు సమీపంలో ఘటన జరిగినట్లు అంచనా వేస్తున్నారు. అమెరికాఇరాన్ఇజ్రాయిల్ యుద్ధం వల్ల హోర్ముజ్ జలసంధిలో ప్రస్తుతం ఉద్రిక్తకర వాతావరణం నెలకొన్న విషయం తెలిసిందే. సుమారు 18 టార్గెట్లపై అటాక్ చేసినట్లు తాజాగా ఐఆర్జీసీ పేర్కొన్నది. జోర్డాన్, కువైట్, బహ్రెయిన్‌లో ఉన్న అమెరికా స్థావరాలపై దాడి చేసినట్లు ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్ కార్ప్స్ ప్రకటించింది. జోర్డాన్ అల్ అజ్రక్ ఎయిర్‌బేస్‌పై 12 బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించినట్లు ఐఆర్జీసీ తెలిపింది. అక్కడ అమెరికా తన జెట్స్‌ను స్టేషన్ చేసింది. ఎఫ్15, ఎఫ్16, ఎఫ్35 విమానాలు అక్కడ ఉన్నట్లు తెలిసింది. తమ దాడిలో అమెరికాకు చెందిన అనేక యుద్ధ విమానాలు ధ్వంసం అయినట్లు ఇరాన్ పేర్కొన్నది. బాలిస్టిక్ క్షిపణులు, డ్రోన్లతో ఆపరేషన్ చేపట్టినట్లు ఇరాన్ తెలిపింది.



# ఇండియన్ సినిమా గమనాన్ని మార్చిన దిగ్గజం..

## భారతీరాజా మృతి పట్ల ప్రధాని మోదీ సంతాపం



ప్రముఖ చలనచిత్ర దర్శకుడు భారతీరాజా మరణం పట్ల ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. భారతీయ సినిమా రంగంలో, ముఖ్యంగా తమిళ చిత్ర పరిశ్రమలో ఆయన ఒక దిగ్గజమని, తన అద్భుతమైన సృజనాత్మకతతో తమిళ సినిమా గమనాన్నే మార్చేశారని ప్రధాని కొనియాడారు. ఈ మేరకు ఆయన తన అధికారిక ఎక్స్ ఖాతాలో సంతాప సందేశాన్ని పంచుకున్నారు. భారతీరాజా గ్రామీణ జీవనాన్ని, పల్లెటూరి వాతావరణాన్ని వెండితెరపై ఆవిష్కరించిన తీరు అద్భుతమని, అది ఎప్పటికీ ప్రశంసనీయంగా నిలిచిపోతుందని మోదీ పేర్కొన్నారు. ఈ కష్టసమయంలో ఆయన కుటుంబ సభ్యులకు, అభిమానులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ.. ఆయన ఆత్మకు శాంతి కలగాలని ఓం శాంతి అంటూ ప్రధాని నివాళులర్పించారు. మరోవైపు భారతీరాజా అంత్యక్రియలు ఆయన స్వగ్రామమైన తేనిలో గురువారం మధ్యాహ్నం 3 గంటలకు పూర్తి ప్రభుత్వ అధికారిక లాంఛనాలతో నిర్వహించనున్నారు. ఇందుకోసం అధికారులు ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. 1977లో వచ్చిన క్లాసిక్ హిట్ '16 వయతినిలే' సినిమాతో దర్శకుడిగా ప్రస్థానాన్ని ప్రారంభించిన భారతీరాజా.. దాదాపు నాలుగు దశాబ్దాల పాటు సాగిన సినీ ప్రస్థానంలో 40కి పైగా చిత్రాలను తెరకెక్కించారు. తమిళ చిత్రసీమలో ఆయన అందించిన విశేష సేవలకు గానూ 'ఇయక్కునర్ ఇమయం' (దర్శక శిఖరం) అనే బిరుదును దక్కించుకున్నారు.

మహా పత్రిక
WWW.MAHAADAILY.COM | సినిమా వార్తలు | MOVIE NEWS | శుక్రవారం, హైదరాబాద్ | 12-06-2026




## స్క్రిప్ట్ లో అలాంటి సీన్స్ లేవు.. అయినా ఆ హీరో పదే పదే నన్ను..

సినిమా ఇండస్ట్రీలో నటీమణులు ఎదుర్కొనే ఇబ్బందులు, వేధింపుల గురించి తరచూ చర్చ జరుగుతూనే ఉంటుంది. ముఖ్యంగా మీటూ ఉద్యమం తర్వాత ప్రముఖ హీరోయిన్లు, నటీమణులు తమకు ఎదురైన చేదు అనుభవాలను బహిరంగంగా పంచుకుంటున్నారు. ఇప్పుడు ఈ జాబితాలోకి మరో స్టార్ నటి చేరింది. మలయాళ సినిమా పరిశ్రమకు చెందిన ప్రియా బాపట్ తన కెరీర్ ప్రారంభంలో ఎదురైన వేధింపులను గుర్తు చేసుకుని బాగా ఎమోషనలైంది. ఓ పాట షూటింగ్ సమయంలో తన కోయాక్టర్ స్క్రిప్ట్ లో లేని సన్నివేశాలను ఇంప్రొవైజేషన్ పేరుతో చేయడమే కాకుండా పదేపదే బలవంతంగా ముద్దుపెట్టుకున్నాడని ప్రియా వాపోయింది. ‘ ఒక సినిమా షూటింగ్ లో పాట చిత్రీకరణ సమయంలో స్క్రిప్ట్ లో ఎక్కడా కిస్సింగ్ సీన్స్ లేవు. అయినప్పటికీ నా సహనటుడు ఇంప్రొవైజేషన్ పేరుతో లిమిట్స్ దాటాడు. కెమెరా ముందే పదేపదే నన్ను ముద్దుపెట్టుఉకున్నాడు. అప్పుడు సెట్ లో పెద్ద సంఖ్యలో సిబ్బంది ఉండటం, నేను కొత్తగా ఇండస్ట్రీలో అడుగుపెట్టడం వంటి కారణాలతో వెంటనే స్పందించలేకపోయాను’. ‘ఆ సమయంలో నాకు ఎలా రియాక్ట్ అవ్వాలో తెలియలేదు. అతడిని అడ్డుకోవాలా, డైరెక్టర్‌కు చెప్పాలా, లేక షూటింగ్ ఆపాలా అనే అయోమయంలో ఉండిపోయాను. కెమెరా ముందే పదేపదే నన్ను ముద్దు పెడుతుంటే చాలా అవమానంగా అనిపించింది. కానీ నా ఎమోషన్స్ ను దాచుకుని నటించాల్సి వచ్చింది. ఆ ఘటన గుర్తుకొచ్చినప్పుడల్లా ఇప్పటికీ బాధ కలుగుతుంది. కొన్ని సందర్భాల్లో కన్నీళ్లు కూడా వచ్చాయి. ఆ హీరో వేధింపులు అక్కడితో ఆగలేదు. ఒకే హోటల్‌లో వేర్వేరు గదుల్లో ఉంటున్నప్పటికీ ప్రతిరోజూ నన్ను బ్రేక్‌ఫాస్ట్ లేదా డిన్నర్‌కు రావాలని ఒత్తిడి చేసేవాడు. నేను నో అని చెప్పినప్పటికీ అతనిలో మార్పు రాలేదు’.



## అందంతో కిక్కెక్కిస్తోన్న భాగ్య శ్రీ బోర్సే..

టాలీవుడ్‌లో ఇటీవల కాలంలో తన అందం, అభినయంతో యూత్‌ను అమితంగా ఆకట్టుకుంటున్న సరికొత్త కథానాయిక భాగ్యశ్రీ బోర్సే. తక్కువ సమయంలోనే విపరీతమైన క్రేజ్ సొంతం చేసుకుంది. సోషల్ మీడియాలో నిరంతరం యాక్టివ్‌గా ఉండే ఈ ముద్దుగుమ్మ, తాజాగా షేర్ చేసిన సాంప్రదాయ దుస్తుల ఫొటోలు ఇప్పుడు ఇంటర్నెట్‌ను ఊపేస్తున్నాయి. తాజాగా నెట్టింట వైరలవుతున్న ఫొటోలలో భాగ్యశ్రీ లంగా ఓణీలో అచ్చమైన తెలుగుదనం ఉట్టిపడేలా మెరిసిపోతోంది. ఆమె నవ్వు, హావభావాలు అభిమానుల గుండెల్లో గుబులు రేపుతున్నాయి. మోడలింగ్ రంగం నుంచి వెండితెరకు పరిచయమైన భాగ్యశ్రీ బోర్సే, టాలీవుడ్‌లో మాస్ మహారాజా రవితేజ సరసన 'మిస్టర్ బచ్చన్' సినిమాతో తెలుగు తెరకు పరిచయమైంది ఈ అమ్మడు. ఆ సినిమాలో కేవలం నటనతోనే కాకుండా, తన గ్లామర్ , డ్యాన్స్ స్టెప్పులతో మొదటి సినిమాతోనే టాలీవుడ్ క్రష్‌గా మారిపోయింది. లేటెస్ట్ ఫోటలలో అందం, స్టైల్‌తో కవ్విస్తుంది.కేవలం మోడరన్ దుస్తుల్లోనే కాదు, హాఫ్ శారీ , పట్టుచీరల వంటి సాంప్రదాయ దుస్తులలో కూడా మరింత అందంగా కనిపిస్తూ మెస్మరైజ్ చేస్తూ సోషల్ మీడియాలో అలరిస్తుంది ఈ అమ్మడు. ఈ ఫొటోలలో భాగ్యశ్రీ కళ్లలో ఉన్న మెరుపు, ఆమె ధరించిన ఆభరణాలు, దుస్తుల డిజైన్ నెటిజన్లను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. దీంతో ఈ ఫొటోలు క్షణాల్లో వైరల్‌గా మారాయి.ప్రస్తుతం తెలుగు చిత్రసీమలో ఈ భామకు వరుస అవకాశాలు క్యూ కడుతున్నాయి. యువ హీరోల సరసన క్రేజీ ప్రాజెక్టులలో నటిస్తూ బిజీగా గడుపుతోంది. నటనకు ప్రాధాన్యమున్న పాత్రలను ఎంచుకుంది.




## సినిమాలకు దూరం..అయినా ఇప్పటికీ తగ్గని క్రేజ్..

వివాహం అనేది ఒక వ్యక్తిగత నిర్ణయం. సెలబ్రిటీల విషయానికి వస్తే, వారి వ్యక్తిగత నిర్ణయాలపై అభిమానులు సోషల్ మీడియాలో తమ అభిప్రాయాలను వెల్లడిస్తూనే ఉన్నారు. ఇక ఈ నటి విషయానికొస్తే, ఆమె పెళ్లి చేసుకోకుండా జీవిస్తోంది. కానీ, ఆమె 24 ఏళ్లకే తల్లి అయింది. అయితే కెరీర్ మంచి ఫాంలో ఉన్నప్పుడే తాను తీసుకున్న నిర్ణయం కారణంగా ఆమె సినీ కెరీర్ మొత్తం నాశనమైపోతుందని ఆమె మేనేజర్ హెచ్చరించారు. కానీ ఆ నటి దాన్ని పెద్దగా పట్టించుకోలేదు. ఆ తర్వాత సైతం ఆమె వరుస హిట్ మూవీస్ చేసి స్టార్ డమ్ అందుకుంది. గత 10 ఏళ్లుగా ఆమె ఏ సినిమాల్లోనూ నటించలేదు. అయినప్పటికీ ఆమె క్రేజ్ ఏమాత్రం తగ్గలేదు. ఇంతకీ ఆమె ఎవరో తెలుసా.. ? తనే హీరోయిన్ సుష్మితా సేన్. 1997లో ప్రవీణ్ గాంధీ దర్శకత్వంలో నాగార్జున నటించిన రక్షకుడు సినిమాలో కథానాయికగా కనిపించి తెలుగు ప్రేక్షకులకు దగ్గరయ్యింది. ఈ సినిమాతో సౌత్ ఇండస్ట్రీలో ఫుల్ ఫేమస్ అయ్యింది. ఆ తర్వాత ఆమె అర్జున్ నటించిన ‘ముత్తలవన్’ చిత్రంలో ప్రత్యేక పాత్రలో కనిపించింది. కానీ ఆమెకు ఆశించిన స్థాయిలో ఆఫర్స్ రాలేదు. తెలుగులో క్లిక్ కాకపోయినప్పటికీ ఆమె బాలీవుడ్‌లో అగ్ర కథానాయికగా ఎదిగింది. అయితే పెళ్లి చేసుకుండానే 2000వ సంవత్సరంలో 24 ఏళ్ల వయసులోనే ఒక బిడ్డను దత్తత తీసుకుంది. ఆమె ఆ బిడ్డకు రెనీ సేన్ అని పేరు పెట్టారు. ఆ తర్వాత, 2010లో, ఆమె అలిస్సా అనే మరో పాపను దత్తత తీసుకున్నారు. ఒక ఇంటర్వ్యూలో, ఆ సమయంలో తన మేనేజర్ అలా చేయవద్దని తనను గట్టిగా హెచ్చరించారని సుష్మితా సేన్ చెప్పారు. “నా నిర్ణయం తర్వాత, నా మేనేజర్ నా దగ్గర జాబ్ మానేశారు. నీకు నీ కెరీర్ పట్ల శ్రద్ధ లేదు. 24 ఏళ్లకే తల్లి అయిన మీతో నేను పనిచేయాలనుకోవడం లేదు.

## సింగ్ గీతంపై చిరు ట్వీట్



లెజండరీ దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు తెరకెక్కించిన కొత్త మూవీ ‘సింగ్ గీతం’. వైజయంతి మూవీస్, స్వప్న సినిమాస్ పై నాగ్ అశ్విన్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 12న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో చిత్రబృందానికి ఆల్ ది బెస్ట్ చెబుతూ చిరంజీవి ట్వీట్ చేశాడు. ‘శ్రీ సింగీతం శ్రీనివాసరావు గారు..తెలుగు సినిమా పరిశ్రమకు ఆయన ఒక భీష్మాచార్యుడు. ఆయన ఒక అమూల్యమైన ఆస్తి, ఒక నిధి. దర్శకుడిగా ఎన్నో విజయవంతమైన చిత్రాలు అందించడమే కాకుండా, ఎంతోమంది కళాకారులకు అవకాశాలు కల్పించి వారి జీవితాలకు మార్గదర్శకుడయ్యారు. అలాంటి మహోన్నత వ్యక్తి దర్శకత్వంలో ఈ నెల 12 వ తేదీన సింగ్ గీతం సినిమా విడుదల అయ్యి, ఇండియన్ సినిమాలో మరొక మైలురాయి గా నిలుస్తుందని, పెద్ద విజయం సాధించాలని నేను మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను.అలాగే ఇలాంటి పెద్దలను గౌరవిస్తూ, వారి అనుభవాన్ని కొత్త తరానికి అందించే ఆలోచనతో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్న నిర్మాత నాగ్ అశ్విన్ ను ప్రత్యేకంగా అభినందిస్తున్నాను. ఒకవైపు ఆ నాటి తరానికి ప్రతినిధిగా నిలిచిన సింగీతం శ్రీనివాసరావు, రోవైపు ఈ తరం ఆలోచనలను ప్రతిబింబించే నాగ్ అశ్విన్..వీరి కలయిక ఎంతో స్ఫూర్తిదాయకంగా ఉంది.అలాగే ఈ చిత్రానికి, నాకెంతో ఇష్టమైన దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందించడం మరింత ఉత్సాహాన్ని కలగజేస్తుంది. నాగ అశ్విన్ కి, స్వప్న సినిమా, వైజయంతి మూవీస్‌కి,అలాగే ఈ చిత్రం లో నటించిన నటీనటులకు, సాంకేతిక నిపుణులకు నా హృదయపూర్వక శుభాకాంక్షలు’ అని చిరంజీవి ట్వీట్ చేశాడు.




## బాక్సాఫీస్ ఛాంపియన్‌గా రామ్ చరణ్ పెద్ది..

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్, ‘ఉప్పెన’ ఫేమ్ బుచ్చిబాబు సనా కాంబినేషన్ లో వచ్చిన లేటెస్ట్ సినిమా ‘పెద్ది’. విలేజ్ స్పోర్ట్స్ డ్రామా తెరకెక్కిన ఈ మూవీలో బాలీవుడ్ అందాల తార జాన్వీ కపూర్ హీరోయిన్ గా. జూన్ 04న ప్రేక్షకుల ముందుకు వచ్చిన పెద్ది సినిమా మొదటి రోజు నుంచే భారీ వసూళ్లు సాధిస్తోంది. విడుదలైన అన్ని చోట్లా రికార్డు కలెక్షన్లు రాబడుతోంది. ఈ నేపథ్యంలో పెద్ది సినిమా మొదటి వారం రన్ పూర్తి చేసుకుంది. ఈ మేరకు రామ్ చరణ్ సినిమా ఏడు రోజుల కలెక్షన్ల వివరాలను చిత్ర బృందం ప్రకటించింది.ఇప్పటివరకు ప్రపంచవ్యాపం రూ.345 కోటకు పైగా గ్రాస్ వసూలు చేసినట్లు దర్శక నిర్మాతలు ప్రకటించారు. ఈ మేరకు ‘బాక్సాఫీస్ రియల్ ఛాంపియన్‌గా ‘పెద్ది’ అంటూ సోషల్ మీడియా వేదికగా కొత్త పోస్టర్ కూడా రిలీజ్ చేశారు. ఇక ఓవర్సీస్ లోనూ పెద్ది సినిమాకు రికార్డు కలెక్షన్లు వస్తున్నాయి. నార్త్ అమెరికాలో ఇప్పటికే 3 మిలియన్ల డాలర్ల మార్క్ ను పెద్ది అధిగమించింది. కాగా ఈ వారంలోనూ థియేటర్లలో పెద్ద సినిమాలేవీ రిలీజ్ కావడం లేదు. కాబట్టి మరికొన్ని రోజులు పెద్ది జోరు కొనసాగవచ్చునని ట్రేడ్ నిపుణులు అంచనా వేస్తున్నారు. లాంగ్ రన్ లో మరిన్ని కలెక్షన్లు వచ్చే అవకాశముందని అభిప్రాయపడుతున్నారు. వృది సినిమాస్ సమర్పణలో మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సంయుక్తంగా భారీ బడ్జెట్ తో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా పెద్ది చిత్రాన్ని నిర్మించారు. శివరాజ్ కుమార్, జగపతిబాబు, దివ్యేందు శర్మ, రావు రమేష్, బొమన్ ఇరానీ, రవి కిషన్, కమెడియన్ సత్య, చమ్మక్ చంద్ర, అజయ్ ఘోష్ తదితరులు ప్రధాన పాత్రలు పోషించారు. ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ ఈ మూవీకి స్వరాలు అందించారు. మరీ ముఖ్యంగా రత్నవేలు అందించిన సినిమాటోగ్రఫీ పెద్ది సినిమా సక్సెస్ లో మెయిన్ పిల్లర్ గా నిలిచింది.

## నాని ది ప్యారడైజ్ షూటింగ్ ఆలస్యం.. రెండు పార్టులుగా ప్లాన్ చేస్తున్నారా?


టాలీవుడ్ స్టార్ నటుడు నాని హీరోగా, శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో రూపొందుతున్న అత్యంత ప్రతిష్ఠాత్మకమైన భారీ చిత్రం ‘ది ప్యారడైజ్’. వీరిద్దరి కాంబినేషన్‌లో గతంలో వచ్చిన బ్లాక్‌బస్టర్ హిట్ ‘దసరా’ తర్వాత వస్తున్న సినిమా కావడంతో, ఈ ప్రాజెక్ట్‌పై ప్రకటన వచ్చిన మొదటి రోజు నుంచే అంచనాలు ఆకాశాన్ని తాకాయి. ఈ చిత్రంలో నాని సరసన కయాదు లోహర్ కథానాయికగా నటిస్తోంది. అయితే, ప్రస్తుతం ఈ సినిమా చుట్టూ ఫిలిం నగర్ సర్కిల్స్‌లో ఒక ఆసక్తికరమైన చర్చ నడుస్తోంది. సినిమా షూటింగ్ ఊహించిన దానికంటే ఎక్కువగా ఆలస్యం అవుతుండడం, మరోవైపు సినిమాపై ఉన్న హైప్ క్రమంగా తగ్గే ప్రమాదం ఉందనే ఆందోళన అభిమానుల్లో వ్యక్తమవుతుండడమే దీనికి ప్రధాన కారణం. సాధారణంగా నాని సినిమాలు చాలా వేగంగా, పక్కా ప్లానింగ్‌తో పూర్తవుతుంటాయి. కానీ, ‘ది ప్యారడైజ్’ విషయంలో మాత్రం కథ వేరేలా కనిపిస్తోంది. అనుకున్న సమయానికి సినిమా పూర్తి కాకపోవడం నాని అభిమానులను సైతం తీవ్ర ఆశ్చర్యానికి గురి చేస్తోంది. ఎందుకంటే,



ఈ ప్రాజెక్ట్ ప్రారంభమైనప్పటి నుండి నాని గానీ, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల గానీ, లేదా ఈ చిత్రంలోని ఇతర ముఖ్య నటీనటులు గానీ మరే ఇతర కొత్త సినిమాకూ కమిట్ అవ్వలేదు. అందరూ పూర్తిగా ఈ ఒక్క సినిమాపైనే తమ దృష్టిని కేంద్రీకరించారు. అయినప్పటికీ, గత కొన్ని నెలలుగా నిరంతరాయంగా షూటింగ్ జరుగుతున్నా, ఇంకా దాదాపు రెండు నెలలకు పైగానే టాకీ పార్ట్ మరియు మేజర్ యాక్షన్ షెడ్యూల్స్ బ్యాలన్స్ ఉన్నాయనే సరికొత్త రూమర్స్ ఇండస్ట్రీలో బలంగా వినిపిస్తున్నాయి. ఈ సుదీర్ఘమైన షూటింగ్ షెడ్యూల్స్ వెనుక ఉన్న అసలు కారణాలపై ఇప్పుడు సరికొత్త ఊహాగానాలు మొదలయ్యాయి. ఇన్ని రోజులుగా చిత్రీకరణ జరుపుకుంటుందంటే, ‘ది ప్యారడైజ్’ చిత్రాన్ని ఒకేసారి రెండు భాగాలుగా తెరకెక్కిస్తున్నారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే ఈ సినిమాకు సంబంధించి గంటల కొద్దీ భారీ ఫుటేజ్ లభించి ఉంటుందని, కథా పరిధి చాలా పెద్దది కావడం వల్లే దర్శకుడు శ్రీకాంత్ ఓదెల దీనిని రెండు భాగాలుగా ప్లాన్ చేసి ఉండవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు. అంతేకాకుండా, ఇదొక గ్రాండ్ స్కేల్ పీరియాడిక్ డ్రామా కావడం వల్ల, ఖచ్చితంగా సీక్వెల్స్ చేయడానికి బలమైన స్కోప్ ఉంటుందని కూడా టాక్ నడుస్తోంది. ఏదేమైనా, ఈ రిలీజ్ రూమర్స్ మరియు రెండు భాగాల ప్రచారంపై అసలు నిజం ఏంటనేది చిత్ర యూనిట్ అధికారికంగా ప్రకటిస్తేనే నాని అభిమానులకు పూర్తి స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

## అందంలో అప్సరస.. అయినా స్టార్ డమ్ రాలేదు..

తెలుగు చలనచిత్ర పరిశ్రమలో ప్రతిభ ఉన్న ఎంతోమంది నటీమణులు తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటూ ఉంటారు. కొందరు ఒక్క సినిమాతోనే ఓవర్‌నైట్ స్టార్స్ అయిపోతే, మరి కొందరు వరుస విజయాలు అందుకున్నప్పటికీ, ప్రేక్షకుల ఆదరణను పూర్తిగా పొందలేక ఇబ్బంది పడుతుంటారు. ఈ కోవకు చెందిన నటి శాన్వి మేఘన . వరుసగా సక్సెస్ ఫుల్ చిత్రాల్లో నటించినప్పటికీ, ఆమెకు రావాల్సిన స్థాయిలో స్టార్‌డమ్ ఇంకా రావడం లేదనేది అసలు విషయం. 1998 సెప్టెంబరు 12న హైదరాబాద్‌లో జన్మించిన శాన్వి మేఘన, తన నటనతో తెలుగు ప్రేక్షకులను అలరిస్తూ వస్తోంది. 2019లో భారీ అంచనాలతో వచ్చిన "సైరా నరసింహారెడ్డి" సినిమాతో తన సినీ జర్నీని ప్రారంభించింది. ఆ తర్వాత "పిట్ట కథలు", "బిలాల్‌పూర్ పోలీస్ స్టేషన్", "పుష్పక విమానం", "మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచ్‌లర్" వంటి వైవిధ్యమైన చిత్రాల్లో నటించి తనకంటూ ఒక గుర్తింపును తెచ్చుకునే ప్రయత్నం చేసింది. ముఖ్యంగా "పుష్పక విమానం" సినిమాలో ఆమె పోషించిన పాత్ర ప్రేక్షకులకు బాగా దగ్గరయ్యింది. తెలుగులో ఇప్పటి వరకు ఆరు సినిమాల వరకు చేసిన శాన్వి, తమిళంలోనూ తన అదృష్టాన్ని పరీక్షించుకుంది. అక్కడ "కుటుంబస్థాన్" అనే చిత్రంలో నటించి మంచి విజయాన్ని అందుకుంది. రీసెంట్‌గా తెలుగులో "టుక్ టుక్" అనే సినిమాతో ప్రేక్షకులను పలకరించింది. అయితే, ఆమె నటించిన చాలా సినిమాలు బాక్సాఫీస్ వద్ద మంచి టాక్ సొంతం చేసుకున్నాయి. సినిమా హిట్టైనా, ఆ విజయాల్లో తను కూడా ఒక భాగమైనా, ప్రేక్షకుల్లో మాత్రం ఇంకా సరైన గుర్తింపు రావడం లేదు. తన నటనతో ప్రశంసలు అందుకుంటున్న ఈ అమ్మడు ఇప్పుడు అటు ఇండస్ట్రీలో, ఇటు సోషల్ మీడియాలో సైలెంట్ అయ్యింది.



OWNED BY N SREENIVAS RAO. EDITED, PRINTED AND PUBLISHED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com